





## డిమాండ్ పుంజుకుంటుంది

వరుణ్ బెరీ

‘వృద్ధి మందగమనం నేపథ్యంలో పల్లెల్లో డిమాండ్ మందగించింది. దీన్ని చక్కదిద్దేందుకు మోదీ సర్కారు గ్రామీణాభివృద్ధి, మౌలికవసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వడం మంచి ఫలితాలిస్తుంది. దీనివల్ల ఎఫ్ఎంసీజీ రంగంలో కూడా వినియోగ డిమాండ్ పుంజుకోవడానికి దోహదం చేస్తుంది’.

- వరుణ్ బెరీ, బ్రిటానియా ఇండస్ట్రీస్ ఎండీ

## ఎలక్ట్రిక్ వాహనాలపై కస్టమ్స్ డ్యూటీ పెంపు

విద్యుత్ వాహనాల తయారీని దేశీయంగా ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దిగుమతి చేసుకునే ఎలక్ట్రిక్ వాహనాలపై కస్టమ్స్ డ్యూటీ పెంపును ఆర్థిక మంత్రి ప్రతిపాదించారు. మొబైల్ విడిభాగాలపైనా కస్టమ్స్ సుంకాన్ని సవరిస్తున్నట్టు మంత్రి వెల్లడించారు. పూర్తిగా నిర్మితమై (సీబీయూ) దేశంలోకి దిగుమతి అయ్యే వాణిజ్య విద్యుత్ వాహనాలపై 2020 ఏప్రిల్ 1 నుంచి కస్టమ్స్ డ్యూటీ ప్రస్తుతమున్న 25 శాతం స్థానంలో 40 శాతం అమలవుతుందని తెలిపారు. విదేశాల్లోనే కొంత వరకు నిర్మాణం పూర్తి చేసుకుని (ఎస్‌కేడీ) దిగుమతి అయ్యే ప్యాసింజర్ విద్యుత్ వాహనాలపై సుంకం 15 నుంచి 30 శాతానికి పెరుగుతుందని ప్రకటించారు.






## న్యూస్‌ప్రింట్‌పై దిగుమతి సుంకం తగ్గింపు



**న్యూఢిల్లీ:** కేంద్ర బడ్జెట్‌లో న్యూస్‌ప్రింట్‌పై 5 శాతం వరకు దిగుమతి సుంకాన్ని ప్రభుత్వం తగ్గించింది. గత బడ్జెట్‌లో న్యూస్ ప్రింట్‌పై 10 శాతం దిగుమతి సుంకం విధించింది. ‘దిగుమతి సుంకం భారీగా ఉండటం వల్ల ఇప్పటికే తీవ్ర నష్టాలతో కొట్టుమిట్టాడుతున్న ప్రింట్‌మీడియాపై అదనపు భారం పడుతోందని నా దృష్టికి తెచ్చారు. న్యూస్ ప్రింట్, లైట్ వెయిట్ కోటెడ్ పేపర్‌పై 10 శాతం ఉన్న మౌలిక దిగుమతి సుంకాన్ని 5 శాతానికి తగ్గించేలా ప్రతిపాదిస్తున్నా’ అని ఆర్థిక మంత్రి పేర్కొన్నారు.

## సౌర ఫలకాలపై సుంకం రద్దు



**న్యూఢిల్లీ:** సౌరఫలకాలపై దిగుమతి సుంకాన్ని కేంద్రం తాజా బడ్జెట్‌లో పూర్తిగా ఎత్తేసింది. ఇప్పటివరకు ఉన్న 20 శాతాన్ని సున్నా శాతానికి తగ్గించింది. సుంకం తగ్గింపు వెంటనే అమల్లోకి వస్తుందని ప్రకటించింది. 2022 నాటికి 100 గిగావాట్ల సౌర విద్యుత్ శక్తి తయారుచేయాలని నిర్ధారించుకున్న ప్రభుత్వ లక్ష్యం నేపథ్యంలో ఈ దిగుమతి సుంకం తగ్గించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## కశ్మీర్, లదాఖ్‌కు నిధులు



**న్యూఢిల్లీ:** కేంద్ర బడ్జెట్‌లో జమ్మూకశ్మీర్, లదాఖ్‌లకు కేంద్రం భారీగా నిధులను కేటాయించింది. జమ్మూకశ్మీర్ అభివృద్ధికి రూ. 30,757 కోట్లను, లదాఖ్‌కు రూ. 5,958 కోట్లను కేంద్రం ప్రకటించింది. జమ్మూకశ్మీర్లో కేంద్రపాలిత ప్రాంతాల విపత్తు నిధి కోసం రూ.279 కోట్లు, ఆర్థిక అంతరాలను పూడ్చేందుకు రూ. 30,475 కోట్లను కేంద్రం వెచ్చించనుంది. లదాఖ్‌లో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి 83.38 కోట్ల రూపాయలు, ఇతర ప్రజా ప్రయోజక కార్యక్రమాల కోసం రూ. 80.69 కోట్లు, విద్యుత్ అవసరాలకు రూ.54.07 కోట్లు, పౌరవిమానయానం కోసం రూ.52 కోట్లు, ర్యాటక రంగం అభివృద్ధికి రూ. 47.50 కోట్లు కేటాయించారు.

## విదేశాంగ శాఖకు రూ.17,346.71 కోట్లు

**న్యూఢిల్లీ:** విదేశాంగ శాఖకు 2020-21 బడ్జెట్‌లో రూ.17,346.71 కోట్లు కేటాయించారు. రూ.100 కోట్లను ఇరాన్‌లో నిర్మిస్తున్న ఛాబహార్ పోర్టు ప్రాజెక్టు కోసం ఖర్చు చేయనున్నారు. ఇతర దేశాలకు అందజేసే ఆర్థిక సాయం కింద రూ.6,907 కోట్లు కేటాయించారు. నేపాల్‌కు 2019-20లో రూ.1,200 కోట్లు ఇవ్వగా, 2020-21లో రూ.8,00 కోట్లు ఇవ్వనున్నారు. మయన్మార్‌కు సాయాన్ని రూ.170 కోట్ల నుంచి రూ.300 కోట్లకు పెంచారు. భూటాన్‌కు 2020-21లో రూ.2,884.65 కోట్లు ఇవ్వనున్నారు. మాల్దీవులకు సైతం సాయాన్ని రూ.75 కోట్ల నుంచి ఏకంగా రూ.1,025 కోట్లకు పెంచేశారు. ఎయిరిండియా ఎయిర్‌క్రాఫ్ట్ నిర్వహణకు 2019-20లో రూ.188 కోట్లు వెచ్చించారు. 2020-21 బడ్జెట్‌లో ఇందుకోసం రూ.150 కోట్లు కేటాయించారు.

# ‘పల్లె’కు ఓకే..!



## ఫ్లాగ్‌షిప్ పథకాలకు ఈసారీ నిధుల జోరు

- మందగమనంతో గ్రామాలపై దృష్టి
- ఇళ్లు, రోడ్లకు కేటాయింపుల జోరు
- 2021 మార్చినాటికి మరో లక్ష పంచాయితీలకు బ్రాడ్‌బ్యాండ్

ఆర్థిక మందగమనం నుంచి గ్రామీణ భారతాన్ని గట్టెక్కించేందుకు మోదీ సర్కారు తాజా బడ్జెట్‌లో దండిగానే నిధులను కేటాయించింది. ముఖ్యంగా మౌలిక సదుపాయాల కల్పనపై ఖర్చుకు వెనుకాడబోమని స్పష్టం చేసింది. గతేడాది సవరించిన అంచనాలతో పోలిస్తే కొన్ని పథకాలకు కేటాయింపులు తగ్గడం గమనార్హం. గ్రామీణ ఇళ్ల నిర్మాణం, రోడ్లపై అత్యధికంగా దృష్టిపెట్టింది. ఇప్పటికే కొన్ని పథకాల లక్ష్యాలు పూర్తవడంతో తదుపరి దశలను వేగంగా అమలు చేయనున్నట్లు బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. పల్లెల్లో 2022 మార్చి నాటికి అదనంగా 1.95 కోట్ల ఇళ్లను నిర్మించేందుకు సుమారు రూ.1,56,634 కోట్లను వెచ్చించనున్నారు. మరో లక్ష గ్రామ పంచాయతీలకు (2020-21)లో బ్రాడ్‌బ్యాండ్(ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్)ను అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. అటు వ్యవసాయంతో పాటు ఇటు గ్రామీణాభివృద్ధికి బడ్జెట్‌లో అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు పరిశీలకులు భావిస్తున్నారు.

### గ్రామీణ సంక్షేమ పథకాలకు ఎంతంటే...

**2020-21 కేటాయింపు:** రూ.1,20,148 కోట్లు

**2019-20 కేటాయింపు:** రూ.1,17,647 కోట్లు (సవరించిన అంచనా(రూ.1.22 లక్షల కోట్లు)

### ‘ఉపాధి’కి హామీ...

**2020-21 కేటాయింపు:** రూ.61,500 కోట్లు

**2019-20 కేటాయింపు:** రూ. 60,000 కోట్లు (సవరించిన అంచనా రూ.71,001 కోట్లు)

- ఉపాధి హామీకి గతేడాది బడ్జెట్ అంచనాలతో పోలిస్తే ఈసారి స్వల్పంగా 2.5 శాతం పెరిగింది. సవరించిన అంచనాలతో పోలిస్తే భారీగా తగ్గింది.
- చాలా రాష్ట్రాల్లో లక్ష్యాలను మించి ఉపాధి పనులను కల్పించడంతో అధికమొత్తంలో కేంద్రం నిధులను అందించాల్సి వచ్చింది.
- ఏడాదిలో వందరోజుల పాటు కనీస ఉపాధి హామీని ఇవ్వడమే ఈ పథకం ప్రధానోద్దేశం.

### విద్యుత్తుకు మరింత ఊతం...

(దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామ్ జ్యోతి యోజన)

**2020-21 కేటాయింపు:** రూ.4,500 కోట్లు

**2019-20 కేటాయింపు:** రూ.4,066 కోట్లు

- వ్యవసాయ, వ్యవసాయేతర విద్యుత్ వినియోగదారులకు ప్రత్యేక ఫీడర్లు, డిస్కమ్‌లను అందుబాటులోకి తీసుకురావడం, విద్యుత్ సబ్-ట్రాన్స్‌మిషన్, పంపిణీ మౌలిక సదుపాయాల పెంపు... గ్రామీణ విద్యుదీకరణ కోసం ఈ పథకాన్ని రూపొందించారు.
- 2017లో సౌభాగ్య పథకం కింద 2.5 కోట్ల కుటుంబాలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్‌ను అందించారు.
- ఇంటిగ్రేటెడ్ పవర్ డెవలప్‌మెంట్ స్కీమ్‌కు కేటాయింపులు రూ. 3970 కోట్ల నుంచి రూ. 5280 కోట్లకు పెంచారు.
- ఉజాల స్కీమ్ కింద పేద, మధ్యతరహా కుటుంబాలకు ఉచితంగా 35 కోట్ల ఎల్‌ఈడీ బల్బులను ఇచ్చారు.
- ఎల్‌ఈడీ బల్బులతో ఏటా రూ.18,341 కోట్ల మేర విద్యుత్ బిల్లులు ఆదా అవుతున్నాయి.

### పల్లె రోడ్లు పరుగులు

**2020-21 కేటాయింపు:** రూ.19,500 కోట్లు

**2019-20 కేటాయింపు:** రూ. 19,000 కోట్లు (సవరించిన అంచనా రూ.14,071 కోట్లు)

- దేశవ్యాప్తంగా ఇప్పటిదాకా 1,67,152 ప్రాంతాలకు రోడ్డు కనెక్టివిటీ కల్పించారు.
- పీఎంజీఎస్‌వై రెండో దశలో రోడ్లను మెరుగుపరడం, మావోయిస్టుల ప్రభావిత జిల్లాల్లో కల్వర్టులు, ఇతర సదుపాయాలు కల్పిస్తారు.
- 2019 డిసెంబర్ 31 నాటికి మొత్తం రెండు దశలకింద 6,08,899 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం, అప్‌గ్రేడేషన్‌ను పూర్తి చేశారు.
- వచ్చే ఐదేళ్లలో 1,25,000 కిలోమీటర్ల రోడ్లను అప్‌గ్రేడ్ చేయనున్నారు. దీనికి రూ.80,250 కోట్లు వెచ్చించనున్నారు. 2019-20లో ఇందుకు 13 రాష్ట్రాలను ఎంపిక చేశారు.

### స్వచ్ఛ భారత్‌కు దన్ను...

**2020-21 కేటాయింపు:** రూ.12,300 కోట్లు

**2019-20 కేటాయింపు** (సవరించిన అంచనా): రూ. 9,638 కోట్లు.

- 2014 అక్టోబర్ 2న గాంధీ జయంతి రోజున మొదలైన ఈ పథకం కింద ఇప్పటి వరకు దాదాపు 9.6 కోట్ల మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేశారు.
- బహిరంగ మలవిసర్జన(ఓడీఎఫ్) అలవాటు దాదాపు కనుమరుగైంది. ఓడీఎఫ్ రహిత గ్రామాల సంఖ్య 5.6 లక్షలకు చేరింది.
- గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 98 శాతం శానిటేషన్ కవరేజ్ కల్పన.
- పట్టణాల్లో 95 శాతం ఓడీఎఫ్ రహితంగా మారినట్లు అంచనా. ఇప్పుడు 100 శాతం లక్ష్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.
- దేశవ్యాప్తంగా 1,700 నగరాలు, పట్టణాల్లో 45,000 ప్రజా, కమ్యూనిటీ మరుగుదొడ్లను గుర్తించేందుకు వీలుగా గూగుల్ మ్యాప్స్‌కు అనుసంధానించారు.
- పూర్తిగా ఓడీఎఫ్ రహితంగా మారిన గ్రామాలు, పట్టణాల్లో దీన్ని కచ్చితంగా అమలయ్యేవిధంగా చూడటం కూడా ఈ పథకంలో భాగమే.
- ప్రతి గ్రామంలో ఘన వ్యర్థాల(చెత్త నిర్మూలన), జల వ్యర్థాల నిర్వహణను కూడా ఈ స్వచ్ఛ భారత్ పథకం కిందకు తీసుకొచ్చారు.

### గ్రామీణ టెలిఫోనీ...

**2020-21 కేటాయింపు:** రూ.6,000 కోట్లు

**2019-20 కేటాయింపు** (సవరించిన అంచనా): రూ. 2,000 కోట్లు

- భారత్ నెట్ ఫేజ్1 కింద 1,21,652 గ్రామ పంచాయతీలకు హైస్పీడ్ ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ కనెక్టివిటీ పూర్తి. 1.16లక్షల పంచాయతీల్లో సర్వీసులు అందుబాటులోకి వచ్చాయి.
- దీంతో 2.5 లక్షల గ్రామాల్లోని దాదాపు 20 కోట్ల మంది గ్రామీణవాసులకు బ్రాడ్‌బ్యాండ్ యాక్సెస్ లభించింది. దీన్ని మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యాన్ని(పీపీపీ) జోడించనున్నారు.
- ఐదు కోట్లమంది గ్రామీణులకు లబ్ధి చేకూరేలా 5 లక్షల వైఫై స్పాట్స్ ఏర్పాటు లక్ష్యం.
- 2020-21 ఆర్థిక సంవత్సరంలో మరో 1,00,000 గ్రామ పంచాయతీలకు ఫైబర్ ఆప్టిక్ నెట్‌వర్క్‌ను కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆర్థిక మంత్రి తాజా బడ్జెట్‌లో ప్రకటించారు.

### ‘జల్ జీవన్’తో స్వచ్ఛమైన నీరు....

**2020-21 కేటాయింపులు:** రూ.11,500 కోట్లు

**2019-20 కేటాయింపులు:** రూ. 10,001 కోట్లు

- దేశంలో తాగునీటి సౌకర్యం లేని అన్ని మారుమూల గ్రామీణ ప్రాంతాలకూ సురక్షితమైన, తగినంత తాగునీటిని(హ్యాండ్ పంపులు, పైపులు ఇతరత్రా మార్గాల్లో) అందించాలనేది ఈ పథకం ప్రధానోద్దేశం.
- గతేడాది బడ్జెట్‌లో జల్ జీవన్ మిషన్‌ను ప్రకటించారు. దీనిలోభాగంగా రూ.3.6 లక్షల కోట్ల నిధులను వెచ్చించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపినట్లు సీతారామన్ బడ్జెట్‌లో తెలిపారు. ఈ ఏడాది రూ.11,500 కోట్లను కేటాయించినట్లు వివరించారు.
- స్థానిక స్థాయిలో సమీకృత డిమాండ్, సరఫరా నిర్వహణ యంత్రాంగం; వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు తగిన మౌలిక వసతుల కల్పన, భూగర్భజలాల పెంపు, సముద్రపునీటిని మంచినీరుగా మార్చడం(డీశాలినేషన్) కూడా జల్‌జీవన్ మిషన్‌లో భాగమే.
- 10 లక్షల జనాభా దాటిన నగరాలన్నింటినీ దీని అమలు కు ప్రోత్సహించనున్నట్లు ఆర్థిక మంత్రి చెప్పారు.

### ఇంటికి ఇంకాస్త ఆసరా...

**2020-21 కేటాయింపులు:** రూ.19,500 కోట్లు

**2019-20 కేటాయింపులు** (సవరించిన అంచనా): రూ. 18,475 కోట్లు

- ప్రధాన మంత్రి ఆవాస్ యోజన(పీఎంఏవై)లో భాగంగా 2022 కల్లా దేశవ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇళ్లు లేని బలహీనవర్గాలందరికీ పక్కా ఇళ్లను కట్టివ్వాలనేది కేంద్ర ప్రభుత్వ తాజా లక్ష్యం.
- పీఎంఏవై తొలి దశను 2016-17 నుంచి 2018-19 వరకూ మూడేళ్లపాటు అమలుచేశారు. గడిచిన ఐదేళ్లలో 1.54 కోట్ల ఇళ్లను నిర్మించారు.
- ఇప్పుడు రెండో దశ కింద 2019-20 నుంచి 2021-22 మధ్య 1.95 కోట్ల ఇళ్లను నిర్మించనున్నారు. ఇందుకోసం రూ.1,56,634 కోట్లను వెచ్చించనున్నారు.
- అంతేకాదు ఈ ఇళ్లకు మరుగుదొడ్లు, విద్యుత్, గ్యాస్ కనెక్షన్లు కూడా ఉచితంగా కల్పించనున్నారు.

# ‘మౌలికం’ కీలకం



- రవాణా రంగంలో మౌలిక సదుపాయాలు, హైవేల అభివృద్ధికి రూ.1.70 లక్షల కోట్లు
- పురోగతిలో 6,500 ప్రాజెక్టులు
- పర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు మరిన్ని తేజాస్ రైళ్లు
- ‘ఉడాన్’ ద్వారా 2024 నాటికి వంద ఎయిర్‌పోర్టుల అభివృద్ధి

**న్యూఢిల్లీ:** దేశ ఆర్థిక అభివృద్ధికి చోదకశక్తిలాంటి మౌలిక వసతుల రంగంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి ఇప్పటికే రూ.103 లక్షల కోట్లతో పలు ప్రాజెక్టులను ప్రారంభించిందని, తాజాగా రవాణా రంగంలో మౌలిక వసతులు, హైవేలను అభివృద్ధి చేసేందుకు బడ్జెట్‌లో రూ.1.70 లక్షల కోట్లను ప్రతిపాదిస్తున్నట్లు కేంద్రం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. దేశవ్యాప్తంగా పౌరుల జీవనాన్ని సులభతరం చేసేందుకు 6,500 మౌలిక వసతుల ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నట్లు చెప్పారు. మౌలిక వసతుల రంగంలో ఐదేళ్లలో రూ.100 లక్షల కోట్లకుపైగా వెచ్చిస్తామని ప్రధాని గతేడాది స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో చెప్పారని గుర్తు చేశారు. జాతీయ మౌలిక వసతుల పైప్‌లైన్ (ఎన్ఐపీ) కోసం ఇప్పటికే రూ.20 వేల కోట్లు కేటాయించామన్నారు.

**2023కి ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్ వే**

నిర్మాణం, నిర్వహణ రంగాల్లో యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆర్థిక మంత్రి చెప్పారు. త్వరలోనే జాతీయ సరుకు రవాణా విధానాన్ని ప్రకటిస్తామని తెలిపారు. 2023 నాటికి ఢిల్లీ-ముంబై ఎక్స్‌ప్రెస్ వేతో పాటు మరో రెండు ప్యాకేజీలు పూర్తవుతాయన్నారు. చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్ రహదారి పనులు కూడా ప్రారంభిస్తామన్నారు. 27,000 కి.మీ మేర విద్యుదీకరణను పూర్తి చేసే దిశగా రైల్వేలు కృషి చేస్తున్నాయని చెప్పారు. ‘రహదారుల నిర్మాణంలో వేగం గణనీయంగా పెరిగింది. 2015-16లో రోజుకు 17 కి.మీ మాత్రమే రోడ్ల నిర్మాణం జరగగా 2018-19 నాటికి ఇది 29.7 కి.మీ.కి పెరిగింది’అని ఆర్థిక మంత్రి తెలిపారు. బడ్జెట్‌లో మౌలిక వసతులకు పెద్దపీట వేయడంతో గృహ నిర్మాణం, చౌకగా పరిశుద్ధమైన ఇంధనం, ఆరోగ్యం, విద్యా సంస్థలు, రైల్వే స్టేషన్లు, ఎయిర్‌పోర్టులు, బస్ టెర్మినళ్లు, మెట్రో, రైల్వే రవాణా, గిడ్డంగులు, సాగునీటి ప్రాజెక్టులు తదితర రంగాల్లో ఉపాధి అవకాశాలు విస్తృతం కానున్నాయి.

**ఉపాధి అవకాశాలు విస్తృతం: గడ్కారీ**

మౌలిక వసతుల రంగానికి ఈ బడ్జెట్ గట్టి ఊతం ఇచ్చిందని కేంద్ర ఉపరితల రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కారీ పేర్కొన్నారు. తాజా బడ్జెట్ పారిశ్రామిక అభివృద్ధికి జవసత్వాలు కల్పించి ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని, తద్వారా 2 కోట్లకుపైగా ఉద్యోగాలు లభించే అవకాశం ఉందన్నారు.

**బడ్జెట్‌లో ‘మౌలిక’వరాలు...**

- పర్యాటక ప్రాంతాలను అనుసంధానించేలా మరిన్ని తేజాస్ రైళ్లు.
- ముంబై-అహ్మదాబాద్ హైస్పీడ్ రైళ్లపై చురుగ్గా పరిశీలన.
- ‘ఉడాన్’పథకం ద్వారా 2024 నాటికి మరో వంద విమానాశ్రయాల అభివృద్ధి.
- ఇంధనం, పునరుత్పాదక వనరులకు బడ్జెట్‌లో రూ.22,000 కోట్లు
- 9,000 కి.మీ మేర ఆర్థిక కారిడార్
- 2,000 కి.మీ మేర తీర ప్రాంత రహదారులు, హైవేల అభివృద్ధి.

**రైల్వే లైన్ల పక్కన సోలార్ ప్రాజెక్టులు**

రైల్వే నెట్‌వర్క్ కోసం సౌర విద్యుత్‌ను వినియోగించుకునేలా ట్రాక్‌ల పక్కన రైల్వేకు చెందిన భూమిలో పెద్ద ఎత్తున సోలార్ పవర్ ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. పీపీపీ విధానంలో 150 ప్యాసింజర్ రైళ్ల ఏర్పాటు, 4 స్టేషన్ల పునరాభివృద్ధి పనులు చేపట్టనున్నారు. రూ. 18,600 కోట్లు ఖర్చయ్యే 148 కి.మీల బెంగళూరు సబర్బన్ రవాణా ప్రాజెక్టును బడ్జెట్‌లో ప్రతిపాదించారు. మెట్రో తరహాలో టికెట్ రేట్లు ఉంటాయి.

# కిసాన్ రైలు

## రైతుల కోసం బడ్జెట్‌లో ప్రతిపాదన

**న్యూఢిల్లీ:** ప్రైవేటు రైళ్లు, పర్యాటక ప్రాంతాలను కలుపుతూ మరిన్ని రైళ్లు, వేగంగా పాడయ్యే పదార్థాల రవాణా.. ఇవీ రైల్వేల కోసం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చేసిన ముఖ్యమైన ప్రతిపాదనలు. రూ.70,000 కోట్ల బడ్జెట్‌తో వీటిని అమలు చేస్తారు. గత ఏడాది సవరించిన బడ్జెట్ రూ.69,967 కోట్లు.

**రిఫ్రిజిరేటర్ కోచ్‌లతో కిసాన్ రైలు**

రైతుల కోసం తెచ్చే ‘కిసాన్ రైల్‌లో రిఫ్రిజిరేటర్ కోచ్‌లు ఉంటాయి. త్వరగా పాడైపోయే పదార్థాలను తరలించడానికి ఇవి ఉపయుక్తంగా ఉంటాయి. పాలు, మాంసం, చేపలు వంటి వాటిని ఇతర ప్రాంతాలకు తరలించడానికి దేశవ్యాప్తంగా ఆటంకాలు లేని జాతీయ సప్లయ్ చెయిన్ నిర్మాణాన్ని పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంలో ఏర్పాటు చేస్తారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లు, గూడ్స్ రైళ్లకు కూడా రిఫ్రిజిరేటర్ కోచ్‌లను అనుసంధానిస్తారు. ఇక రైల్వే విస్తరణ ప్రణాళికలను కొనసాగించేందుకు మూలధన వ్యయాన్ని ఈ బడ్జెట్‌లో రూ. 1.61 లక్షల కోట్లకు పెంచారు.

**కొత్త లైన్లకు రూ.12 వేల కోట్లు**

మౌలిక సదుపాయాల అభివృద్ధి కోణంలో కొత్త లైన్ల నిర్మాణానికి రూ. 12,000 కోట్లను బడ్జెట్‌లో కేటాయించారు. గేజ్ మార్పునకు రూ. 2,250 కోట్లు, డబ్లింగ్ పనులకు రూ. 700 కోట్లు, ఇంజిన్లు, బోగీలు తదితరాలకు రూ. 5,786.97 కోట్లు, సిగ్నలింగ్, టెలికం వ్యవస్థకు రూ. 1,650 కోట్లు కేటాయించారు. ప్రయాణికుల సదుపాయాల కల్పనకు రూ. 2,725.63 కోట్లు కేటాయించారు. సరుకు రవాణా 1,265 మెట్రిక్ టన్నులు ఉండవచ్చు. ప్రయాణికులు, సరుకు రవాణా ఇతర మార్గాల నుంచి వచ్చే ఆదాయాన్ని రూ. 2.25 లక్షల కోట్లుగా అంచనా వేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో ప్రయాణికుల నుంచి రూ. 61 వేల కోట్లు, సరుకు రవాణా నుంచి రూ. 1.47 లక్షల కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేశారు. రెవెన్యూ ఖర్చులో జీతాలను రూ. 92,993.07 కోట్లుగా పేర్కొన్నారు. గతేడాదితో పోలిస్తే ఇది రూ. 6 వేల కోట్లు ఎక్కువగా ఉంది.





## కేంద్రం వైఫల్యానికి నిదర్శనం: కేటీఆర్


కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: కేంద్ర బడ్జెట్ తీవ్ర నిరాశను కలగజేసిందని, ఒకవైపు తెలంగాణ ప్రగతిశీల రాష్ట్రం, మంచి ప్రతిభ చూపుతున్న రాష్ట్రం అని చెబుతూనే తగిన ప్రోత్సాహం అందించకపోవడం సరికాదని మంత్రి కేటీఆర్ అన్నారు. 2019–20లో కేంద్ర పన్నుల్లో రాష్ట్రం వాటా 18.9 శాతానికి పడిపోవడం ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో కేంద్రం వైఫల్యానికి అద్దం పడుతోందని ఆరోపించారు. 2020–21 కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతిపాదనలపై కేటీఆర్ ట్విట్టర్ ద్వారా స్పందించారు. బడ్జెట్ కేటాయింపుల్లో కోత తెలంగాణ ప్రణాళికపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. 'తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కాకతీయ, భగీరథ పథకాలకు రూ.24వేల కోట్ల సాయం అందించాలని నీతి ఆయోగ్ సిఫారసు చేసింది. దురదృష్టవశాత్తూ నయాపైసా కేటాయించ లేదు. తెలంగాణ ప్రగతిశీల రాష్ట్రమని ఆర్థిక సర్వేలో వెల్లడైనా కేంద్ర బడ్జెట్ కేటాయింపులు నిరాశ పరిచాయి. కేంద్ర పన్నుల్లో తెలంగాణ రాష్ట్రం వాటా కుదించడం ద్వారా రాష్ట్రంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రభావం చూపుతుంది'అని పేర్కొన్నారు.

## బడ్జెట్‌లో గుండు సున్నా: టీఆర్‌ఎస్ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంటులో ప్రవేశపెట్టిన 2020–21 వార్షిక బడ్జెట్‌లో తెలంగాణకు కేటాయింపులు గుండు సున్నా అని టీఆర్‌ఎస్ ఎంపీలు నామా నాగేశ్వరరావు, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బడుగు లింగయ్యయాదవ్, పి.రాములు, మన్నె శ్రీనివాస్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఆర్థికమంత్రి కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తరువాత వారు మీడియాతో మాట్లాడుతూ.. బడ్జెట్‌పైనా, రాష్ట్రానికి చేసిన కేటాయింపులపైనా అసంతృప్తి వ్యక్తం చేశారు. బడ్జెట్‌కు ఒక రోజు ముందు పార్లమెంటుకు సమర్పించిన ఆర్థిక సర్వే నివేదిక కేసీఆర్ సర్కారు అమలు చేస్తోన్న రైతుబంధు పథకాన్ని మెచ్చుకున్నప్పటికీ, బడ్జెట్ కేటాయింపులలో మాత్రం దానిని పట్టించుకోలేదని వారు ఆరోపించారు. రైతుబంధు, మిషన్ భగీరథ, చేపల పెంపకం పథకాలలో తెలంగాణ ప్రభుత్వాన్ని అనుకరించిన కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తుందని ఆశించామని, కానీ ఆ ఆశలు నెరవేరలేదని అసహనం వ్యక్తం చేశారు. పటిష్టమైన బడ్జెట్ ప్రతిపాదనలు లేకుండా 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను దేశం ఎలా సాధిస్తుందని ప్రశ్నించారు. రాష్ట్రానికి సంబంధించి అన్ని రంగాలలోనూ కేంద్ర బడ్జెట్ తమను నిరాశకు గురిచేసిందని వారు చెప్పారు. తాము తెలంగాణకు రావలసిన నిధులను పోరాడి సాధిస్తామని వారు స్పష్టం చేశారు.



## కాళేశ్వరం ప్రాజెక్టును విస్మరించడం విచారకరం


మంత్రి నిరంజన్‌రెడ్డి

బడ్జెట్‌లో కాళేశ్వరం ప్రాజెక్టును విస్మరించడం విచారకరం. తెలంగాణలో 70 లక్షల ఎకరాలకు సాగునీరందించే ఉద్దేశంతో మూడేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం రికార్డు సమయంలో నిర్మించిన కాళేశ్వరానికి జాతీయ హోదా, ఇతర సహాయ సహకారాల గురించి ప్రస్తావించలేదు. రాష్ట్రంలోని కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు జాతీయహోదా కోసం ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

## అన్ని వర్గాలకూ నిరాశే


ఉత్తమ్

అందమైన, మోసపూరిత పదాలు, ప్రధాని మోదీపై ప్రశంసలు తప్ప ఈసారి బడ్జెట్‌తో ప్రజలకు ఒరిగిందేమీ లేదని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాష్ట్రాన్ని బడ్జెట్ నిరాశపర్చిందని, నిరుద్యోగ యువత, రైతులు, మహిళలు, విద్యార్థులకు కేటాయింపులు లేవన్నారు. 45 ఏళ్ల గరిష్టస్థాయిలో నిరుద్యోగం ఉందన్నది ప్రస్తావించలేదన్నారు. 2022 వరకు రైతు ఆదాయం రెట్టింపు చేయాలని యోచిస్తోందని చెప్పారు కానీ ఎలానో చెప్పలేదని, ఆత్మహత్యలు చేసుకున్న రైతుల ప్రస్తావనే లేదన్నారు.

## అన్ని వర్గాలకు సంతృప్తి


కిషన్‌రెడ్డి

కేంద్ర బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలకు సంతృప్తినిచ్చేదిగా ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో దీర్ఘకాలిక ప్రయోజనాలను ఆశించి రాయితీలు ప్రకటించారని, మౌలికరంగ అభివృద్ధికి వచ్చే ఐదేళ్లలో రూ.103 లక్షల కోట్లు ఖర్చు చేసేలా ప్రణాళికను సిద్ధం చేశారన్నారు. వ్యవసాయానికి రూ.15 లక్షల కోట్ల రుణ ప్రణాళికను ప్రకటించి, రైతులు పెట్టుబడులకు ప్రైవేటు వ్యక్తులు, సంస్థలపై ఆధార పడకుండా ఉండేలా కృషి చేస్తున్నారన్నారు.

## నవభారత నిర్మాణానికి ఊతం


లక్ష్మణ్

కేంద్ర బడ్జెట్ నవభారత నిర్మాణానికి ఊతమిచ్చేలా ఉంది. పేదరికం, అవినీతి, ఉగ్రవాదం, వివక్ష, అపరిశుభ్రత లేని నవభారత నిర్మాణానికనుగుణంగా అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ, సంస్కరణలకు పెద్దపీట వేసింది. 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థికవ్యవస్థ లక్ష్యం చేరుకునేందుకు దోహదం చేస్తుంది. వ్యవసాయం, సాగునీరు, గ్రామీణాభివృద్ధికి తొలి ప్రాధాన్యమిస్తూ.. ఆరోగ్యం, పారిశుద్ధ్యం, నీరు ద్వితీయ ప్రాధాన్యంగా.. విద్య, చిన్నారుల సంక్షేమాన్ని మూడో ప్రాధాన్యమిచ్చారన్నారు.

## అందరికీ ఆమోదయోగ్యం


ఎంపీ బండి సంజయ్

కేంద్ర బడ్జెట్ దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు ఆమోదయోగ్యంగా ఉంది. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, సాగునీరు అనుబంధ రంగాలకు ప్రాధాన్యం ఇస్తూ రూ.2.83 లక్షల కోట్లు కేటాయించడం హర్షణీయం. అన్నదాతల ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపు చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. విద్యా రంగానికి రూ.99,300 కోట్లు కేటాయించడం ద్వారా ప్రభుత్వం తన ప్రాధాన్యాన్ని స్పష్టం చేసింది. జౌళి రంగానికి రూ.1,480 కోట్లు కేటాయింపుతో చేనేత రంగానికి బాసటగా నిలవనుంది.

## మాంద్యం, నిరుద్యోగానికి పరిష్కారం చూపలేదు


చాడ వెంకట్‌రెడ్డి

మాంద్యం, నిరుద్యోగానికి బడ్జెట్‌లో పరిష్కారం చూపలేదు. ఇది దిశ లేని అంకెల గారడీ బడ్జెట్. లాభాల్లో ఉన్న ఎల్ఐసీ షేర్లను అమ్మేస్తామని ప్రకటించడం దారుణం. తెలంగాణకు సంబంధించి పునర్విభజన చట్టంలోని వాగ్దానాల్లోని కాజీపేట రైల్వేకోచ్ ఫ్యాక్టరీ ప్రస్తావన లేదు. ఏ ప్రాజెక్టుకూ జాతీయహోదా ఊసే లేదు.

## శ్రామికుల జీవనాదాయం పెరుగుదలకు చర్యలేవి?


తమ్మినేని సీతారాం

బడ్జెట్‌లో పేదల అభ్యున్నతి, శ్రామికుల జీవనాదాయం పెరుగుదలకు ఏ చర్యలూ తీసుకోలేదు. ప్రజలను భ్రమలకు గురిచేసేలా వాగ్దానాలు చేశారు. ఎల్ఐసీ, రైల్వేలు, ఎయిర్‌పోర్టులు, విద్య, వైద్యం, కమ్యూనికేషన్ శాఖల పూర్తి ప్రైవేటీకరణకు ప్రతిపాదించడాన్ని ఖండిస్తున్నాం. ఈ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి.

# అంతా భ్రాంతియేనా..!



- కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రంపై కనిపించని దయ
- కాళేశ్వరం, పసుపు బోర్డుల ఊసే లేదు

సాక్షి, హైదరాబాద్: కేంద్ర బడ్జెట్ మళ్లీ రాష్ట్రానికి నిరాశే మిగిల్చింది. మాంద్యం నేపథ్యంలో కేంద్రం నుంచి ఉదారంగా సాయం అందుతుందని, కేంద్ర ప్రశంసలు అందుకున్న పథకాలకు నిధులు ఇస్తుందని ఆశించిన రాష్ట్ర ప్రభుత్వ ఆశలు అడియాశలయ్యాయి. కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా, పసుపు బోర్డు ఏర్పాటు లాంటి అంశాల ఊసే లేదు. తెలుగింటి కోడలైన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రెండో లెక్కల పద్దులో ఏపీ పునర్వ్యవస్థీకరణ గురించి పట్టించుకోలేదు. రాష్ట్రం అడిగిన పథకాలకు కనీస నిధులు కూడా కేటాయించలేదు.

### రాష్ట్ర బడ్జెట్‌పై ప్రభావం..

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సాగు, తాగు నీటి పథకాలకు నిధులు కేటాయించకపోవడంతోపాటు పన్ను వాటాలోనూ కోత పెట్టడంతో ఈసారి రాష్ట్ర బడ్జెట్ అంచనాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఉద్యోగులకు పీఆర్సీ అమలు, నిరుద్యోగ భృతి లాంటి వాటి అమలుకు ఆర్థిక వెసులుబాటు కష్టమేనని లెక్కలు వేస్తున్నాయి. మాంద్యం కారణంగా రాష్ట్ర ఆదాయంలో కొంత తగ్గుదల కనిపిస్తోందని, దీంతో భారీ వ్యయంతో చేపట్టిన ప్రాజెక్టుల నిర్వహణకు ఆర్థిక సాయం చేయాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. సీఎం కేసీఆర్ ఢిల్లీ వెళ్లినప్పుడల్లా కేంద్ర మంత్రులను కలవడంతోపాటు కేంద్రానికి లేఖలు రాశారు. మంత్రి హరీశ్‌రావు 15వ ఆర్థిక సంఘం చైర్మన్‌తో భేటీలో కాళేశ్వరం, మిషన్ భగీరథల నిర్వహణ కోసం రూ.52 వేల కోట్లు ఇవ్వాలని కోరారు.

### ఏదో అలా అలా..

పెండింగ్‌లో ఉన్న జీఎస్టీ బకాయిలు, ఐజీఎస్టీ చెల్లింపులు, పన్నుల వాటా కింద తెలంగాణకు రూ.35 వేల కోట్ల వరకు అదనపు నిధులు కేటాయిస్తారని ప్రభుత్వం ఆశించింది. కానీ తెలంగాణకు రూ.16 వేల కోట్ల పన్నుల వాటానే కేంద్రం బడ్జెట్‌లో ప్రతిపాదించడం గమనార్హం. దీంతో ప్రస్తుత సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుకు వచ్చే ఏడాది నిధుల కటకట తప్పదని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఇక, కొత్త పథకాల అమలుకు అవకాశాల్లేవని తేల్చేస్తున్నారు. ఇక 2020–21 రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ లెక్కలు కూడా ఆచితూచి ఉంటాయని పేర్కొంటున్నారు.

### అందులోనూ కోతే..

పన్నుల వాటాలోనూ కేంద్రం రాష్ట్రానికి కోత పెట్టింది. మొత్తం పన్ను వాటాలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2.437 శాతం ఇవ్వగా, దాన్ని 2.133 శాతానికి కుదించింది. 2019–20లో రూ.17 వేల కోట్లకు పైగా పన్నుల వాటా అంచనాలను పెట్టిన కేంద్రం ఇప్పుడు మరో రూ.వెయ్యి కోట్లు తగ్గించి రూ.16 వేల కోట్ల పైచిలుకు చూపెట్టింది. అందులో ఎంత ఇస్తుందన్న దానిపైనా అనుమానాలున్నాయని ఆర్థిక వర్గాలు అంటున్నాయి. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్ కోచ్ ఫ్యాక్టరీ లాంటి పునర్వ్యవస్థీకరణ చట్టంలోని హామీలను బడ్జెట్‌లో ప్రస్తావించనేలేదు. అయితే, బెంగళూరులో మెట్రో తరహాలో సబర్బన్ రైల్వే వ్యవస్థకు రూ.18,600 కోట్లను ప్రతిపాదించిన కేంద్రం తెలంగాణలోని గ్రామాల రూపురేఖలను మార్చే రీజనల్ రింగ్ రోడ్డు (ట్రిపుల్ ఆర్) లాంటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కాగా, కేంద్ర బడ్జెట్‌పై సీఎం కేసీఆర్ కూడా అసంతృప్తి వ్యక్తం చేశారు. కేంద్ర ప్రతిపాదనలపై 4 గంటల పాటు ఆర్థిక శాఖ అధికారులతో సమీక్షించిన సీఎం.. కేంద్ర బడ్జెట్‌పై పెదవి విరిచారు.

# ఐటీ, పారిశ్రామిక రంగాలకు నిరాశే..!

- రాష్ట్ర ప్రతిపాదనలను పట్టించుకోని కేంద్ర బడ్జెట్
- పారిశ్రామిక వాడలు, ఫార్మాసిటీ, స్టీల్ ప్లాంటు ఊసేలేదు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పారిశ్రామిక, ఐటీ రంగాల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించేలా రాష్ట్ర ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళికలకు కేంద్ర బడ్జెట్ ప్రతిపాదనలు నిరాశను మిగిల్చాయి. ఆహారశుద్ధి, ఎయిరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, లాజిస్టిక్స్, ఐటీ తదితర రంగాలను ప్రోత్సహించడం ద్వారా ఆర్థికాభివృద్ధి, ఉద్యోగ కల్పన సాధ్యమని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలో ఫార్మాసిటీ, జహీరాబాద్ నిమ్జ్‌లో మౌలిక సౌకర్యాలకు నిధులు, ఆహారశుద్ధి, టెక్స్‌టైల్ పార్కులకు నిధులు, పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధి, విభజన చట్టం హామీ మేరకు బయ్యారంలో స్టీల్ ప్లాంటు, ఐటీఐఆర్ ప్రాజెక్టు తదితరాల కోసం కేంద్రం నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిధులను ఆశించింది. హైదరాబాద్ ఫార్మాసిటీ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.16,375 కోట్లు కాగా, మౌలిక సౌకర్యాల కల్పనకు రూ.6వేల కోట్లు ఇవ్వాలని ప్రతిపాదించినా బడ్జెట్ ప్రతిపాదనల్లో ఈ ప్రస్తావన లేదు. ఐటీ రంగానికి గాను 2013లో ఐటీఐఆర్ ప్రాజెక్టుకు రూ.3,275 కోట్లు అవసరమవుతాయని అంచనా వేసిన రాష్ట్ర ప్రభుత్వం నిధుల కోసం ఏళ్ల తరబడి కేంద్రానికి లేఖలు రాస్తోంది. రాష్ట్ర పారిశ్రామిక విధానం టీఎస్ఐపాస్‌లో పేర్కొన్న విధంగా రాష్ట్రంలో 6 పారిశ్రామిక కారిడార్లను అభివృద్ధి చేయాలని ప్రతిపాదించగా, తొలి దశలో హైదరాబాద్–వరంగల్ కారిడార్ అభివృద్ధిని త్వరితగతిన చేపట్టాలని రాష్ట్రం భావిస్తోంది. శనివారం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్–2020–21లో వీటి ఊసు లేకపోవడంపై పరిశ్రమల శాఖ అసంతృప్తి వ్యక్తం చేస్తోంది.

### 'ఎలక్ట్రానిక్స్'కు ఊతం

ఎలక్ట్రానిక్స్ సెమీ కండక్టర్ల తయారీ రంగాన్ని ప్రోత్సహించి సిలికాన్ వ్యాలీ తరహాలో హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం గతంలో నిర్ణయించింది. తాజా కేంద్ర బడ్జెట్‌లో మొబైల్స్, ఎలక్ట్రానిక్స్ పరికరాలు, సెమీకండక్టర్ల తయారీని ప్రోత్సహించేందుకు ఓ విధానం ప్రకటిస్తామన్న నేపథ్యంలో కొంత లబ్ధిచేకూరనుంది. సంగారెడ్డి జిల్లా సుల్తాన్‌పూర్‌లో 250 ఎకరాల్లో ఇప్పటికే మెడికల్ డివైజెస్ పార్కును ఏర్పాటు చేయగా, బడ్జెట్‌లో దానికి ఊతమిస్తామని కేంద్రం ప్రకటించింది. బడ్జెట్‌లో నేషనల్ టెక్నికల్ టెక్స్‌టైల్ మిషన్ ద్వారా వచ్చే నాలుగేళ్లలో రూ.1480 కోట్లు ఖర్చు చేస్తామని ప్రతిపాదించారు. దీంతో కాకతీయ టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధికి కేంద్రం నుంచి సహకారం నామమాత్రంగా లభించే సూచనలున్నాయి.

### ఆరు ఎయిర్‌పోర్టుల అభివృద్ధి

వచ్చే నాలుగేళ్లలో రూ.1.03లక్షల కోట్లతో వివిధ రంగాల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్న కేంద్రం.. ఉడాన్ పథకం ద్వారా దేశవ్యాప్తంగా 2024 నాటికి వంద ఎయిర్‌పోర్టులను అభివృద్ధి చేస్తామని బడ్జెట్‌లో పేర్కొంది. రాష్ట్రంలో ఇప్పటికే 6 ఎయిర్‌పోర్టుల అభివృద్ధికి ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా సర్వే నిర్వహించింది. జక్రాన్‌పల్లి (నిజామాబాద్), అడ్డాకుల (మహబూబ్‌నగర్), పునుకుడుచెర్ల (భద్రాద్రి కొత్తగూడెం)లో కొత్త ఎయిర్‌పోర్టుల ఏర్పాటుతో పాటు బసంత్‌నగర్ (పెద్దపల్లి), మామునూరు (వరంగల్), ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుల అభివృద్ధి పనులు వేగవంతమయ్యే అవకాశం ఉంది.

# కాళేశ్వరంపై చిన్నచూపే!

- కేంద్ర బడ్జెట్‌లో ఊసేలేని జాతీయ హోదా అంశం
- భగీరథ స్ఫూర్తితో చేపట్టనున్న జల్‌జీవన్ మిషన్‌కే అధిక నిధులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 70 శాతం భూభాగానికి తాగు, సాగు నీటి అవసరాలను తీరుస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టును కేంద్రం మరోమారు పట్టించుకోలేదు. ఈ ప్రాజెక్టుకు లేదా పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుల్లో ఒక దానికి జాతీయ హోదా లేక కేంద్ర ప్రాయోజిత పథకాల ద్వారా ఆర్థిక సాయం అందించాలన్న వినతిని పెడచెవిన పెట్టింది. శనివారం ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఎక్కడా కాళేశ్వరం ప్రస్తావన కానరాలేదు. దీనికి జాతీయ హోదా ఇవ్వాలని ఇప్పటికే సీఎం కె.చంద్రశేఖర్‌రావు, మంత్రి టి.హరీశ్‌రావు, రాష్ట్ర ఎంపీలు కోరినా పట్టనట్లే వ్యవహరించింది. ప్రాజెక్టు నిర్మాణానికి రూ.80 వేల కోట్లు ఖర్చవుతున్నాయని, వాటిలో అధికభాగం కాళేశ్వరం కార్పొరేషన్ ద్వారా సమీకరించిన అప్పుల ద్వారానే పూర్తి చేస్తున్నామని చెబుతున్నా, కేంద్రం ప్రాజెక్టుపై ఎక్కడా ప్రస్తావన చేయలేదు.

**జల్‌జీవన్ తెచ్చినా.. మనకు దక్కేది శూన్యమే..**

దేశంలోని ప్రతి ఇంటికీ పైప్‌లైన్ ద్వారా నల్లా నీటిని అందించే లక్ష్యంతో జల్‌జీవన్ మిషన్‌కు కేంద్రం పెద్దపీట వేసింది. 2024 నాటికి సంపూర్ణ తాగునీటిని అందించే లక్ష్యంతో జల్ జీవన్‌కు ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.11,500 కోట్లు కేటాయించింది. మిషన్ భగీరథ అప్పుల తిరిగి చెల్లింపులకు కేంద్రం నిధులివ్వాలని, దాని నిర్వహణకు ఆర్థిక సహకారం అందించాలని సీఎం కేసీఆర్ కోరారు. ఇప్పటికే పూర్తయిన పథకానికి జల్ జీవన్ మిషన్‌నుంచి నిధులు కేటాయిస్తారా? అన్నది ప్రశ్నగానే ఉంది. ఇక పీఎంకేఎస్‌వై కింద బడ్జెట్‌లో కేంద్రం రూ.11,127 కోట్లు కేటాయించింది. అయితే గత బడ్జెట్‌లో రూ.9,682 కోట్లు కేటాయించినప్పటికీ దాన్ని తిరిగి రూ.7,896 కోట్లకు సర్దుబాటు చేసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఏడాది ఎంతమేర ఖర్చు ఉంటుందన్నది కాలమే సమాధానం చెప్పాలి. ఇక పీఎంకేఎస్‌వై కింద కేటాయించిన నిధులతో సత్వర సాగునీటి ప్రాయోజిత కార్యక్రమం (ఏఐబీపీ) కింద చేపట్టిన కొమురం భీం, గొల్లవాగు, ర్యాలివాగు, మత్తడివాగు, పెద్దవాగు, పాలెంవాగు, ఎస్సారెస్పీ–2, దేవాదుల, జగన్నాథ్‌పూర్, భీమా, వరద కాల్వ ప్రాజెక్టులకు మరో రూ.300 కోట్ల మేర రావాలి. క్యాడ్‌వామ్ కింద 18 ప్రాజెక్టులు గుర్తించగా, వాటికి రూ.2వేల కోట్ల మేర ఇవ్వాల్సి ఉంది.వాటికి ఇంతవరకు నిధులు ఇవ్వలేదు. వీటిని పీఎంకేఎస్‌వై కింద కేటాయించిన నిధుల నుంచే ఖర్చు చేయాల్సి ఉంది. వీటికి ఈ ఏడాది ఏమైనా ఖర్చు చేస్తారా లేదా అనేది వేచి చూడాలి. మొత్తంగా కేంద్ర జల శక్తి శాఖకు కేటాయించిన రూ.30,478కోట్ల బడ్జెట్‌లో తెలంగాణకు దక్కే నిధుల వాటా అంతంతమాత్రమేనని సాగునీటి శాఖ ఇంజనీర్లు, నిపుణులు అంటున్నారు.

# పన్నుల వాటాలో రాష్ట్రానికి అన్యాయం

- ఊహించిందే జరిగింది..!
- పన్నుల పంపిణీలో తెలంగాణ వాటా తగ్గింపు
- 2.437 నుంచి 2.133 శాతానికి తగ్గింపు
- తెలంగాణకు రూ.723 కోట్ల మేర గ్రాంటు



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన పన్నుల వాటా మదింపునకు 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవాలని నిర్దేశించిన 15వ ఆర్థిక సంఘం విధివిధానాల ప్రభావం తెలంగాణ రాష్ట్రంపై పడింది. 14వ ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు 42 శాతం వాటా పంచారు. ఇందులో నుంచి తెలంగాణకు కేంద్ర పన్నుల వాటా కింద 2.437 శాతం పంచుతున్నారు. ఇప్పుడది 2.133 శాతానికి తగ్గింది. పైగా కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు పంచాల్సిన వాటా 42 నుంచి 41 శాతానికి తగ్గించారు. ఏడో ఆర్థిక సంఘం నుంచి 14వ ఆర్థిక సంఘం వరకు 1971 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకుని వాటాలను నిర్దేశించి కేంద్రం పన్నులను పంచింది. కానీ ఇప్పుడు 2011 జనాభా లెక్కల ఆధారంగా పన్నుల వాటాను నిర్దేశించారు. 15వ ఆర్థిక సంఘం సిఫారసులు ఏప్రిల్ 1, 2020 నుంచి అమల్లోకి రావాల్సి ఉన్నప్పటికీ.. పూర్తిస్థాయి నివేదిక సిద్ధం కానందున కేవలం 2020–21కు వర్తించేలా మధ్యంతర నివేదిక ఇచ్చింది. దానిని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ శనివారం పార్లమెంటులో ప్రవేశపెట్టారు. వీటి ఆధారంగానే తాజాగా 2020–21 ఆర్థిక సంవత్సరానికి పన్నుల వాటాలను నిర్దేశిస్తూ ఏ రాష్ట్రానికి ఎంత ఇవ్వాలో బడ్జెట్‌లో పొందుపరిచారు. ఒకవేళ 15వ ఆర్థిక సంఘం రాష్ట్రాలకు పంచాల్సిన వాటాను 41 శాతం నుంచి ఇంకా తగ్గిస్తే అప్పుడు రాష్ట్రం ఇంకా నిధుల లేమిని ఎదుర్కోవలసి వస్తుంది.

2020–21లో కేంద్రం ఇచ్చే పన్నుల వాటా (అంచనాలు) ప్రకారం తెలంగాణకు రూ.16,726.58 కోట్లు రానున్నట్టు బడ్జెట్‌లో అంచనా రూపొందించారు. అయితే గత రెండు మూడేళ్ల కాలంలో బడ్జెట్‌లో పొందుపరిచిన అంచనాల మేరకు నిధులు రాలేదు. పొందుపరిచిన అంచనాల కంటే వెయ్యి కోట్ల నుంచి రెండు వేల కోట్ల వరకు తక్కువే వచ్చాయి.

### ప్రభావం చూపించిన 'జనాభా'

15వ ఆర్థిక సంఘం విధివిధానాల్లో పన్నుల వాటాలు తేల్చేందుకు జనాభాకు 15 శాతం వెయిటేజీ ఇచ్చారు.

| ఏడాది | తెలంగాణకు కేంద్ర పన్నుల్లో వాటా |
|---|---|
| 2018-19 | రూ. 17,960.01 (వాస్తవిక) |
| 2019-20 | రూ. 17,422.17 (సవరించిన అంచనాలు) |
| 2020-21 | రూ.16,726.58 కోట్లు (అంచనాలు) |

దీని ఫలితంగా 2011 జనాభాను ప్రాతిపదికగా తీసుకోవడం వల్ల ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటక రాష్ట్రాలకు కేంద్ర పన్నుల్లో వాటా తగ్గింది.

### తెలంగాణకు స్పెషల్ గ్రాంటు సిఫారసు

తెలంగాణ, కర్ణాటక, మిజోరం రాష్ట్రాలకు ప్రత్యేక గ్రాంట్లు ఇచ్చింది. తెలంగాణకు 2020–21కి రూ. 723 కోట్ల మేర పన్ను వాటా తగ్గుతుందని అంచనా వేసి గ్రాంటును సిఫారసు చేసింది. తెలంగాణకు పట్టణ స్థానిక సంస్థలకు రూ.889 కోట్లు, గ్రామీణ స్థానిక సంస్థలకు రూ.1847 కోట్లు సిఫారసు చేసింది. 10 లక్షలకు పైబడి జనాభా ఉన్న హైదరాబాద్‌కు రూ.468 కోట్ల గ్రాంట్లు సిఫారసు చేసింది.

### గిరిజన వర్సిటీ ఒక్కటే

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ రాష్ట్రానికి 2020–21 కేంద్ర బడ్జెట్ నిరాశనే మిగిల్చింది. కేవలం గిరిజన వర్సిటీ కోసం మాత్రమే రూ.26.90 కోట్ల మేర నిధులు కేటాయించింది. తెలంగాణలో ఉన్న ఇతర జాతీయ సంస్థలకు సాధారణంగా చేసే కేటాయింపులే మినహా ప్రత్యేక ప్రస్తావనేదీ లేదు. కాగా పదిహేనో ఆర్థిక సంఘం 2020–21 సంవత్సరానికి కేంద్ర పన్నుల్లో తెలంగాణ వాటాను గతంలో ఉన్న 2.437 శాతం నుంచి 2.133 శాతానికి తగ్గించడం వల్ల ఆదాయం కోల్పోనుంది. అయితే తెలంగాణకు ప్రత్యేక గ్రాంటు కింద రూ. 723 కోట్లు పదిహేనో ఆర్థిక సంఘం సిఫారసు చేయడం స్వల్ప ఊరట. తెలంగాణలో ఐఐఎం, ఐఐటీ తదితర జాతీయస్థాయి విద్యాసంస్థలు స్థాపించాలన్న రాష్ట్ర ప్రభుత్వ డిమాండ్‌కు కేంద్రం నుంచి స్పందన కనిపించలేదు. మరోవైపు ఎయిమ్స్‌కు నిర్దిష్ట కేటాయింపులు చూపలేదు.

# శంకరగిరి మాన్యాలే..


▶ మొదటి పేజీ తరువాయి


పురోగతికి శరాఘాతంగా మారుతుందని సీఎం కేసీఆర్ అన్నారు.

### జీఎస్టీ అమల్లో కేంద్రానికి చిత్తశుద్ధి లేదు

'కేంద్ర పన్నుల్లో రాష్ట్రాలకు చెల్లించే వాటాను 42 నుంచి 41 శాతం తగ్గించడం వల్ల అన్ని రాష్ట్రాలకు నష్టం కలుగుతుంది. జీఎస్టీ చట్టం అమలులో కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధి చూపడం లేదు. 14 శాతం ఆదాయ వృద్ధిరేటు లేని రాష్ట్రాలకు జీఎస్టీ పరిహారం అందిస్తామనే చట్టం హామీని కేంద్రం తుంగలో తొక్కింది. చాలా నెలలుగా దేశంలో నెలకొన్న ఆర్థిక మందగమనాన్ని అధిగమించేందుకు కేంద్రం ప్రగతిశీల నిర్ణయాలు ప్రకటించలేదు. అతి ముఖ్యమైన రంగాలకు బడ్జెట్లో కేటాయింపులను తగ్గించడం పూర్తి ప్రగతి నిరోధక చర్య. వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి రంగాలకు నిధులను తగ్గించారు. ఇది దేశ పురోభివృద్ధిపై, సామాజికాభివృద్ధిపై ప్రభావం చూపుతుంది' అని కేసీఆర్ అభిప్రాయపడ్డారు.

### నిర్వహణా లోపానికి నిదర్శనం

కేంద్ర పన్నుల్లో తెలంగాణకు 2019–20 ఆర్థిక సంవత్సరంలో రూ.19,718 కోట్లు రావాలి. గతేడాది బడ్జెట్లో ఈ మొత్తాన్ని తెలంగాణకు అందిస్తామని కేంద్రం ప్రకటించింది. కానీ సవరించిన అంచనాల్లో దీన్ని రూ.15,987 కోట్లకు కుదించారు. దీని వల్ల ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రానికి రావాల్సిన నిధుల్లో రూ.3,731 కోట్లు తగ్గాయి. కేంద్రం నుంచి రూ.19,718 కోట్లు వస్తాయనే ఉద్దేశంతో తెలంగాణ ఆర్థిక ప్రణాళిక రూపొందించుకుంది. కేంద్రం నిధుల్లో కోత విధించడంతో ఇది తారుమారైంది. కేంద్ర ప్రభుత్వ అసమర్థత వల్లే కేంద్రానికి వచ్చే పన్నుల నుంచి రాష్ట్రాలకు ఇచ్చే వాటా తగ్గింది. ప్రతీ సందర్భంలోనూ బడ్జెట్లో ప్రకటించిన అంచనాల ప్రకారమే రాష్ట్రాలకు పన్నుల్లో వాటా చెల్లిస్తారు. ఒకటీ అరా శాతం అటూఇటూ అయిన సందర్భాలున్నాయి. కానీ, 2019–20 సంవత్సరంలో ఏకంగా 18.9 శాతం తగ్గుదల రావడం కేంద్ర ప్రభుత్వ ఆర్థిక వ్యవహారాల నిర్వహణ లోపానికి నిదర్శనం. దీని ప్రభావం తెలంగాణపై దారుణంగా పడింది' అని కేసీఆర్ అన్నారు.

### పట్టణాభివృద్ధి నిధుల్లో భారీ కోత

బడ్జెట్‌లో పట్టణాల అభివృద్ధి నిధుల కేటాయింపుల్లోనూ 14.3 శాతం కోత విధించడంతో తెలంగాణకు తీవ్ర నష్టం జరుగుతుంది. తెలంగాణలోని పట్టణాల అభివృద్ధికి 2019–20 బడ్జెట్‌లో రూ.1,037 కోట్లు కేటాయించగా, ప్రస్తుత బడ్జెట్‌లో గతంకంటే రూ.148 కోట్లు తగ్గించి, రూ.889 కోట్లే కేటాయించారు. తెలంగాణలో కోటి ఎకరాలకు సాగునీరు అందించేందుకు భారీ వ్యయంతో నిర్మించిన ప్రాజెక్టుల నిర్వహణకు కేంద్ర సాయం కోరినా నిధులు కేటాయించలేదు' అని కేసీఆర్ అన్నారు. 'ఇంకా వ్యవసాయరంగానికి 2019–20లో 3.65% నిధులు కేటాయిస్తే, 2020–21లో 3.39% కేటాయించారు. వైద్య ఆరోగ్య రంగానికి ఈసారి 2.13 శాతం నిధులు (గతేడాది 2.24%), గ్రామీణాభివృద్ధికి 3.94% నిధులు (గతేడాది 4.37%), విద్యారంగానికి 3.22% నిధులు (గతేడాది 3.37%) మాత్రమే కేటాయించారు.

### తెలంగాణకు రెండు రకాలుగా నష్టం

2020–21 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ ప్రతిపాదనల్లో తెలంగాణకు వచ్చే నిధుల్లో 2 రకాలుగా నష్టం వాటిల్లింది. కేంద్రానికి వచ్చే పన్నుల్లో నుంచి రాష్ట్రాలకు చెల్లించే వాటాను 42 నుంచి 41 శాతానికి తగ్గించడంతో మొదటి నష్టం జరిగింది. మరోవైపు తెలంగాణ రాష్ట్రానికి గతంలో 2.437 శాతం వాటాను ఇవ్వగా, ఈ ఆర్థిక సంవత్సరంలో ఈ వాటాను 2.133 శాతానికి తగ్గించడంతో రెండో రకంగా నష్టం వాటిల్లింది. దీంతో రాష్ట్రానికి కేంద్ర పన్నుల్లో వాటాగా రావాల్సిన నిధుల్లో రూ.2,381 కోట్లు తగ్గనున్నాయి. ఇంత భారీ స్థాయిలో రాష్ట్రానికి నిధులు తగ్గించడం కచ్చితంగా వివక్షే. 2019–20 ఆర్థిక సంవత్సరంలోనే కేంద్ర పన్నుల్లో తెలంగాణకు ఇస్తామని పార్లమెంటులో ప్రకటించిన వాటాలో రూ.3,731 కోట్లు కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. 2020–21 ఆర్థిక సంవత్సరంలో రూ.16,726 కోట్లు ఇస్తామని ప్రస్తుత బడ్జెట్‌లో ప్రతిపాదించింది. అయితే ఈసారీ అంచనాలు సవరించే నాటికి ఎంత తగ్గిస్తారో తెలియని పరిస్థితి ఉంది' అని సీఎం కేసీఆర్ అన్నారు.





## స్టాక్ మార్కెట్లు

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 988 ▼ | 300 ▼ |
| 39,736 | 11,662 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు** (శుక్రవారం ముగింపు)

| సూచీ | ముగింపు | మార్పు |
|---|---|---|
| నాస్‌డాక్ | 9,151 | ▼ 148 |
| డోజోన్స్ | 28,256 | ▼ 603 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,286 | ▼ 96 |
| డాక్స్ | 12,982 | ▼ 175 |
| షాంఘై (జనవరి23న) | 2,977 | ▼ 84 |
| నికాయ్ | 23,205 | ▲ 227 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | | • కొనుగోలు | • అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 71.06 | 72.05 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 92.52 | 94.93 |
| € | యూరో | ఎస్‌బీఐ | 77.81 | 79.98 |
| ¥ | జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 64.69 | 66.53 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 47.25 | 48.96 |
| S$ | సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.89 | 53.21 |
| SAR | సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.24 | 19.84 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.96 | 19.96 |
| ¥ | చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.66 | 11.07 |

### డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యం రూ. 1.2 లక్షల కోట్లు

కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన బడ్జెట్‌లో వచ్చే ఆర్థిక సంవత్సరానికి(2020–21) డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా రూ. 1.2 లక్షల కోట్లను సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2019–20)లో డిజిన్వెస్ట్‌మెంట్ ద్వారా సమీకరించనున్న రూ. 65,000 కోట్లతో పోలిస్తే ఇది దాదాపు రెట్టింపు కావడం గమనార్హం! కాగా.. నిజానికి ప్రభుత్వం ఈ ఏడాది ప్రభుత్వ రంగ కంపెనీలలో వాటాల విక్రయం(డిజిన్వెస్ట్‌మెంట్) ద్వారా రూ. 1.05 లక్షల కోట్లను సమీకరించాలని భావించింది. అయితే ఇప్పటివరకూ ప్రభుత్వం రూ. 18,000 కోట్లను మాత్రమే సమకూర్చుకోగలిగింది. దీంతో ఈ ఏడాది డిజిన్వెస్ట్‌మెంట్ లక్ష్యాన్ని రూ. 65,000 కోట్లకు ప్రభుత్వం సవరించింది.

సాక్షి

# మార్కెట్‌కు నచ్చలే..!



**అంచనాలు తారుమారు • ప్రత్యేక ట్రేడింగ్ రోజు భారీ నష్టాలు**

**40,000 పాయింట్ల దిగువకు సెన్సెక్స్ • 988 పాయింట్ల పతనంతో 39,736కు సెన్సెక్స్**

**ఇంట్రాడేలో 1,092 పాయింట్ల క్షీణత • 11,700 పాయింట్ల దిగువకు నిఫ్టీ**

**300 పాయింట్ల నష్టంతో 11,662 వద్ద ముగింపు**

కొండంత రాగం తీసి, ఏదో... చెత్త పాట పాడాడు అని ఒక సామెత ఉంది. ఈ సామెత శనివారం జరిగిన ప్రత్యేక స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌కు పూర్తిగా వర్తిస్తుంది. మందగమనంలో ఉన్న ఆర్థిక వ్యవస్థకు జోష్‌నివ్వడానికి కేంద్రం ఎన్నో చర్యలు తీసుకుంటుందని అంచనాలు ఎప్పటికప్పుడూ పెరుగుతూ పోయాయి. ఆదాయపు పన్ను, దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను(ఎల్‌టీసీజీ) విషయాల్లో ఊరటనిచ్చే నిర్ణయాలు ఉండగలవని, సెక్యూరిటీస్ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ (ఎస్‌టీటీ), డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్(డీడీటీ)లను రద్దు చేస్తారని....ఇలా ఎన్నో ఆశలు రాజ్యమేలాయి. కరోనా వైరస్ కల్లోలంతో ప్రపంచ మార్కెట్లు కుదేలైనా, మన మార్కెట్ మాత్రం బడ్జెట్‌పై ఆశలతో పెద్దగా పడలేదు. తీరా చూస్తే, ఈ ఆశలన్నింటినీ ఆర్థిక మంత్రి సీతమ్మ వమ్ము చేశారు. బడ్జెట్ అంచనాలను తప్పడంతో మార్కెట్ నష్టపోయింది. సెన్సెక్స్ 40,000 పాయింట్లు, నిఫ్టీ 11,700 పాయింట్లు దిగువకు పడిపోయాయి. ఇంట్రాడేలో 1,275 పాయింట్ల రేంజ్‌లో కదలాడిన సెన్సెక్స్ చివరకు 988 పాయింట్ల నష్టంతో 39,736 పాయింట్ల వద్ద ముగిసింది. ఇక నిఫ్టీ 300 పాయింట్లు నష్టపోయి 11,662 పాయింట్ల వద్దకు చేరింది. సెన్సెక్స్ 2.43 శాతం, నిఫ్టీ 2.51 శాతం మేర నష్టపోయాయి.

**రూ. 3.46 లక్షల కోట్ల సంపద ఆవిరి**

మార్కెట్ భారీ పతనం కారణంగా రూ.3.46 లక్షల కోట్ల ఇన్వెస్టర్ల సంపద ఆవిరైంది. ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్‌ఈలో లిస్టైన మొత్తం కంపెనీల మార్కెట్ క్యాప్ రూ.3,46,257 కోట్లు హరించుకుపోయి రూ.1,53,04,725 కోట్లకు పడిపోయింది.



జీడీపీ వృద్ధి పడిపోయి, వినియోగ డిమాండ్ కొరవడి గత ఏడాదికాలంగా ప్రపంచ ఈక్విటీ ర్యాలీలో బాగా వెనుకబడిన మన మార్కెట్‌ను ఆర్థిక మంత్రి సీతారామన్...బడ్జెట్‌తో పరుగులు పెట్టిస్తారంటూ ఇన్వెస్టర్లు పెట్టుకున్న భారీ అంచనాలు పటాపంచలయ్యాయి. ఫలితమే సెన్సెక్స్ 988 పాయింట్లు, నిఫ్టీ 300 పాయింట్ల క్రాష్. నాలుగు నెలల క్రితం ఆశ్చర్యకరంగా కార్పొరేట్ పన్నును తగ్గించిన ఆర్థిక మంత్రి సీతారామన్...అదే బహుమతిని వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులకు కూడా ఇవ్వడం ఖాయమేనన్న మార్కెట్ అంచనాలు పూర్తిగా వాస్తవ రూపం దాల్చలేదు. శ్లాబుల్ని విభజించి, రూ.5 లక్షలకుపైబడి పన్ను ఆదాయం కలిగిన వారికి రేట్లు కొంత తగ్గించినప్పటికీ, మరోవైపు వివిధ సెక్షన్ల కింద లభిస్తున్న మినహాయింపుల్ని ఎత్తివేయడంతో మధ్య ఆదాయ వర్గాలకు ఒరిగేదేమీ లేకపోవడం మార్కెట్‌ను షాక్‌కు గురిచేసింది. ఆయా మినహాయింపుల ద్వారా భారీ వ్యాపారాన్ని పొందుతున్న ఇన్సూరెన్స్ కంపెనీల షేర్లు నిలువునా పతనంకావడం, వాటి మాతృ సంస్థలైన పెద్ద ఫైనాన్షియల్ సంస్థల షేర్లు తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనవడం ఇందుకు నిదర్శనం.

**డీడీటీపై డబుల్‌గేమ్...**

అలాగే మరోవైపు డివిడెండ్ పంపిణీ పన్ను (డీడీటీ) పూర్తిగా ఎత్తివేస్తారన్న గట్టి అంచనాలు మార్కెట్లో వున్నాయి. ఈ పన్నును ఎత్తివేస్తున్నట్లు ప్రకటించినా, వాస్తవానికి పన్ను చెల్లింపు బాధ్యతను కంపెనీల నుంచి ఇన్వెస్టర్లకు ఆర్థిక మంత్రి మళ్లించారు. ఇప్పటి వరకూ 20 శాతం డీడీటీని కంపెనీలు చెల్లిస్తుండగా, ఇకనుంచి ఇన్వెస్టర్లు వారి వ్యక్తిగత ఆదాయపు పన్ను శ్లాబుల్ని అనుసరించి, డివిడెండ్ల రూపేణా వచ్చే ఆదాయంపై పన్ను చెల్లించాలి. అధిక ట్యాక్స్ శ్లాబ్ రేట్లలో వుండే సంపన్నులు, ఆయా కంపెనీల ప్రమోటర్లు 43 శాతం పన్నును ఈ డివిడెండ్ ఆదాయంపై చెల్లించాల్సివుంటుంది. అలాంటప్పుడు ప్రమోటర్లు... ఆయా కంపెనీలు భారీ డివిడెండ్లు చెల్లించేందుకు ఎందుకు అంగీకరిస్తారు? బైబ్యాకో, మరో పద్ధతో అనుసరిస్తారు. ఈ కారణంగా ఆర్థిక మంత్రి ప్రకటించిన డీడీటీ ఎత్తివేత ప్రతిపాదన కూడా మార్కెట్‌ను మెప్పించలేకపోయింది. ఇక అంచనాలకు అనుగుణంగా లాంగ్‌టర్మ్ క్యాపిటల్ గెయిన్స్ (ఎల్‌టీసీజీ)పై పన్ను ఎత్తివేతా జరగలేదు.

**కేటాయింపుల సంగతేంటి?**

వ్యవసాయ, మౌలిక రంగాలకు భారీ కేటాయింపులు జరపడం దీర్ఘకాలికంగా మేలు చేకూర్చేదే అయినా, ముఖ్యంగా మౌలిక రంగానికి ప్రతిపాదించిన రూ. లక్ష కోట్ల కేటాయింపులకు సంబంధించి నిర్దిష్టమైన ప్రణాళికలు ఏవీ వెల్లడికాలేదు.

**ద్రవ్యలోటు ఆందోళనలు...**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గత బడ్జెట్లో నిర్దేశించుకున్న 3.3% ద్రవ్యలోటు మించిపోయిందని, అది 3.8 శాతానికి చేరుతుందని స్వయానా ఆర్థిక మంత్రే తన తాజా బడ్జెట్ ప్రసంగంలో చెప్పారు. అలాగే వచ్చే ఆర్థిక సంవత్సరానికి 3.5% ద్రవ్యలోటును ప్రతిపాదించారు.

**బ్యాంకులు బెంబేలు...**

ప్రభుత్వ రంగ బ్యాంకులకు గత కొన్నాళ్లుగా లక్షల కోట్ల మూలధనాన్ని సమకూరుస్తూ, వాటిని ఆదుకుంటున్న కేంద్రం ఈ బడ్జెట్లో తాజా మూలధన కల్పన ప్రకటించకపోగా, క్యాపిటల్ మార్కెట్ నుంచి అవి నిధుల్ని సమీకరించుకోవాలంటూ ఘంటాపథంగా చెప్పడం మార్కెట్‌కు మరో పెద్ద షాక్.

## డిపాజిట్లకు 'ఐదు లక్షల' అభయం

**బ్యాంక్ డిపాజిట్లపై బీమా రూ.5 లక్షలకు పెంపు • ఇప్పటివరకూ ఇది లక్ష రూపాయలే**

**న్యూఢిల్లీ:** సామాన్య బ్యాంకు డిపాజిటర్లకు భరోసాను కల్పించే తీపి కబురును నిర్మలా సీతారామన్ ప్రకటించారు. డిపాజిట్లకు మరింత రక్షణ కల్పిస్తూ, వాటిపై బీమాను ఐదు రెట్లు– రూ. 5 లక్షలకు పెంచారు. వివరాల్లోకి వెళితే... బ్యాంకుల్లో ఫిక్స్‌డ్ డిపాజిట్... ఎక్కువ మందికి సురక్షిత పెట్టుబడి సాధనం. ప్రస్తుతం డిపాజిట్ ఇన్సూరెన్స్ అండ్ క్రెడిట్ గ్యారంటీ కార్పొరేషన్ (డీఐసీజీసీ) పరిధిలో ఒక్కో డిపాజిట్‌దారుడికి గరిష్టంగా రూ.లక్ష బీమా సౌలభ్యతను బ్యాంకులు అందిస్తున్నాయి. దీంతో ఏదైనా బ్యాంకు సంక్షోభం పాలై చెల్లింపుల్లో విఫలమైతే... అప్పుడు ఒక్కో డిపాజిట్ దారుడికి గరిష్టంగా రూ.లక్ష చొప్పున చెల్లిస్తారు. అయితే ఈ మొత్తాన్ని ఆర్థికమంత్రి ఐదు లక్షలకు పెంచారు. ఇటీవలే మహారాష్ట్రకు చెందిన పీఎంసీ బ్యాంకు సంక్షోభం పాలవడంతో ఆ బ్యాంకుల్లో భారీగా డిపాజిట్ చేసుకున్న వారు సమస్యలు ఎదుర్కొంటున్నారు. డిపాజిటర్ల ఆగ్రహాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ముంబై వెళ్లిన సందర్భంగా స్వయంగా చవి చూశారు కూడా. ఆర్‌బీఐ సైతం రంగంలోకి దిగి దిద్దుబాటు చర్యలు చేపట్టింది. ఈ పరిణామాలు బ్యాంకుల్లో డిపాజిట్లపై బీమా మొత్తాన్ని పెంచాల్సిన అవసరాన్ని బలంగా చాటాయి. దీంతో కేంద్ర సర్కారు ఈ అవసరాన్ని గుర్తించింది. దీనితో ఆర్థికశాఖ తాజా బడ్జెట్‌లో కీలక ప్రతిపాదనను ముందుకు తెచ్చింది.

**1993 తర్వాత...:** చివరిగా 1993 మే1న డిపాజిట్లపై బీమాను సవరించారు. 1992లో జరిగిన సెక్యూరిటీస్ స్కామ్ దెబ్బకు బ్యాంక్ ఆఫ్ కరద్ మూతపడడం నాడు డిపాజిట్లపై గరిష్ట బీమాగా ఉన్న రూ.30,000 మొత్తాన్ని రూ.లక్షకు పెంచడానికి కారణమైంది. ఇటీవలి పీఎంసీ బ్యాంకు సంక్షోభం మరో విడత సవరణ అవసరాన్ని గుర్తు చేసింది. అయితే, డిపాజిట్లపై బీమా మొత్తాన్ని పెంచితే బ్యాంకులు చెల్లిస్తున్న ప్రీమియం కూడా పెరుగుతుంది.

**డిపాజిట్ ఎంతున్నా బీమా ఐదు లక్షలకే..!**

బ్యాంకింగ్ అకౌంట్లు అందులోని మొత్తాలతో సంబంధం లేకుండా వ్యక్తిగతంగా ఐదు లక్షల డిపాజిట్ వరకే బీమా వర్తిస్తుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి వద్ద రూ.10 లక్షలు ఉన్నాయనుకుందాం. రెండు వేర్వేరు బ్యాంకుల్లో రూ.ఐదు లక్షల చొప్పున డిపాజిట్ చేస్తే, మొత్తం రూ.10 లక్షలకూ బీమా వర్తించదు. పాన్ నెంబర్‌సహా తాజా బ్యాంకింగ్ సేవల సాంకేతికత వల్ల ఒక వ్యక్తికి బ్యాంకింగ్ వ్యవస్థలో డిపాజిట్ మొత్తం ఎంతుందన్న విషయంలో తేలిగ్గా వెల్లడవుతుంది. అందువల్ల బ్యాంకుల్లో డిపాజిట్ పరిమాణం ఎంతయినా, కేవలం రూ. 5 లక్షలకే బీమా వర్తిస్తుందన్న విషయం గమనార్హం.




**సేవల వ్యయం పెరుగుతుంది**

తాజా నిర్ణయం వల్ల బ్యాంకింగ్ సేవల వ్యయం పెరుగుతుంది. ప్రీమియం ఐదు రెట్లు పెరగడం వల్ల బ్యాంకులపై వ్యయ భారం తీవ్రంగానే ఉంటుంది. ఇది కస్టమర్లకు బదలాయించే అవకాశాలే ఉన్నాయి.

*– అరుంధతీ భట్టాచార్య, ఎస్‌బీఐ మాజీ చైర్మన్*

# ఎల్‌ఐసీ మెగా ఐపీవోకు సై...

**కొన్ని దశాబ్దాలుగా బీమాకు మారుపేరుగా నిలుస్తున్న ఎల్‌ఐసీ పబ్లిక్ ఇష్యూకి రానుంది. తద్వారా సరికొత్త రికార్డులకు తెరతీయనుంది. దేశీ బీమా రంగంలో 70 శాతం మార్కెట్ వాటాతో పోటీ సంస్థలకు అందనంత ఎత్తులో ఉన్న ఎల్‌ఐసీ.. గతేడాదిలో తొలి ఏడాది ప్రీమియమే రూ. 1.42 లక్షల కోట్లను తాకడం కంపెనీ బలాన్ని చెబుతోంది. దేశీ కేపిటల్ మార్కెట్లో కంపెనీకున్న పెట్టుబడుల విలువే రూ. 28.74 లక్షల కోట్లుదాటడం విశేషం!!**

- సౌదీ అరామ్ కో తరహా రికార్డులకు చాన్స్
- లిస్టయితే మార్కెట్ విలువలో ఆర్ఐఎల్, టీసీఎస్ వెనక్కి
- తొలి ఏడాది ప్రీమియం రూ. 1.42 లక్షల కోట్లు

**న్యూఢిల్లీ:** బీమా రంగ ప్రభుత్వ దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్(ఎల్‌ఐసీ) త్వరలో స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్‌కానుంది. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తాజా బడ్జెట్‌లో ఇందుకు ప్రణాళికలు వేశారు. దశాబ్దాలుగా జీవిత బీమాకు మారుపేరుగా నిలుస్తున్న ఎల్‌ఐసీలో వాటా విక్రయాన్ని చేపట్టడం ద్వారా ప్రభుత్వం.. ఆదాయ లోటును పూడ్చుకోవాలని చూస్తోంది. దేశీయంగా అత్యంత విలువైన ఎల్‌ఐసీలో స్వల్ప వాటాకు సైతం అధిక విలువ చేకూరే అవకాశమున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఇటీవల సౌదీ ఇంధన దిగ్గజం అరామ్‌కో స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్‌కావడం ద్వారా సాధించిన రికార్డులను దేశీయంగా ఎల్‌ఐసీ నెలకొల్పే వీలున్నట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. గతేడాది లిస్టయిన అరామ్‌కో ప్రపంచంలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా రికార్డు సాధించింది. ప్రస్తుతం ఎల్‌ఐసీలో ప్రభుత్వానికి 100 శాతం వాటా ఉంది!

**బీమా లీడర్**

జీవిత బీమా రంగంలో ఎల్‌ఐసీ 70 శాతం మార్కెట్ వాటాతో అగ్రస్థానంలో కొనసాగుతుంటే.. మిగిలిన 23 కంపెనీలూ 30 శాతం వాటాను పంచుకుంటున్నట్లు పరిశ్రమవర్గాలు పేర్కొంటున్నాయి. ఇప్పటికే మార్కెట్లో ఎస్‌బీఐ ఇన్సూరెన్స్, జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్, ఐసీఐసీఐ లంబార్డ్ తదితర కంపెనీలు లిస్టయ్యాయి. ప్రభుత్వ ప్రణాళికలు అమలైతే ఎల్‌ఐసీ సైతం స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యే వీలుంది. తద్వారా మార్కెట్ విలువ(కేపిటలైజేషన్)లో దిగ్గజ కంపెనీలు రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ తదితరాలను వెనక్కి నెట్టే అవకాశముంది.

**ఇవీ బలాలు**

ఎల్‌ఐసీ నిర్వహణలోని ఆస్తుల(ఏయూఎం) విలువ 2019లో తొలిసారి రూ. 30 లక్షల కోట్లను అధిగమించింది. రూ. 31.11 లక్షల కోట్లను తాకింది. వార్షిక ప్రాతిపదికన ఇది 9 శాతంపైగా వృద్ధికాగా.. మార్కెట్ విలువ 2019 మార్చికల్లా రూ. 28.74 లక్షల కోట్లుగా తెలుస్తోంది. గతేడాది(2018–19)లో ఎల్‌ఐసీ మొత్తం ఆదాయం ప్రీమియంలతో కలిపి రూ. 5,60,784 కోట్లుగా నమోదైంది. అంతక్రితం ఏడాదితో పోలిస్తే ఇది 7 శాతం అధికం. ప్రధానంగా తొలి ఏడాది ప్రీమియం విలువే రూ. 1.42 లక్షల కోట్లకు చేరడం విశేషం!

**అతిచిన్న కేపిటల్**

1956 ఎల్‌ఐసీ చట్టం ప్రకారం కంపెనీ రూ. 5 కోట్ల కేపిటల్ బేస్‌తో నడుస్తోంది. రూ. 48,436 కోట్ల మిగులు(లాభం)తో ఉంది. అతిచిన్న ఈక్విటీ కారణంగా ఎల్‌ఐసీ పబ్లిక్ ఇష్యూకి అత్యంత భారీ ప్రీమియం పలికే అవకాశముంది. అయితే ఐపీవో చేపట్టేముందు ఎల్‌ఐసీ చట్టంలో పలు మార్పులు చేపట్టవలసి ఉంటుందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎల్‌ఐసీ విక్రయించే అన్ని పాలసీలకూ ప్రభుత్వ హామీతో కూడిన సావరిన్ గ్యారంటీ ఉంటుంది. దీనికితోడు బీమా రంగంలో కంపెనీ ఏర్పాటుకు ఐఆర్‌డీఏ నిబంధనల ప్రకారం రూ. 100 కోట్ల కేపిటల్ బేస్ ఉండాలి.




**పెట్టుబడులు ఇలా**

ప్రభుత్వ రంగ కంపెనీలలో వాటా విక్రయ(డిజిన్వెస్ట్‌మెంట్) అంశంలో ఎల్‌ఐసీ పలుమార్లు ప్రభుత్వాన్ని ఆదుకుంటూ వచ్చిన విషయం విదితమే. తద్వారా పలు కంపెనీలలో వాటాలను సొంతం చేసుకోవడంతోపాటు.. డిబెంచర్లు, బాండ్లలోనూ పెట్టుబడులు కుమ్మరించింది. 2019 కల్లా వీటి విలువ రూ. 4.34 లక్షల కోట్లు. అంతేకాకుండా పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు సైతం నిధులు సమకూర్చింది. ఈ బాటలో ఇటీవలే కేంద్ర రవాణా మంత్రి నితిన్ గడ్కరీ రానున్న ఐదేళ్లలో రూ. 1.25 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులకు నిధులను సమకూర్చేందుకు ముందస్తు అంగీకారం తెలిపినట్లు పేర్కొనడం గమనార్హం!

**బంగారు బాతు**

నిజానికి ప్రభుత్వం ఇంతవరకూ చేపడుతున్న డిజిన్వెస్ట్‌మెంట్‌కు ఎల్‌ఐసీ భారీస్థాయిలోనే చేయూతను ఇస్తోంది. తద్వారా పలు ప్రభుత్వ రంగ కంపెనీలలో వాటాలను సొంతం చేసుకుంటూ వచ్చింది. అయితే తాజాగా కేంద్రం ఎల్‌ఐసీనే డిజిన్వెస్ట్‌మెంట్ జాబితాలో చేర్చింది. ప్రభుత్వ రంగ కంపెనీలలో వాటాల విక్రయం ద్వారా నిధుల సమీకరణ చేపట్టడాన్ని డిజిన్వెస్ట్‌మెంట్‌గా పేర్కొనే సంగతి తెలిసిందే. కాగా.. ఎల్‌ఐసీ లిస్టయితే కార్పొరేట్ పాలన మెరుగుపడే వీలున్నట్లు విశ్లేషణలు ఉన్నాయి. కంపెనీ అపార మిగులు నిధులను ఇన్వెస్ట్ చేసే అంశంలో ఆచితూచి అడుగేయవలసి రావచ్చని నిపుణులు అభిప్రాయపడ్డారు.

### ఐడీబీఐ బ్యాంక్ షేరు జోరు




బడ్జెట్ నేపథ్యంలో స్టాక్ మార్కెట్లు పతనంకాగా.. ఐడీబీఐ బ్యాంక్ కౌంటర్‌కు మాత్రం డిమాండ్ పెరిగింది. బ్యాంకులో మిగిలిన వాటాను విక్రయించనున్నట్లు బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రతిపాదించడంతో ఈ షేరు 10 శాతం దూసుకెళ్లింది. బీఎస్‌ఈలో శనివారం ఐడీబీఐ బ్యాంకు షేరు రూ. 3.4 ఎగసి రూ. 37.30 వద్ద ముగిసింది. ప్రమోటర్‌గా ప్రభుత్వం ఐడీబీఐ బ్యాంకులో 46.5 శాతం వాటాను కలిగి ఉంది. ఎల్‌ఐసీకి 51 శాతం వాటా ఉంది. గత సెప్టెంబర్‌లో ఎల్‌ఐసీ, ప్రభుత్వం సంయుక్తంగా బ్యాంకులో రూ. 9300 కోట్లను ఇన్వెస్ట్ చేశాయి. బ్యాంకు పెట్టుబడి అవసరాలకు తదుపరి ఎల్‌ఐసీ మరో రూ. 4743 కోట్లను పంప్‌చేసింది. కాగా.. ప్రభుత్వం స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారా ఐడీబీఐ బ్యాంకులో వాటాను విక్రయించేందుకు నిర్ణయించుకున్నట్లు తాజాగా వెల్లడించింది.

### నిధుల సమీకరణకు జోష్

దేశీ కేపిటల్ మార్కెట్లో అరామ్‌కో తరహా లిస్టింగ్‌ను ఎల్‌ఐసీ సాధించే వీలున్నట్లు జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజీల సభ్యుల అసోసియేషన్(ఏఎన్‌ఎంఐ) ప్రెసిడెంట్ విజయ్ భూషణ్ పేర్కొన్నారు. ఈ దశాబ్దపు ఐపీవోగా నిలిచే వీలున్నట్లు ఆయన అభిప్రాయపడ్డారు.

ఎల్‌ఐసీ లిస్టింగ్ వల్ల కార్పొరేట్ గవర్నెన్స్, పారదర్శకతకు మెరుగుపడతాయని ఎమ్‌కే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఎండీ కృష్ణ కుమార్ కార్వా పేర్కొన్నారు. తద్వారా ప్రభుత్వానికి మరిన్ని నిధుల సమీకరణ అవకాశాలు లభిస్తాయని అంచనా వేశారు.

ఎల్‌ఐసీ ఐపీవో కోసం ఇన్వెస్టర్లు ఆసక్తిగా ఎదురు చూస్తున్నట్లు మెట్రోపాలిటన్ స్టాక్ ఎక్స్ఛేంజీ మధ్యంతర సీఈవో బాటు నాయర్ చెప్పారు. దీంతో ప్రైమరీ మార్కెట్లకు జోష్ వస్తుందని తెలియజేశారు.

ఎల్‌ఐసీ లిస్టయితే మార్కెట్లకు సానుకూల సంకేతాలు అందుతాయని ట్రేడింగ్ బెల్స్ సహవ్యవస్థాపకులు, సీఈవో అమిత్ గుప్తా పేర్కొన్నారు.

**వ్యతిరేకిస్తున్నాం: యూనియన్లు**

ఎల్‌ఐసీలో వాటాను విక్రయించడం జాతి ప్రయోజనాలకు విరుద్ధమంటూ ఉద్యోగ సంఘాలు(యూనియన్లు) వ్యాఖ్యానించాయి. ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలియజేశాయి. దేశ ఆర్థిక వృద్ధికి ఎల్‌ఐసీ పలు విధాలుగా తోడ్పడినట్లు ఉద్యోగ సంఘాల ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. దేశ ఆర్థిక సార్వభౌమత్వం ప్రమాదంలో పడినట్లు వ్యాఖ్యానించారు. ఎల్‌ఐసీలో వాటా విక్రయానికి ప్రభుత్వం ముందుకెళితే.. దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్లు తెలియజేశారు.





## ధరల కట్టడికి 'స్థిరీకరణ నిధి'



ధరల స్థిరీకరణపై బడ్జెట్ దృష్టి పెట్టింది. ఉల్లిపాయలు, టమాటా వంటి నిత్యావసరాల ధరల కట్టడికి 'ధర స్థిరీకరణ నిధి' (పీఎస్ఎఫ్) ఏర్పాటును బడ్జెట్ ప్రతిపాదించింది. నిత్యావసరాల ధరాఘాతంతో రిటైల్ ద్రవ్యోల్బణం డిసెంబర్‌లో ఐదేళ్ల గరిష్టానికి చేరిన సంగతి తెలిసిందే. ''పప్పులు, ఉల్లి, ఆలూ వంటి వ్యవసాయ ఆధారిత ఉత్పత్తుల ధరల తీవ్ర ఒడిదుడుకులను అరికట్టడానికి పీఎస్ఎఫ్‌ను బడ్జెట్ ప్రతిపాదిస్తోంది'' అని ఆర్థికమంత్రి తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు.

## పెరిగిన సబ్సిడీ బిల్లు



ఆహార, ఇంధన, ఎరువులపై కేంద్ర సబ్సిడీల బిల్లు స్వల్పంగా 0.23 శాతం పెరిగి 2020–21లో రూ.2,27,793.89 లక్షల కోట్లకు చేరింది. సవరించిన అంచనాల ప్రకారం– ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ బిల్లు దాదాపు రూ.2,27,255 కోట్లు. ఆహారధాన్యాలకు సంబంధించి సబ్సిడీ 6.33 శాతం పెరుగుదలతో రూ.1,08,688.35 కోట్ల నుంచి రూ.1,15,569.68 కోట్లకు పెరగనుంది. ఎల్‌పీజీ, కిరోసిన్‌సహా ఫ్యూయల్ సబ్సిడీల భారం రూ.38,568.86 కోట్ల నుంచి రూ.40,915.21 కోట్లకు చేరుతుందని అంచనా. ఒక్క ఎల్‌పీజీ విషయానికి వస్తే, రూ.34,085.86 కోట్ల నుంచి రూ.37,256.21 కోట్లకు పెరుగుతుందని బడ్జెట్ అంచనావేసింది. కిరోసిన్‌పై మాత్రం కేటాయింపులు రూ.4,483 కోట్ల నుంచి రూ.3,659 కోట్లకు తగ్గాయి.



# స్టార్టప్‌లకు జోష్

**ఎసాప్స్‌పై అయిదేళ్ల ట్యాక్స్ హాలిడే**

**రూ. 100 కోట్లలోపు టర్నోవరున్న సంస్థలకూ పన్ను ప్రయోజనాలు**

**న్యూఢిల్లీ:** స్టార్టప్‌లకు ఊతమిచ్చే దిశగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్‌లో పలు ప్రతిపాదనలు చేశారు. ఎంప్లాయీ స్టాక్ ఓనర్‌షిప్ ప్లాన్ (ఎసాప్స్)పై అయిదేళ్ల పాటు ట్యాక్స్ హాలిడే ప్రకటించారు. 'ఎసాప్స్‌కి సంబంధించి ఉద్యోగులపై తక్షణ పన్ను భారం పడకుండా అయిదేళ్ల పాటు లేదా వారు సంస్థ నుంచి తప్పుకునే దాకా లేదా విక్రయించే దాకా (ఏది ముందైతే అది) ట్యాక్స్ హాలిడే వర్తిస్తుంది' అని మంత్రి పేర్కొన్నారు. శైశవ దశలో ఉన్న స్టార్టప్ సంస్థలు నిపుణులైన సిబ్బందిని ఆకర్షించేందుకు, సంస్థను విడిచిపెట్టి వెళ్లిపోకుండా అట్టే పెట్టుకునేందుకు ఈ ఎసాప్స్ ఉపయోగపడతాయి. మరోవైపు, లాభాలపై పన్ను మినహాయింపులను పొందేందుకు సంబంధించి కంపెనీల టర్నోవరు పరిమితిని రూ. 25 కోట్ల నుంచి రూ. 100 కోట్లకు



పెంచారు. డిడక్షన్ క్లెయిమ్ చేసుకునే వ్యవధిని కూడా ఏడేళ్ల నుంచి పదేళ్లకు పొడిగించారు. అలాగే, అంకుర సంస్థలకు తోడ్పాటునిచ్చేందుకు సీడ్ ఫండ్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. దేశ ఎకానమీకి స్టార్టప్‌లు చోదకాలుగా ఉంటున్నాయని, వాటి వృద్ధికి తోడ్పాటునిచ్చేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటోందని నిర్మలా సీతారామన్ తెలిపారు.

### స్టార్టప్‌ల హర్షం..

బడ్జెట్ ప్రతిపాదనలపై స్టార్టప్ సంస్థలు హర్షం వ్యక్తం చేశాయి. ఎసాప్స్, ట్యాక్సేషన్, సీడ్ ఫండ్ తదితర చర్యలు అంకుర సంస్థలకు గణనీయంగా ఉత్సాహం ఇవ్వగలవని ఇండియన్ ఏంజెల్ నెట్‌వర్క్ చైర్మన్ సౌరభ్ శ్రీవాస్తవ తెలిపారు. పన్నులపరమైన వేధింపులు ఉండబోవన్న హామీ.. ఎంట్రప్రెన్యూర్స్‌కు మరింత ధీమానిస్తుందని చెప్పారు. అన్ని దశల్లోనూ తోడ్పాటు అందించేందుకు ప్రత్యేక ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ సెల్ ఏర్పాటు చేయడం వల్ల స్టార్టప్‌లు తమ వ్యాపారంపై మరింతగా దృష్టి పెట్టగలవని వెంచర్ క్యాటలిస్ట్స్ సహ వ్యవస్థాపకుడు అనుజ్ గొలేచా తెలిపారు.

## పెరిగిన ద్రవ్యలోటు లక్ష్యం



**న్యూఢిల్లీ:** ప్రభుత్వ ఆదాయాలు–వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం– ద్రవ్యలోటు లక్ష్యం పెరిగింది. 2019–20 ఆర్థిక సంవత్సరంలో స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో ద్రవ్యలోటు 3.3 శాతంగా ఉండాలన్నది గత బడ్జెట్ లక్ష్యం. అయితే ఈ లక్ష్యాన్ని తాజా బడ్జెట్ (2020–21) 3.8 శాతానికి పెంచింది. ఆదాయాలు లేకపోవడం దీనికి ప్రధాన కారణం. 2020 మార్చి నాటికి ద్రవ్యలోటు రూ. 7,03,760 కోట్లు ఉండాలన్నది 2019–20 బడ్జెట్ లక్ష్యం. . అయితే 2019 డిసెంబర్ ముగిసే నాటికే రూ.9,31,725 కోట్లుగా నమోదయ్యింది. 2019 సెప్టెంబర్‌లో కార్పొరేట్ పన్ను భారీ తగ్గింపు కేంద్ర ఖజానాపై భారీ ప్రభావం చూపింది. ఆదాయానికి రూ.1.45 లక్షల కోట్ల గండి పడిందని అంచనా.

## ఐఎఫ్‌ఎస్‌సీ ఎక్స్చేంజ్‌ల్లో బాండ్ల లిస్టింగ్‌కు బూస్ట్



ఐఎఫ్‌ఎస్‌సీ ఎక్స్చేంజ్‌లో బాండ్ల లిస్టింగ్‌ను ప్రోత్సహించేందుకు.. ఈ బాండ్ల వడ్డీ చెల్లింపులపై విత్‌హోల్డింగ్స్ ట్యాక్స్(ముందస్తుగా వసూలు చేసే పన్ను)ను 5 శాతం నుంచి 4 శాతానికి తగ్గిస్తున్నట్టు మంత్రి ప్రకటించారు. ఈ చర్య మరింత మంది అంతర్జాతీయ ఇన్వెస్టర్లు ఐఎఫ్‌ఎస్‌సీ ఎక్స్చేంజ్‌లోని బాండ్లలో పెట్టుబడులు పెట్టే దిశగా ప్రోత్సహించనుంది. ఈ చర్య బాండ్లను జారీ చేసే కంపెనీలకు మరింత ప్రోత్సాహాన్నిస్తుందని, మరింత మంది అంతర్జాతీయ ఇన్వెస్టర్లను ఆకర్షించగలవని ఇండియా ఇంటర్నేషనల్ ఎక్స్చేంజ్ (ఇండియా ఐఎన్ఎక్స్) ఎండీ, సీఈవో వి.బాలసుబ్రమణియన్ పేర్కొన్నారు. విదేశీ ఇన్వెస్టర్‌కు వడ్డీ లేదా డివిడెండ్ చెల్లింపులపై విత్‌హోల్డింగ్ ట్యాక్స్‌ను దేశాలు వసూలు చేస్తుంటాయి.

**సాక్షి బిజినెస్ వెబ్‌సైట్‌లో...**
- అంచనాలు అధికం...అందుకోని బడ్జెట్
- ఈ రంగాలకు ప్రయోజనం!
- ఈ రంగాలకు ఏమీ లేదు!

మరిన్ని ఆసక్తికర కథనాలు, స్టాక్ అప్‌డేట్స్.. సమగ్ర బడ్జెట్ వివరాలు, విశ్లేషణలు, మార్కెట్ అప్‌డేట్స్ కోసం...
SAKSHIBUSINESS వెబ్‌సైట్ కోసం..
ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి
WWW.BUSINESS.SAKSHI.COM

**బులియన్** రూ.లలో

| | | |
|---|---|---|
| **ముంబై** | | |
| బంగారం (99.9, 10గ్రా) | 41,790 | 0 |
| బంగారం (99.5, 10గ్రా) | 39,800 | 0 |
| వెండి (కిలో) | 50,300 | 0 |
| **హైదరాబాద్/చెన్నై** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 40,770 | 0 |
| బంగారం (22 క్యారెట్లు) | 38,830 | 0 |
| వెండి (కిలో) | 50,300 | 0 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 40,850 | ▲ 50 |
| బంగారం (22 క్యారెట్లు) | 37,800 | ▲ 110 |
| వెండి (కిలో) | 47,800 | 0 |
| **ఏపీ బులియన్ అసోసియేషన్** | | |
| బంగారం (24 క్యారెట్లు) | 42,320 | ▲ 380 |
| బంగారం (22 క్యారెట్లు) | 39,220 | ▲ 390 |
| వెండి (కిలో) | 48,300 | ▲ 600 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 2-2-2020

| | |
|---|---|
| విశాఖ | 375–00 |
| చిత్తూరు | 393–00 |
| వరంగల్ | 358–00 |
| విజయవాడ | 350–00 |
| గోదావరి | 350–00 |
| 1-2-2020 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 355–00 |

### క్లుప్తంగా...

- **సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈ) ఈ బడ్జెట్ తగినంత వెసులుబాటునిచ్చింది. నిబంధనల అమలు భారాన్ని తగ్గించి, వృద్ధికి బాటలు వేసింది. రూ.5 కోట్ల వరకు టర్నోవర్ ఉన్న సంస్థలకు ఖాతాల ఆడిటింగ్ బాధ నుంచి విముక్తి కల్పించింది.**
- **జాతీయ సరుకు రవాణా విధానాన్ని (లాజిస్టిక్స్ పాలసీ) త్వరలోనే విడుదల చేస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు.**
- **నిధుల లభ్యత సమస్యతను ఎదుర్కొంటున్న ఎన్‌బీఎఫ్‌సీ, హౌసింగ్ ఫైనాన్స్(హెచ్ఎఫ్‌సీ) రంగానికి క్రెడిట్ గ్యారంటీని (రుణ హామీ) అందించేందుకు ప్రభుత్వం ముందుకు వచ్చింది. అలాగే రుణ వసూలు ప్రక్రియ కింద ఆస్తుల అర్హత ప్రమాణాలను కూడా ప్రభుత్వం తగ్గించింది.**
- **ప్రభుత్వ రంగ సంస్థల కొనుగోళ్లకు సంబంధించిన గవర్నమెంట్ ఈ-మార్కెట్‌ప్లేస్ (జీఈఎం) టర్నోవరును రూ. 3 లక్షల కోట్లకు పెంచాలని కేంద్రం నిర్దేశించుకుంది. చిన్న, మధ్య తరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈ)కు ఇది మెరుగైన వ్యాపార అవకాశంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు.**

# ఒక ప్రధాన పోర్ట్‌నైనా కార్పొరేటీకరిస్తాం

**బడ్జెట్‌లో ప్రతిపాదించిన నిర్మలా సీతారామన్**

**న్యూఢిల్లీ:** పోర్టుల పనితీరును మరింత మెరుగుపరచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నది. తగిన వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు కనీసం ఒక ప్రధాన పోర్ట్‌ను అయినా కార్పొరేటీకరణ చేయాలని, ఆ తర్వాత దానిని స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ చేయాలని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్లో ప్రతిపాదించారు. యాంత్రీకరణ, డిజిటైజేషన్, సరళతరమైన విధానాలు అవలంచడం తదితర చర్యల ద్వారా పోర్టుల నిర్వహణ సామర్థ్యాలను మెరుగుపరిచే ప్రయత్నాలను ప్రభుత్వం చేస్తోందని వెల్లడించారు. లోథాల్(గుజరాత్)లో మారిటైమ్ మ్యూజియమ్‌ను ఏర్పాటు చేస్తామని సీతారామన్ తెలిపారు. ఇది స్వతంత్ర అంతరజల పురావస్తు పరిశోధన కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. భారత్‌లోని ప్రధాన పోర్టుల సామర్థ్యం ఏడాదికి 1,514 మిలియన్ టన్నులుగా ఉంది. భారత్‌లో మొత్తం 12 ప్రధాన పోర్టులున్నాయి. ముంబై, దీన్‌దయాళ్(గతంలో కాండ్లా), జేఎన్‌పీటీ, మార్మగోవా, న్యూ మంగళూరు, కొచ్చి, చెన్నై, కామరాజర్(గతంలో ఎన్నోర్), వీ ఓ చిదంబరానార్, విశాఖపట్టణం, పారదీప్, కోల్‌కత(హల్దియాను కూడా కలుపుకొని).

## కంపెనీల చట్టానికి సవరణలు



కంపెనీల చట్టానికి సవరణలను ప్రతిపాదించినట్టు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. పన్ను చెల్లింపుదారులు ఎటువంటి వేధింపులకు గురికాకుండా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉన్నట్టు ఆమె చెప్పారు. కార్పొరేట్ వ్యవహారాల శాఖను కూడా నిర్మలా సీతారామనే చూస్తున్నారు. దీంతో ఉన్నత స్థాయి కమిటీ సూచనల మేరకు పలు అపరాధములను (పరిష్కారానికి అర్హమైనవి) నేరాలుగా పరిగణించకుండా కంపెనీల చట్టం 2013కు సవరణలను మంత్రి ప్రతిపాదించారు. కంపెనీల చట్టంలో ప్రస్తుతమున్న సగానికి పైగా అపరాధాలను నేరపూరితం కానివిగా మార్చాలంటూ గతేడాది నవంబర్‌లో కార్పొరేట్ వ్యవహారాల శాఖ కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ అధ్యక్షతన గల కమిటీ ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన విషయం గమనార్హం.

## గిఫ్ట్‌సిటీలో ఇంటర్నేషనల్ బులియన్ ఎక్స్చేంజ్ ఏర్పాటు

**న్యూఢిల్లీ:** గుజరాత్‌లోని అహ్మదాబాద్ సమీపంలోని గిఫ్ట్ సిటీలో ఉన్న ఇంటర్నేషనల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ సెంటర్(ఐఎఫ్‌ఎస్‌సీ)లో అంతర్జాతీయ బులియన్ ఎక్స్చేంజ్‌ను ఏర్పాటు చేయనున్నారు. సంబంధిత ఆమోదాలు లభించగానే ఈ ఎక్స్చేంజ్‌ను గిఫ్ట్ సిటీ ఏర్పాటు చేస్తుందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. బంగారానికి మరింత ధర రాబట్టటం, మరిన్ని ఉద్యోగాలు కల్పించడం, అంతర్జాతీయంగా బులియన్ మార్కెట్లో భారత స్థితిని మరింత మెరుగుపరచడం లక్ష్యాలుగా అంతర్జాతీయ బులియన్ ఎక్స్చేంజ్‌ను ఏర్పాటు చేయనున్నామని వివరించారు. అంతర్జాతీయ ఆర్థిక కేంద్రంగా అవతరించగల సత్తా ఐఎఫ్‌ఎస్‌సీకి ఉందని వివరించారు. ఇప్పటికే ఐఎఫ్‌ఎస్‌సీలో 19 బీమా సంస్థలు, 40 బ్యాంకింగ్ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, విలువైన లోహాలను పరీక్షించే పరిశోధన శాలలు, రిఫైనింగ్ సౌకర్యాలు కూడా ఐఎఫ్‌ఎస్‌సీలో ఉన్నాయని తెలిపారు.



## ఎగుమతిదారులకు ప్రత్యేక పథకం

**పన్నులు, సుంకాల రీయింబర్స్‌మెంట్**

**న్యూఢిల్లీ:** మందగించిన ఎగుమతులకు ఊతమిచ్చే దిశగా బడ్జెట్‌లో కేంద్రం చర్యలు ప్రకటించింది. కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థల స్థాయిల్లో ఎగుమతిదారులు చెల్లించే వివిధ సుంకాలు, పన్నులను రీయింబర్స్ చేసేందుకు ఈ ఏడాది ప్రత్యేక పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు పేర్కొంది. విలువ ఆధారిత పన్నులు (వ్యాట్), విద్యుత్ సుంకాలు, రవాణా కోసం ఉపయోగించే ఇంధనాల వ్యయాలు మొదలైనవి వీటిలో ఉన్నాయి. ప్రస్తుతం ఇలాంటి వాటికి మినహాయింపులు గానీ రీఫండ్ గానీ లభించడం లేదు. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) నిబంధనల ప్రకారం.. విద్యుత్, ఇంధనం, నీరు మొదలైన వాటిపై చెల్లించే పన్నులకు రీఫండ్ వెసులుబాటు ఉంటోంది. ప్రతి జిల్లాను ఎగుమతి హబ్‌గా అభివృద్ధి చేసేందుకు కేంద్రం, రాష్ట్రాల ప్రభుత్వాలు కలిసి పని చేస్తున్నాయని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెప్పారు. గతేడాది డిసెంబర్ దాకా వరుసగా అయిదు నెలల పాటు ఎగుమతులు క్షీణించాయి. డిసెంబర్‌లో 1.8 శాతం తగ్గి 27.36 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. 2019–20 ఏప్రిల్–డిసెంబర్ మధ్యకాలంలో ఎగుమతులు 1.96 శాతం క్షీణించి 239.29 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి.

## ఇన్వెస్టర్లపై డివిడెండ్ ట్యాక్స్ భారం

**న్యూఢిల్లీ:** కంపెనీలపై డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్(డీడీటీ) భారం తొలగనున్నది. డీడీటీని కంపెనీల నుంచి ఇన్వెస్టర్లకు బదిలీ చేయాలని 2020–21 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిపాదించారు. ఇది సాహసోపేతమైన నిర్ణయమని, ఈ నిర్ణయం కారణంగా పెట్టుబడులకు ఆకర్షణీయంగా భారత్ అవతరిస్తుందని ఆమె వ్యాఖ్యానించారు. కంపెనీలపై డీడీటీని తొలగించడం కారణంగా ఏడాదికి రూ.25,000 కోట్ల ఆదాయం కోల్పోవలసి వస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుతం కంపెనీలు ఇన్వెస్టర్లకు చెల్లించే డివిడెండ్లపై 15 శాతం మేర పన్ను చెల్లిస్తున్నాయి. దీనికి సర్‌చార్జీ, సెస్సు అదనం. తాజా ప్రతిపాదన ప్రకారం, ఇన్వెస్టర్లు తాము పొందే డివిడెండ్లపై తమకు వర్తించే ఆదాయపు పన్ను రేట్ల ప్రకారం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అనుబంధ కంపెనీ నుంచి హోల్డింగ్ కంపెనీ స్వీకరించే డివిడెండ్‌ను మినహాయించే ప్రతిపాదన కూడా ఉంది.



# టెలికం నుంచి రూ. 1.33 లక్షల కోట్ల వసూళ్లు

**న్యూఢిల్లీ:** స్పెక్ట్రం యూసేజీ చార్జీలు, లైసెన్సు ఫీజు బకాయిల రూపంలో టెలికం రంగం నుంచి వచ్చే ఆర్థిక సంవత్సరం రూ. 1.33 లక్షల కోట్ల మేర రాగలవని కేంద్రం అంచనా వేస్తోంది. ఇందుకు సంబంధించి కమ్యూనికేషన్స్ విభాగం కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ. 58,687 కోట్లు రావొచ్చని బడ్జెట్‌లో పేర్కొంది. వాస్తవానికి ఇది రూ. 50,520 కోట్ల స్థాయిలో ఉండొచ్చని 2019–20 బడ్జెట్‌లో కేంద్రం అంచనా వేసింది. తాజాగా కొత్త ఆర్థిక సంవత్సరంలో అంతకు రెట్టింపు వసూళ్ల నిర్దేశించుకుంది. ఇప్పటికే ఆర్థిక సంక్షోభంతో కుంగుతున్న టెలికం రంగానికి తాజా బకాయిల కారణంగా మరో రూ. 1.47 లక్షల కోట్ల మేర



భారం పడనుంది. సవరించిన స్థూల ఆదాయానికి (ఏజీఆర్) లెక్కింపు విషయంలో కేంద్రం ఫార్ములాను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇటీవలే ఆదేశాలు ఇవ్వడం .. టెల్కోలకు అశనిపాతంగా మారిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ గణాంకాల ప్రకారం భారతీ ఎయిర్‌టెల్ రూ. 35,586 కోట్లు, వొడాఫోన్ ఐడియా రూ. 53,038 కోట్లు కట్టాల్సి రానుంది. మిగతాది ప్రభుత్వ రంగంలోని బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌తో పాటు మూతబడిన మరికొన్ని టెలికం సంస్థలు కట్టాల్సి రానుంది. సవరించిన స్థూల ఆదాయం (ఏజీఆర్) అంశం చాలా సంక్లిష్టమైనదని, ఈ వివాదాన్ని పరిష్కరించుకోవడంపై పరిశ్రమ, ప్రభుత్వం చర్చలు జరుపుతున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. బడ్జెట్ అనంతరం విలేకరుల సమావేశంలో తెలిపారు. టెల్కోల బకాయిలను లెక్కించేందుకు ఏ ఆదాయాలను పరిగణనలోకి తీసుకోవాలన్న అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోందని పేర్కొన్నారు.

# ప్యాసింజర్ వాహన అమ్మకాల్లో తగ్గుదల



**మారుతీ మినహా అన్ని కంపెనీల విక్రయాలు డౌన్**

**న్యూఢిల్లీ:** జనవరి నెలలో ప్యాసింజర్ వాహనాల (పీవీ) విక్రయాలు తగ్గుదలను నమోదుచేశాయి. ఈ రంగంలో మార్కెట్ లీడర్‌గా ఉన్న మారుతీ సుజుకీ మినహాయించి మిగిలిన అన్ని కంపెనీల అమ్మకాలు తగ్గాయి. గతేడాది ప్రారంభం నుంచి సెప్టెంబర్ నెల దాకా క్రమంగా తగ్గిపోయిన అమ్మకాలు, మళ్లీ ఇప్పుడు అదే పరిస్థితి కొనసాగుతుందని స్పష్టం చేస్తున్నాయి. పండుగల సీజన్ కావడంతో ఏడాది చివర్లో కాస్త కోలుకున్నప్పటికీ, తాజాగా వెల్లడైన గణాంకాల ప్రకారం.. మందగమనం కొనసాగుతూనే ఉందన్న విషయం వెల్లడైందని ఈ రంగ నిపుణులు చెబుతున్నారు. ఇక బడ్జెట్‌లో కూడా ఆటో రంగాన్ని ఆదుకునే ప్రకటనలు ఏమీ వెల్లడికాలేదు. సంక్షోభంలో ఉన్న ఆటో పరిశ్రమను ఆదుకోవడానికి ప్రభుత్వం ఈ సారి బడ్జెట్‌లో పలు కీలక ప్రకటనలు చేస్తుందని అంచనావేయగా.. అటువంటి ప్రత్యక్ష ప్రకటనలు లేవని సియామ్ అధ్యక్షుడు రాజన్ వధేరా అన్నారు.

**జనవరి వాహన విక్రయాలు (దేశీయ)**

| కంపెనీ | 2020 | 2019 | వృ/క్షీ.(శాతం) |
|---|---|---|---|
| మారుతీ సుజుకీ | 1,44,499 | 1,42,150 | 1.7 |
| హ్యుందాయ్ | 42,002 | 45,803 | – 8.3 |
| టాటా మోటార్స్ | 45,242 | 54,915 | – 18 |
| హోండా కార్స్ | 5,299 | 18,261 | – 71 |
| టయోటా | 5,804 | 11,221 | – 48 |
| మహీంద్రా | 50,785 | 52,500 | – 3 |

## ఆహారం, వ్యవసాయం మీద ఫోకస్



ఆహార, వ్యవసాయ రంగానికి బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇచ్చారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మెరుగుపరిచే బడ్జెట్ అన్నారు. ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీకి పథకాన్ని అందించడం ద్వారా తయారీ రంగానికి ప్రోత్సాహాన్ని అందిస్తుంది. ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ సెల్ ఏర్పాటు, డివిడెంట్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్ తొలగింపు వాటితో పెట్టుబడుల ప్రవాహం పెరుగుతుంది. ఆదాయ పన్ను శాతాన్ని తగ్గించడం వల్ల ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుంది.

– డి రాజు, సీఐఐ తెలంగాణ చైర్మన్

## విద్యా రంగంలో పెట్టుబడులు



విద్యా, ఉపాధి, నైపుణ్యం మీద ఎక్కువ దృష్టి పెట్టారు. పట్టణ స్థానిక సంస్థల్లో విద్యార్థులకు అప్రెంటిస్ ప్రోగ్రామ్‌తో మన గ్రాడ్యుయేట్లకు అభ్యసన అనుభవం పెరుగుతుంది. కొత్త కోర్స్‌లు, యూనివర్సిటీల ఏర్పాటు, కొత్త ఎడ్యుకేషన్ పాలసీతో విద్యా రంగంలో పెట్టుబడులు పెరుగుతాయి. పీజీ కోర్స్‌లను నడిపే పెద్ద ఆసుపత్రులను అనుమతించడం వల్ల వైద్య రంగంలో ఎక్కువ మంది నిపుణులు వస్తారు.

– డాక్టర్ బీవీఆర్ మోహన్ రెడ్డి,
సీఐఐ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్, సైయంట్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్

## వ్యాపారం పట్ల విశ్వాసం



భారత కార్పొరేట్ రంగాన్ని వెంటాడుతోన్న పన్ను వేధింపులకు ముగింపు పలుకుతామని ఆర్థిక మంత్రి భరోసా ఇచ్చారు. సకాలంలో రిటర్నులు సమర్పించలేకపోయిన కంపెనీలపై ప్రస్తుతం అమల్లో ఉన్న క్రిమినల్ చర్యల స్థానంలో సివిల్ యాక్షన్ ఉండేలా కంపెనీల చట్టంలో పలు మార్పులు చేయనున్నామని ప్రకటించారు. ఇది కార్పొరేట్ వర్గానికి భారత్‌లో వ్యాపారం పట్ల నమ్మకాన్ని పెంచేదిగా ఉంది.

– కిరణ్ మజుందార్ షా, బయోకాన్ సీఎండీ

## ఉత్పత్తికి భరోసా



ఉత్పత్తికి అవసరమైన భరోసాను ఇవ్వాలి. నాణ్యతపై దృష్టి సారించడం, ఎగుమతుల ప్రక్రియను సులభతరం చేయడం, ఎలక్ట్రానిక్స్‌లో పెట్టుబడులను ఆకర్షించడం వంటి అంశాల ఆధారంగా ఇది సాధ్యపడుతుంది. వీటిని ప్రభుత్వం అత్యవసరంగా అమలు చేయాలన్నదే ఇప్పుడు కీలకాశం.

– పవన్ గోయెంకా, మహీంద్రా అండ్ మహీంద్ర మేనేజింగ్ డైరెక్టర్

## అభివృద్ధి బాటలో...



భారత ఆర్థిక వ్యవస్థ 5 ట్రిలియన్ల ఎకానమీగా ఎదిగేందుకు అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటుందనే విషయం తాజా బడ్జెట్ ప్రకటన ద్వారా వెల్లడైంది. సంపద సృష్టికర్తలైన వ్యాపారులకు గౌరవం ఇవ్వాలన్న నిర్మలా సీతారామన్ మాట ఆకట్టుకుంది. టెక్నాలజీ పరంగా అంతర్జాతీయ ట్రెండ్‌కు అనుగుణంగా అభివృద్ధిలో అన్ని వర్గాలను భాగస్వాములను చేస్తూ బడ్జెట్ ప్రకటించారు.

– సునీల్ మిట్టల్, భారతీ ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్

## ఆటో పరిశ్రమకు మొండిచేయి



బడ్జెట్ ప్రసంగం మేం ఆశించిన స్థాయిలో లేదు. మందగమనంలో ఉన్న ఆటో పరిశ్రమను ఆదుకోవడానికి ప్రభుత్వం ఈ సారి బడ్జెట్‌లో పలు కీలక ప్రకటనలు చేస్తుందని భావించాం. కానీ, అంచనాలకు అనుగుణంగా ప్రత్యక్ష ప్రకటనలు ఏమీ లేవు.

– రాజన్ వధేరా, సియామ్ అధ్యక్షుడు

## ఆరోగ్య భారతావనిగా..



బడ్జెట్‌ను పరిశీలిస్తే ఆరోగ్య భారతావని దిశగా కేంద్ర ప్రభుత్వ నిబద్ధత కనిపిస్తోంది. ప్రపంచం అనుకరించే మోడల్ అవుతుంది. రానున్న రోజుల్లో దేశ వ్యాప్తంగా అందరు పౌరులకు హెల్త్ స్క్రీనింగ్ కార్యక్రమం చేపడతారని భావిస్తున్నాం. ఇది జరిగితే తమతమ ఆరోగ్య స్థితి ఎలా ఉందో పౌరులకు తెలుస్తుంది. అందుకు తగ్గట్టుగా ఆరోగ్యంపై శ్రద్ధ కనబరుస్తారు. సమస్యలను, మరణాలను ముందస్తుగా కట్టడి చేసేందుకు వీలువుతుంది.

– ప్రతాప్ సి రెడ్డి చైర్మన్, అపోలో హాస్పిటల్స్.

## ఎన్నో ఆశలు పెట్టుకున్నాం..



ఈ బడ్జెట్‌పై పరిశ్రమ ఎన్నో ఆశలు పెట్టుకుంది. ఆర్థిక వ్యవస్థ తీరును చూస్తే పెద్ద, సాహసోపేత నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. అంచనాలకు తగ్గట్టుగా లేకపోవడం నిరుత్సాహపర్చింది. ఫార్మా ఎగుమతులను పెంచేందుకు, ఈ రంగంలో పోటీ అధికం అయ్యేందుకు ఆర్థిక ప్రోత్సాహకాలు అందిస్తారని భావించాం. మొత్తంగా ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, నియంత్రణపర వెసులుబాట్లు, విధానపర స్థిరత్వం ఫార్మా పరిశ్రమ కొత్త పుంతలు తొక్కడానికి వీలవుతుంది. ఏదేమైనప్పటికీ ఆరోగ్యసేవలు ప్రభుత్వ ప్రాధాన్య అంశంగా కొనసాగుతోంది. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమం విస్తరణలో భాగంగా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఆసుపత్రుల నిర్మాణం ఆహ్వానించతగ్గది.

– సతీష్ రెడ్డి, చైర్మన్, డాక్టర్ రెడ్డీస్.

## అందరికీ ఆరోగ్యం..



అంతర్జాతీయ ఆరోగ్య రంగ పరిస్థితులను పరిగణలోకి తీసుకుంటే.. బడ్జెట్ కేటాయింపులనుబట్టి అందరికీ ఆరోగ్యం ప్రభుత్వ సంపూర్ణ విధానంలా ఉంది. ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ప్రభుత్వం ఆసుపత్రులను ఏర్పాటు చేయడం ద్వారా అందరికీ ఆరోగ్య సేవలు చేరాలన్న లక్ష్యం నెరవేరుతుంది.

– అనిల్ కృష్ణ, చైర్మన్, మెడికవర్ హాస్పిటల్స్.

## ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టే ప్రయత్నం



దేశ ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడినపెట్టే ప్రయత్నం చేసినట్టు ఉంది. తప్పనిసరి ఆడిట్‌కు టర్నోవర్ పరిమితిని రూ.1 కోటి నుంచి రూ.5 కోట్లకు పెంచడం పెద్ద ఉపశమనం. కంపెనీలకు డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్ మినహాయింపును స్వాగతిస్తున్నాం. ఎన్నో ఏళ్లుగా దీనికోసం పరిశ్రమ ఎదురు చూస్తోంది. మొత్తంగా బడ్జెట్‌కు 10కిగాను ఎనిమిది మార్కులు ఇస్తున్నాం.

– కరుణేంద్ర ఎస్ జాస్తి, ఎఫ్‌టీసీసీఐ ప్రెసిడెంట్

## సూర్యేశ్వరుడిగా శ్రీరుద్రేశ్వరస్వామి



హన్మకొండ కల్చరల్: వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలోని చరిత్రాత్మక శ్రీ రుద్రేశ్వర స్వామి వారి వేయిస్తంభాల దేవాలయంలో శనివారం రథ సప్తమిని పురస్కరించుకుని స్వామివారిని శ్రీ సూర్యేశ్వరుడిగా అలంకరించారు. ప్రపంచాన్ని భయపెడుతున్న కరోనా వైరస్ బారి నుంచి మానవాళిని రక్షించాలని కోరుతూ అరుణపారాయణం చేశారు.

## కంటి వైద్యం కోసం కార్మికుడి భిక్షాటన

**వాజేడు:** కంటికి వైద్యం చేయించుకోవడానికి డబ్బులు లేక గ్రామ పంచాయతీ కార్మికుడు భిక్షాటన చేశాడు. ఈ ఘటన ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. చెరుకూరు గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న పాయం రాజేశ్వర్‌రావుకు కొన్ని రోజులుగా కంటి పూత వచ్చింది. వైద్యం చేస్తేనే కన్ను కనిపించే పరిస్థితి నెలకొంది. పంచాయతీ



నుంచి వేతనాలు అందకపోవడంతో పూట గడవడమే కష్టంగా మారింది. ఈ నేపథ్యంలో వైద్యం చేయించుకోవడానికి చేతిలో చిల్లి గవ్వ లేదు. దీనికితోడు అతడి భార్య 8 నెలల గర్భవతి కావడంతో కూలి పనులకు వెళ్లలేని పరిస్థితి. కూతురు చదువుకుంటోంది. తన కంటికి వైద్యం చేయించుకోకుంటే చూపు పూర్తిగా పోయే ప్రమాదం ఉంది. ఈ నేపథ్యంలో మండలంతో పాటు మిగతా గ్రామ పంచాయతీ కార్మికులు, నాయకుల సహకారంతో శనివారం భిక్షాటన చేయగా రూ.1700 వచ్చాయని రాజేశ్వర్‌రావు తెలిపాడు. ఇది ఈ ఒక్క కార్మికుడి సమస్యే కాదని, జీపీల్లో పనిచేసే చాలా మంది వేతనాలు రాక ఇబ్బంది పడుతున్నారని వాపోయాడు.

## అంతర్జాతీయ స్టోన్ ఎగ్జిబిషన్‌కు తాండూరు నాపరాయి



**తాండూరు రూరల్:** బెంగళూర్‌లో నిర్వహించనున్న అంతర్జాతీయ స్టోన్ ఎగ్జిబిషన్‌కు తాండూరు నాపరాయిని మైనింగ్ ఏడీ రవి తీసుకెళ్లారు. శనివారం వికారాబాద్ జిల్లా తాండూరు మండలం అల్లాపూర్ శివారులోని ఓ పాలిషింగ్ యూనిట్ నుంచి తీసిన నాపరాతిని ప్రత్యేక వాహనంలో తరలించారు. తాండూరు ప్రాంతంలోని సుద్ద, ఎర్రమట్టి, నాపరాయిని ప్రదర్శనకు ఉంచుతామన్నారు. రెండేళ్లకోసారి ఈ ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

## రిజర్వేషన్లు కల్పించండి

### కేటీఆర్‌తో బీసీ సంఘాల ప్రతినిధుల భేటీ

**సాక్షి, హైదరాబాద్:** చట్టసభల్లో జనాభా దామాషా ప్రకారం బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించడంతో పాటు, జనగణనలో బీసీల కోసం ప్రత్యేక కాలమ్ చేర్చేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం విజ్ఞప్తి చేసింది. బీసీల సంక్షేమ బడ్జెట్‌ను రూ.10 వేల కోట్లకు పెంచడంతోపాటు, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కోరింది. ఎక్సైజ్, క్రీడా శాఖ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ నేతృత్వంలో బీసీ సంఘాల ప్రతినిధులు



**కేటీఆర్‌కు కృతజ్ఞతలు చెబుతున్న బీసీ సంఘాల నేతలు**

శనివారం టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌తో ప్రగతిభవన్‌లో భేటీ అయ్యారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీసీ, ఎంబీసీ కులాలకు చెందిన వారికి ఎక్కువ సంఖ్యలో ప్రాతినిధ్యం కల్పించడంపై కేటీఆర్‌కు బీసీ సంఘాల నేతలు కృతజ్ఞతలు తెలిపారు. కేటీఆర్‌ను కలిసిన వారిలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎంబీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు కె.సి.కాళప్ప, డా.విజయ్ భాస్కర్ గౌడ్, ప్రేమ్ లాల్, మల్లిఖార్జున్ ఖడ్గే తదితరులు ఉన్నారు.

## కారిడార్‌లోనే కాన్పు

### తాండూరు జిల్లా ప్రభుత్వాస్పత్రిలో ఘటన



**తాండూరు:** తాండూరు జిల్లా ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం మరోసారి బట్టబయలైంది. వికారాబాద్ జిల్లా బంట్వారం మండలం తొర్మామిడికి చెందిన శ్రీనివాస్ తన భార్య లక్ష్మికి నెలలు నిండటంతో మర్పల్లి మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. అక్కడి సిబ్బంది తాండూరు జిల్లా ఆస్పత్రికి వెళ్లాలని చెప్పారు. దీంతో లక్ష్మిని శనివారం తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించాడు. లక్ష్మికి పరీక్షలు చేయకుండానే అక్కడున్న సిబ్బంది వైద్యురాలు లేదని చెప్పారు. బీపీ ఎక్కువగా ఉందని, హైదరాబాద్ తీసుకెళ్లాలని చెప్పారు. దీంతో శ్రీనివాస్ అంబులెన్స్ కోసం వెళ్లాడు. ఇంతలో నొప్పులు ఎక్కువై లక్ష్మి ఆస్పత్రి కారిడార్‌లోనే బిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా బీపీ అధికంగా ఉందని రిఫర్ చేసి ఉంటారని తెలిపారు.



## వేసవి అతిథులు వచ్చేశాయ్..

ప్రతి ఏటా శీతాకాలం ముగిసే సమయానికి సైబీరియన్ కొంగలు మహబూబాబాద్ జిల్లాలోని మల్యాల, మాధవాపురం తదితర ప్రాంతాలకు వేసవి విడిది కోసం వస్తుంటాయి. ఇక్కడి చెరువుల పక్కన ఉన్న చెట్లపై ఆవాసాలు ఏర్పాటు చేసుకుని గుడ్లుపెట్టి వాటిని పొదిగి పిల్లలు చేస్తాయి. వర్షాకాలం ప్రారంభం కాగానే పిల్లలతో కలసి తిరిగి వెళ్లిపోతాయి. శనివారం జిల్లా కేంద్రంలోని నిజాం చెరువులో సైబీరియన్ పక్షులు చేపల వేట కొనసాగిస్తూ 'సాక్షి'కెమెరాకు చిక్కాయి.

# దాల్ సరస్సులా గోదారి



**కాళేశ్వరం వల్ల ఏడాది పొడవునా నీటి నిల్వకు అవకాశం**

**రాష్ట్ర పర్యాటకాభివృద్ధికి దీనిని వాడుకోవాలి**

**అధికారులకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు**

**సాక్షి, హైదరాబాద్:** 'శ్రీనగర్‌లోని దాల్ సరస్సును చూడగానే ముందుగా ఆకట్టుకునేవి గట్టున పొడవుగా ఉండే చెట్లు. మంచు కురిసే వాతావరణంలో సుందరంగా ఉండే సరస్సు అందాన్ని ఆ చెట్లు రెట్టింపు చేస్తాయి. ఇప్పుడు అదే తరహా ఎత్తయిన చెట్లను గోదావరి తీరం వెంట పెంచాలి'అని అధికారులను ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధిపై ప్రగతి భవన్‌లో శనివారం సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. 'కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన బ్యారేజీల వల్ల వందల కిలోమీటర్ల మేర గోదావరి నదిలో నిత్యం జలకళ ఉట్టి పడుతుంది. ఏడాది పొడవునా నదుల్లో, కాల్వల్లో నీరు నిల్వ ఉంటుంది. నదికి ఇరు వైపులా దట్టమైన అటవీ ప్రాంతం ఉంది. నదికి ఇరు వైపులా దాల్ సరస్సులా ఉండే తరహాలో ఆకర్షణీయమైన చెట్లు పెంచవచ్చు. నదిలో బోటింగుకు అవకాశం ఉంది. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని బ్యారేజీలు, రిజర్వాయర్లు, పంపు హౌస్‌ల వద్ద కావాల్సినంత స్థలం ప్రభుత్వ అధీనంలోనే ఉంది. అక్కడ బృందావన్ గార్డెన్ లాంటి మ్యూజికల్ ఫౌంటెయిన్‌లు, వాటర్ పార్కులు ఏర్పాటు చేయవచ్చు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా పర్యాటకానికి అనువైన ప్రాంతాలను ఎంపిక చేసి పర్యాటక కేంద్రాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి'అని సీఎం పేర్కొన్నారు.

**అనేక పుణ్యక్షేత్రాలు..**

'కాళేశ్వరం ప్రాజెక్టుతోపాటు తుపాకుల గూడెం, దుమ్ముగూడెం బ్యారేజీలు కూడా నిర్మితమవుతున్నాయి. వీటికి ఆనుకునే బాసర, ధర్మపురి, కాళేశ్వరం, గూడెం సత్యనారాయణస్వామి, కోటి లింగాల, పర్ణశాల, భద్రాచలం లాంటి పుణ్యక్షేత్రాలున్నాయి. రామగుండం, మంచిర్యాల తదితర ప్రాంతాల్లో బొగ్గు గనులున్నాయి. ఓపెన్ కాస్ట్, అండర్ గ్రౌండుల్లో బొగ్గు ఉత్పత్తి ఎలా అవుతుందో, పంపు హౌస్‌ల పనితీరు ఎలా ఉంటుందో పర్యాటకులకు చూపించే వీలుంటుంది. రామగుండం, జైపూర్‌లో విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను కూడా సందర్శనీయ ప్రాంతాలుగా తీర్చిదిద్దవచ్చు. వీటిని దృష్టిలో ఉంచుకుని పర్యాటక కేంద్రాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి'అని ముఖ్యమంత్రి ఆదేశించారు. సమావేశానికి ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణ, సీఎం ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు, కార్యదర్శి స్మితా సబర్వాల్, ప్రత్యేక కార్యదర్శి భూపాల్‌రెడ్డి, పర్యాటకాభివృద్ధి సంస్థ ఎండీ మనోహర్, కాళేశ్వరం ప్రాజెక్టు ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### 7న మేడారానికి సీఎం కేసీఆర్

ఈనెల 5 నుంచి ప్రారంభమయ్యే మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు 7న వెళ్లనున్నారు. జాతర తొలి రోజు సారలమ్మ గద్దెకు రానుండగా, ఆరో తేదీన సమ్మక్క గద్దెకు చేరుకుంటుంది. జాతర చివరి రోజు 8వ తేదీన సమ్మక్క, సారలమ్మలు తిరిగి వనప్రవేశం చేస్తారు. ఈ నెల 7న భక్తులు పెద్ద సంఖ్యలో సమ్మక్క, సారలమ్మ దర్శనం చేసుకుంటారు. అదేరోజు ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ప్రత్యేక హెలీకాప్టర్‌లో మేడారం చేరుకుని మొక్కులు చెల్లించుకుంటారు.

**మన్యంకొండ బ్రహ్మోత్సవాల ఆహ్వానం**

తెలంగాణ తిరుపతిగా పేరొందిన మహబూబ్‌నగర్ జిల్లా మన్యంకొండ వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, ఇంద్రకరణ్ రెడ్డి ఆహ్వానించారు. ఫిబ్రవరి 4 నుంచి 13వరకు జరిగే బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఇద్దరు మంత్రులు శనివారం సీఎం కేసీఆర్‌కు అందజేశారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న మన్యంకొండ శ్రీలక్ష్మిసమేత వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాధాన్యతను వివరించారు. తెలంగాణతో పాటు ఏపీ, కర్ణాటక నుంచి లక్షలాది మంది భక్తులు మన్యంకొండ దైవదర్శనానికి వస్తారని వివరించారు. ఆహ్వానపత్రం అందజేసిన వారిలో ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త అళహరి మధుసూధన్ ఉన్నారు.



**రథసప్తమి సందర్భంగా తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి శనివారం మలయప్ప దివ్యమంగళ రూపంతో సూర్యప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.**

## ఆ చిన్నారుల మోములో చిరునవ్వు

- 3,600 మందిని కాపాడిన పోలీసులు
- 1,292 మంది ఇతర రాష్ట్రాలు, దేశాలకు చెందినవారు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలో తప్పిపోయిన పిల్లలను, బాలకార్మికులు, యాచకులు, వెట్టి చాకిరీలో మగ్గుతున్న పిల్లలను రక్షించి తల్లిదండ్రులకు అప్పగించేందుకు తెలంగాణ పోలీస్ శాఖ చేపట్టిన ఆరవ విడత 'ఆపరేషన్ స్మైల్'పూర్తయింది. మహిళా భద్రతా విభాగం ఐజీ స్వాతి లక్రా ఆధ్వర్యంలో జనవరి 1 నుంచి 31వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన ఆపరేషన్ స్మైల్‌లో 3,600 మంది చిన్నారులను పోలీసులు రక్షించి వారి తల్లిదండ్రులకు అప్పగించగా.. మిగిలిన వారిని రెస్క్యూ హోంలలో ఉంచారు. రక్షించిన వారిలో 1,292 మంది పిల్లలు ఇతర రాష్ట్రాలు, దేశాలకు చెందిన వారు కూడా ఉండడం గమనార్హం. ఈసారి నిర్వహించిన ఆపరేషన్ స్మైల్‌లో మొదటిసారిగా చైల్డ్ ట్రాక్ పోర్టల్, ముఖాలు గుర్తించే ఫేషియల్ రికగ్నేషన్ యాప్, దర్పణ్‌లను ఉపయోగించడం కూడా సత్ఫలితాలనిచ్చింది. రాష్ట్రంలో ప్రధానంగా రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, మతపరమైన స్థలాలు, ట్రాఫిక్ కూడళ్లు, మెకానిక్ షాపులు, ఇటుక బట్టీలు, టీస్టాళ్లు, దుకాణాలపై ప్రత్యేక దృష్టి సారించి ఈ ఆరవ ఆపరేషన్ స్మైల్‌ను మహిళా రక్షణ విభాగం నిర్వహించింది. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని శిశు గృహాల్లో ఉన్న పిల్లల డేటాను డిజిటలైజ్ చేయడంతో తప్పిపోయిన, దొరికిన, రక్షించిన పిల్లల ఫొటోలను పోల్చిచూడడానికి సులభంగా మారింది. దర్పణ్ యాప్ ద్వారా కల్వకుర్తి పోలీస్ స్టేషన్, కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో తప్పిపోయిన ఇద్దరు పిల్లలను గుర్తించారు.

## అడవులకు నష్టం కలగకుండా..

### అటవీ అనుమతులపై మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



**సాక్షి, హైదరాబాద్:** పర్యావరణం, అడవులకు ఎలాంటి నష్టం కలగకుండా ప్రాజెక్టులు, ప్రజావసరాలైన అభివృద్ధి పనులకు అటవీ అనుమతులు ఇస్తున్నామని అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వానికి అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమన్నారు. ఇటీవల ప్రభుత్వం పునర్‌వ్యవస్థీకరించిన రాష్ట్ర వన్యప్రాణి మండలి సమావేశం శనివారం అరణ్యభవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి వైస్ చైర్మన్ హోదాలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అధ్యక్షత వహించారు. రైల్వే, జాతీయ, రాష్ట్ర రహదారుల నిర్మాణం–విస్తరణ, కవ్వాల్ పరిధిలో గ్రామాల తరలింపు తదితర అంశాల్లో అటవీ అనుమతులపై ఈ సమావేశంలో చర్చించారు. మేడారం జాతరను దృష్టిలో పెట్టుకుని అత్యవసరంగా జరగాల్సిన రోడ్ల మరమత్తులకు కూడా వన్యప్రాణి మండలి ఆమోదం తెలిపింది. తొలుత పీసీసీఎఫ్ ఆర్. శోభ సమావేశంలో వివిధ ప్రాజెక్టులు, అటవీ భూముల వినియోగంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సమావేశంలో అటవీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ, అసిఫాబాద్ జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**క్రీడలతో ఒత్తిళ్ల నుంచి ఉపశమనం**

శారీరక, మానసిక ఒత్తిళ్ల నుంచి ఉపశమనం పొందేందుకు ఉగ్యోగులకు క్రీడలు ఎంతో ఊరటనిస్తాయని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. క్రీడల్లో క్రమం తప్పకుండా పాల్గొనడం వల్ల ఉద్యోగులు చక్కటి పనితీరును కనబరిచే అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. క్రీడా పోటీల్లో పాల్గొనడంతో ఉద్యోగుల మధ్య సమన్వయం ఏర్పడి, స్నేహభావం పెంపొందుతుందని ఆయన పేర్కొన్నారు. శనివారం దుండిగల్ ఫారెస్ట్ అకాడమీ మైదానంలో అటవీ ఉద్యోగుల 5వ రాష్ట్ర స్థాయి ఫారెస్ట్ స్పోర్ట్స్ మీట్–2020ని మంత్రి లాంఛనంగా ప్రారంభించారు.

## 'ప్రైవేటు'కు పాలు పోస్తే ఇన్సెంటివ్ తొలగిస్తాం: తలసాని



**సాక్షి, యాదాద్రి:** పాడి రైతులు ప్రైవేట్ డెయిరీలకు పాలు పోస్తే ప్రభుత్వం ఇచ్చే ఇన్సెంటివ్‌లను తొలగిస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం రఘునాథపురంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు ఎన్నో రాయితీలు ఇస్తున్నా, పాలు మాత్రం ప్రభుత్వ సంస్థలకు పోయడం లేదన్నారు. పాడి రైతులకు రాయితీ రుణాల ద్వారా గేదెలను ఇప్పిస్తున్నామని, రోగాలు రాకుండా మందులు, టీకాలు ఉచితంగా ఇస్తున్నామన్నారు. లీటర్ పాలపై రూ.4 ఇన్సెంటివ్ ఇస్తున్నామన్నారు. అయినా రైతులు ప్రైవేట్ సంస్థలకు పాలు పోస్తున్నారన్నారు. సీజన్‌లో ప్రభుత్వ డెయిరీలకు, అన్‌సీజన్‌లో ప్రైవేట్ డెయిరీలకు పాలు పోయడాన్ని తప్పుబట్టారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, పశుసంవర్ధక శాఖ ముఖ్యకార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కలెక్టర్ అనితారామచంద్రన్ పాల్గొన్నారు.

## రోబో 4.0

- దేశంలోనే తొలి 'నాలుగో తరం' రోబో ప్రారంభం
- అందుబాటులోకి తెచ్చిన సన్‌షైన్ ఆస్పత్రి




**రోబో ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు ఈటల రాజేందర్, శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో జయేశ్ రంజన్, డాక్టర్ గురువారెడ్డి, పీవీ సింధు**

**సాక్షి, హైదరాబాద్:** తుంటి, మోకాలు వంటి కీళ్లమార్పిడి శస్త్రచికిత్సల్లో గుర్తింపు పొందిన సన్‌షైన్ ఆస్పత్రి యాజమాన్యం తాజాగా మరో కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చింది. కీళ్ల మార్పిడి శస్త్రచికిత్సల్లో దేశంలోనే తొలిసారిగా రూ.12 కోట్ల విలువ చేసే ఆధునిక 'నాలుగో తరం' రోబోను ప్రవేశపెట్టింది. శనివారం సైబర్ కన్వెన్షన్ సెంటర్‌లో మంత్రులు ఈటల రాజేందర్, శ్రీనివాస్‌గౌడ్, పద్మశ్రీ అవార్డు గ్రహీత పీవీ సింధు, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్, సన్‌షైన్ ఆస్పత్రి ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ గురువారెడ్డిలు రోబోను ఆవిష్కరించారు. మోకాలి చిప్ప, తుంటి ఎముక అరుగుదల భాగాన్ని కచ్చితంగా గుర్తించి, ఆ మేరకు కంప్యూటర్ నావిగేషన్ సాయంతో సరైన ప్రమాణం నిర్ధారించుకుని, శస్త్రచికిత్స సమయంలో ఒక్క అంగుళం కూడా తేడా రాకుండా ఇంప్లాంట్‌ను విజయవంతంగా అమర్చే ప్రక్రియలో ఈ రోబో సాయపడుతుందని, దీంతో రోగికి తక్కువ రక్తస్రావం, నొప్పితోపాటు ఎలాంటి ఇన్‌ఫెక్షన్ల బెడద లేకుండా త్వరగా కోలుకునేందుకు సహకరిస్తుందని గురువారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఆదర్శ్ అన్నపరెడ్డి, డాక్టర్ కుషాల్ హిప్పల్‌గావన్‌కర్, డాక్టర్ సుహాన్‌తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ 'శాస్త్ర విజ్ఞాన ఫలాలను కింది స్థాయి ప్రజలకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోంది. ఖరీదైన చికిత్సలను తక్కువ ధరలకే అందిస్తూ గురవారెడ్డి ఎంతోమంది వైద్యులు నగరానికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చారు. ఏ వ్యక్తి రాణించాలన్నా కష్టపడకుండా, ఇష్టపడకుండా సాధ్యం కాదు, గురవారెడ్డి 30 ఏళ్లు కష్టపడి ఈ స్థాయికి చేరుకున్నారు. వేలాది మందికి విశ్వాసాన్ని కల్పించడంలో ఆయన సక్సెస్ అయ్యారు' అని అన్నారు.

# బడ్జెట్‌లో కూతపెట్టని రైల్వే!

### కేటాయింపుల వివరాల వెల్లడిలో జాప్యం



**సాక్షి, హైదరాబాద్:** రైల్వే బడ్జెట్ అనగానే యావత్తు దేశం ఎదురుచూసేది.. ఏ ప్రాంతానికి ఏ రైలు వస్తుంది, కొత్త రైల్వే లైన్లు ఏ ప్రాంతానికి మంజూరవుతాయి అని ప్రజలు టీవీలకు అతుక్కుపోయేవారు. కానీ, శనివారం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో రైల్వే ప్రస్తావనకు కేటాయించిన సమయం రెండుమూడు నిమిషాలు మాత్రమే.అందులోనే కొన్ని విషయాలు ప్రస్తావించారే తప్ప కొత్త రైళ్లు, లైన్లు, సర్వేలు వంటి వాటి ఊసే లేదు. రైల్వే బడ్జెట్‌ను విడిగా ప్రవేశపెట్టకుండా సాధారణ బడ్జెట్‌లో కలిపేసిన తర్వాత, రైల్వేకు చెందిన వివరాలను సంక్షిప్తంగా వెల్లడిస్తున్నారు. కానీ తాజా బడ్జెట్ ప్రసంగంలో నామమాత్రపు ప్రస్తావనతోనే సరిపుచ్చటం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. స్థూలంగా నాలుగైదు విషయాలతో సరిపుచ్చినప్పటికీ, జోన్ల వారీగా వివరాలను ఆ తర్వాత కూడా వెల్లడించలేదు. పింక్‌బుక్ పేరుతో ఉండే పూర్తి వివరాల పుస్తకాన్ని మరుసటి రోజో, ఆ తర్వాతనో విడుదల చేసేవారు. ఈసారి ఆ పింక్‌బుక్‌ను ఐదో తేదీన విడుదల చేస్తారని చెబుతున్నారు. అంటే అప్పటి వరకు జోన్ల వారీగా కేటాయింపుల విషయాలు వెల్లడయ్యే అవకాశం ఉండదు.

**రైల్‌నిలయానికి సమాచారం లేదు**

దక్షిణ మధ్య రైల్వేకు చేసిన కేటాయింపులకు సంబంధించి రైల్ నిలయంకు ఎలాంటి సమాచారం అందలేదు. 'బడ్జెట్‌లో రైల్వేలకు సం బంధించి కనీస వివరాలు కూడా వెల్లడించకపోవటాన్ని తొలిసారి చూస్తున్నాం. కొన్ని ప్రధాన ప్రాజెక్టులు, చేపట్టబోయే కొత్త సంస్కరణలు, కొత్త రైళ్ల లాంటి వివరాలైనా వెల్లడించాల్సింది. ఇక జోన్ల వారీగా కేటాయింపు లు ఎప్పుడిస్తారో కూడా సమాచారం లేదు. ఢిల్లీలోని ప్రధాన కార్యాలయానికి ఫోన్ చేసి అడిగినా చెప్పలేదు. ఐదో తేదీన పార్లమెంటులో పింక్‌బుక్‌ను విడుదల చేసిన తర్వాత వివరాలు వెల్లడించే అవకాశం ఉంది'అని ఓ ఉన్నతాధికారి పేర్కొన్నారు. దక్షిణ మధ్య రైల్వేకు దాదాపు రూ.6,100 కోట్ల మేర నిధులు కేటాయించారని, ప్రస్తుతం పనులు జరుగుతున్న మనోహరాబాద్–కొత్తపల్లి, మహబూబ్‌నగర్ డబ్లింగ్, కాజీపేట–బల్లార్షా, కాజీపేట–విజయవాడ మూడో లైన్ పనులు, మెదక్–అక్కన్నపేట, భద్రాచలం–సత్తుపల్లి ప్రాజెక్టులకు రూ.1,200 కోట్ల మేర కేటాయింపులున్నాయని సమాచారం. ఓ హైస్పీడ్ కారిడార్, రెండు రైళ్ల ప్రస్తావన ఉందని చెబుతున్నారు.

## బీదర్‌లో అసదుద్దీన్

**సాక్షి, బళ్లారి:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీని అవమానించేలా నాటక ప్రదర్శన చేసినందుకు గానూ బీదర్‌లోని షాహిన్ పాఠశాలకు వ్యతిరేకంగా దేశద్రోహం కేసు నమోదు కావడంతో ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ శనివారం బీదర్‌కు వచ్చారు. ఈ ఘటనకు సంబంధించి అరెస్టయి, జిల్లా కేంద్ర కారాగారంలో ఉన్న ఆ విద్యాసంస్థకు చెందిన పలువురిని ఆయన పరామర్శించారు. అనంతరం ఆయన జిల్లా ఎస్పీ శ్రీధర్‌ను కలిసి కేసు వివరాలను అడిగి తెలుసుకున్నారు.







Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Survey No. 127, Plot No. 12, Mallapur Village, Nacharam, Medchal District and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

"నేను, మా ఇద్దరు అబ్బాయిలు కలిపి నా భార్యకు ముగ్గురు కొడుకులు" అంటారు పోసాని.
ఆ మాట నిజం కావచ్చు. అంతకంటే పచ్చి నిజం.. అతడికామె 'అమ్మాయి!'
పెళ్లయి దగ్గర దగ్గర ముప్పై ఏళ్లవుతున్నా..
ఆమె ఒక్కర్నీ ఈయన ఏనాడూ బయటికి పంపింది లేదు.
పక్కన తనుండాలి.. లేదంటే పిల్లలు, ఎవరో ఒకరు తోడుండాలి.
పోసానిలో ఇంకో యాంగిల్ కూడా ఉంది!
'నీకు నేనున్నాను' అని ధైర్యమిచ్చే భర్త కాదు ఆయన.
'నీకు నువ్వే ఉండాలి' అని ధైర్యం తెప్పించే భర్త!
ఇద్దరితో చాలాసేపు మాట్లాడాం. ఒక్కరితో మాట్లాడినట్లే ఉంది!
పోసాని, కుసుమ పైకి ఇద్దరు.. లోపల ఒక్కరు.
"ఎలా సాధ్యం.. ఇద్దరూ ఒకేలా" అని అడిగాం.
"మాది ఫ్రెండ్‌షిప్ రాజా" అని నవ్వేశారు పోసాని.

# మాది ఫ్రెండ్‌షిప్ రాజా


ఫొటో: శివ మల్లాల
● పోసాని కృష్ణమురళి, కుసుమ లత

**● ఈ ఏడాదితో మీ పెళ్లయి 29 ఏళ్లు నిండుతాయి. 30వ వార్షికోత్సవంలోకి అడుగుపెడతారు...**

**పోసాని:** అప్పుడే 29ఏళ్లు అయ్యాయా అని బాధగా ఉంది. ఇంకా జీవితం చాలా ఉందనే ఫీలింగ్. అయితే వయసు పెరుగుతోంది కదా. అందుకే పెళ్లయి ఇన్నేళ్లు కాకుండా కొన్నేళ్లు తగ్గితే బాగుంటుందనిపిస్తోంది.

**● జీవితం ఆనందంగా ఉంటే 'అప్పుడే ఇన్నేళ్లు అయ్యాయా' అనిపిస్తుందేమో.. ఏమంటారు?**

**పోసాని:** మా ఆవిడకు మేం మొత్తం ముగ్గురు పిల్లలం. నేను పెద్ద కొడుకుని, మా ఇద్దరబ్బాయిలు చిన్న కొడుకులు. మేం పెళ్లయిన నాలుగేళ్ల తర్వాత నుంచి భార్యాభర్తల్లా కాకుండా ఫ్రెండ్స్‌లా ఉంటున్నాం. అయితే మొదట్లో చాలా కోపంగా, తనతో సీరియస్‌గా ఉండేవాణ్ణి. నేను వెళ్లిపోతా అనేది. వెళ్లిపో అనేవాణ్ణి. చనిపోతాను అని లెటర్ రాసి ఇచ్చింది. మీ అమ్మా నాన్నలకు చెప్పి చచ్చిపో అని నేను లెటర్ రాసి, అందులో లైఫ్ ఏంటో కూడా రాశాను. ఆమె కన్విన్స్ అయింది.

**● మీ ఆవిడతో ఎందుకంత కఠినంగా వ్యవహరించారు?**

**పోసాని:** తను బీయస్సీ, బీఎల్ చదువుకుంది. చదువు విషయంలో మంచి జ్ఞానం ఉంది కానీ సొసైటీ నాలెడ్జ్ లేదు. ఎదుటివాళ్ల మెంటాలిటీని కనిపెట్టేంత జ్ఞానం తనకి లేదు. వాళ్ల నాన్న హెడ్‌మాస్టర్. చదువు, ఇల్లు.. ఇవి తప్ప ఆమెకు ఏమీ తెలియదు. బయటకు వెళ్లి అందరితో తిరిగిన మనిషి కాదు. అందువల్ల ఎవరు గుడ్, ఎవరు బ్యాడ్ అనేది తెలియక ఎవరేం చెప్పినా నిజం అనుకునేది. ఆ మెంటాలిటీ మార్చాలనుకున్నాను. ఆ క్రమంలో ఓ మూడేళ్లు, నాలుగేళ్లు చాలా సఫర్ అయ్యింది. ఎప్పుడైతే ఆమె మంచి, చెడుకి వ్యత్యాసం తెలుసుకుందో అప్పుడు సమాజం పట్ల, సాటి మనుషుల పట్ల అవగాహన వచ్చిందిలే అనుకొని ఆ రోజు నుండి మామూలుగా ఉండటం మొదలుపెట్టాను. అప్పుడు ఇద్దరం ఫ్రెండ్స్ అయిపోయాం. ఇక తను భార్య కాదు, నేను భర్త కాదు. మంచి స్నేహితులం.

**● ఏ కారణాల చేత చనిపోతానని లెటర్ రాశారు?**

**కుసుమ:** పెళ్లయిన కొత్తలో చిన్న చిన్నవాటికి కూడా చాలా కోప్పడేవారు. మా అమ్మా, నాన్న ఒక్క మాట కూడా అనేవారు కాదు. ఇక్కడేమో ఇలా. పైగా నేను ఎవరైనా ఏదైనా చెబితే అది నమ్మేసి వెంటనే అడిగే దాన్ని. దానికి ఆయన చాలా కోపంగా సమాధానం చెప్పేవారు. అయితే రాను రాను ఈయన చెబుతున్నవే నిజమనే నమ్మకం కుదిరింది.

**● భర్త అడుగుజాడల్లో భార్య నడవాలని అలా చేసేవారా?**

**పోసాని:** అస్సలు కాదు. తనకేమీ తెలియకపోతే అది తనకూ ప్రాబ్లమ్.. నాకూ ప్రాబ్లమ్. ఒంటరిగా వెళ్లి ఏదైనా జరగకూడనిది జరిగితే మా ఇద్దరి జీవితాలూ నాశనమవుతాయి. అందుకే నాతోనో, పిల్లలతోనో లేకపోతే ఫ్రెండ్‌తోనో బయటికి వెళ్లమంటాను.

**● ఈ అతి జాగ్రత్త మీకు ఇబ్బందిగా ఉండేదా?**

**కుసుమ:** కొన్నిసార్లు ఇబ్బందిగానే ఉండేది. కానీ, ఇప్పుడు లేదు. ఆయన ఎందుకు చెప్పేవారోఅర్థమయ్యింది.

**పోసాని:** మా ఇద్దరబ్బాయిలకు 'రాత్రి 7కల్లా ఇంటికి వచ్చేయండి. తొమ్మిది దాటాక తిరగొద్దు' అని చెబుతుంటాను. మనం కరెక్ట్‌గా వెళ్లినా వేరేవాళ్లు తాగేసి రోడ్ల మీద బండి నడిపి, ఢీ కొట్టొచ్చు. అందుకని 9 దాటాక బయట ఉండొద్దని పిల్లలకు చెబుతాను.

**కుసుమ:** మగపిల్లలే కదా.. వాళ్లకు కూడా రిస్ట్రిక్షన్ ఏంటి? అని నా ఫ్రెండ్స్ అంటారు. ఆడపిల్లలయితే మురళీగారు బురఖా వేసి పంపేవారేమో అంటారు.

**● మీకు ఇన్‌క్యూరిటీ, అనుమానం ఉంటాయా?**

**పోసాని:** అలా ఏం కాదు.. నేను చాలా విషయాలను ముందే గ్రహించగలుగుతాను. ఈ అమ్మాయి (భార్యను పోసాని అలానే పిలుస్తారు)కి ఆ తెలివి ఉండేది కాదు. ఉదాహరణ చెప్పాలంటే.. మా పెళ్లయిన కొత్తలో మా ఇంట్లో పదేళ్ల అమ్మాయి ఉండేది. నాకెందుకో అనుమానంగా ఉంది, ఆ అమ్మాయిని మీ ఊరు పంపించెయ్ అన్నాను. 'నిండా పదేళ్లు లేవు. తప్పెలా చేస్తుంది' అంది. ఆ తర్వాత పది రోజులకు ఆ అమ్మాయి ఎవరితోనే వెళ్లిపోయింది. పోలీస్ కేసు పెడితే, బొంబాయి వెళ్లే రైలు ఎక్కటానికి రెడీగా ఉందట. తీసుకొచ్చి అప్పజెప్పారు. ఆ తర్వాత ఆ అమ్మాయిని పంపించేశాం. మా ఆవిడకి ఎవరేంటి అనేది తెలిసేది కాదు. ఓసారి మావైపు బంధువుల ఇంటికి పెళ్లికి వెళతానంది. వాళ్లు మా బంధువులే అయినప్పటికీ కరెక్ట్ మనుషులు కాదన్నాను. వెళతానని వెళ్లింది. ఇంటికొచ్చాక బాధపడింది. ఈమె బాధపడిందని మా బంధువులైనా వాళ్లను తిట్టి, పదేళ్లు వాళ్లతో మాట్లాడలేదు. మా డబ్బుల బాధను, ఆరోగ్య బాధను... ఏదీ వాళ్లు తీసుకోలేరు, అండగా ఉండరు. ఆమెకు నేను, నాకు ఆమె. నాకేం జరిగినా తను, తనకేం జరిగినా నేను సఫర్ అవుతాం. అందుకే ఇలా ఉండు.. మనకు మంచి జరుగుతుందని చెప్పాను. అలానే ఉంది. హ్యాపీగా ఉన్నాం.

**● పోసానిగారు రైటర్‌గా ఉండటం బావుందా? ఆర్టిస్ట్‌గా బావుందా?**

**కుసుమ:** రెండూ బాగానే ఉన్నాయి. కానీ, రైటర్‌గా ఉన్నప్పుడు ఇంట్లో ఉండి రాసుకునేవారు. ఇప్పుడు షూటింగ్‌లకు వెళుతున్నారు కాబట్టి కొంచెం బోర్ అంతే. ఇప్పుడు పిల్లలు కూడా పెద్దవాళ్లయ్యారు కదా. వాళ్లూ విదేశాల్లో చదువుకుంటున్నారు. అయినా సాయంత్రం ఆరు కాగానే ఆయన ఇంటికొచ్చేస్తారుగా.

**● ఎప్పుడన్నా అనుకున్నారా? కొంచెం లేట్‌గా వస్తే బావుండని?**

**కుసుమ:** అలా ఏం లేదు, నేనే ఫోన్ చేస్తాను. అయిపోయిందా, వస్తున్నారా అని.

**పోసాని:** నా ఫోన్‌లో రోజుకు 100 కాల్స్ ఉంటే అందులో 95 కాల్స్ ఆమెవే ఉంటాయి.

**● మీ చిన్నప్పుడు జరిగిన సంఘటనలేమైనా మీరు ఇలా ముందే అనుమానించడానికి కారణం అయ్యాయా?**

**పోసాని:** నిజానికి నేను డిస్టర్బ్‌డ్ చైల్డ్‌ని. అందుకే నాకు గుడ్, బ్యాడ్ వెంటనే తెలుస్తాయి. ఇలాగే ఒకామెని ఉద్దేశించి దూరంగా ఉండు అన్నాను. ఆమె మా బంధువే. ఆమె ఈమెను ఎంత చెడగొట్టిందంటే మీ ఆయన రౌడీ, చాలా చెడ్డవాడు అని చెప్పేది. ఈవిడేమో నా వెల్‌విషర్ కాబట్టే చెప్పింది అనుకునేది. నా మాటలేమో గొడ్డుకారం లాగా ఉండేవి. అవిడ మాటలు తియ్యగా ఉండేవి. మా ఇంటికి వెళిపోతాను అంటే వెళ్లిపో అన్నాను. ఆ తర్వాత నిజాలు తెలుసుకుని అప్పటినుండి తనే మారింది. పెళ్లయిన కొన్నాళ్లు మా లైఫ్‌లో డిస్టర్బెన్స్ తప్ప ఆ తర్వాత ఎప్పటికీ మా జీవితంలో డిస్టర్బెన్స్ లేదు.. ఎప్పటికీ రాదు.. ఉండదు.

**● బాగా చదువుకున్నారు కదా. ఇలా ఇంటిపట్టున కాకుండా జాబ్ చేయాలని ఉండేదా?**

**కుసుమ:** పెళ్లికి ముందు జాబ్ చేయాలని ఉండేది. ఆ తర్వాత ఈయన చాలా బిజీగా ఉండేవారు. ఎప్పుడూ రాసుకుంటూ ఉండేవారు. ఇంటిని చూసుకుంటూ ఉండటంతో ఎప్పుడూ జాబ్ చేయాలనిపించలేదు. ఈయనకు అసిస్టెంట్స్ కూడా ఎక్కువమంది ఉండేవారు. వాళ్లు కూడా ఇంటికి వచ్చేవారు. అందుకే టైమ్ తెలియలేదు.

**పోసాని:** నా దగ్గర దాదాపు 30 మంది దాకా ఉండేవాళ్లు. అందరూ వచ్చేవారు. ఎవర్నీ ఒక్క మాట అనేది కాదు.

**● ఆర్థిక స్వేచ్ఛ గురించి ఏం చెబుతారు.. సంపాదించిన డబ్బు మీకిస్తారా?**

**కుసుమ:** ఎంతైనా ఖర్చు పెట్టుకోమంటారు. ఎంత సంపాదించినా తీసుకొచ్చి నాకే ఇస్తారు. అయితే వాటి గురించి మళ్లీ అడగరు. అంత స్వేచ్ఛ.

**పోసాని:** నేను ఏం కొన్నా తన పేరే పెడతా. ఎందుకంటే తనకిప్పుడు అన్నీ తెలుసు.. డబ్బు విలువ, భర్త విలువ అన్నీ తెలిసినప్పుడు ఇక నాకు సెక్యూరిటీ ఎందుకు? ఆమే నా సెక్యూరిటీ. నాకేమీ వద్దనుకున్నాను. ఒంటి మీద ఈ బట్టలు తప్ప (నవ్వులు). డబ్బు విషయంలో తనని రిస్ట్రిక్ట్ చేయను. ఎంతైనా వాడుకోమంటాను. తను కారు నేర్చుకుంది. పిల్లలని స్కూల్‌కి కారులో దిగబెట్టడం, తీసుకురావడం అంతా తనే.

**● అలాంటి ఫ్రీడమ్‌లన్నీ ఉండేవా?**

**పోసాని:** అలాంటి వాటికేమీ ఇబ్బంది లేదు. ఓ సారి ట్రాఫిక్‌లో కారు ఢీ కొట్టింది. కంగారు పడిపోయింది. దానికేముంది? కారు రిపేర్ చేయించుకుంటే సరిపోతుంది. కారు ఢీ కొట్టావు కదా, నీకు డ్రైవింగ్ వద్దు అనలేదు. అలానే పిల్లల్ని కూడా 'ఎక్కడికన్నా వెళితే పొద్దున పూట వెళ్లండి. నైట్ సినిమాకెళితే తాగి వచ్చేవాళ్లు ఉంటారు, డ్రగ్స్ తీసుకునేవాళ్లు ఉంటారు. వెళ్లొద్దు' అని చెబుతాను. ఇలాంటివి భార్యకు చెబితే అనుమానం అంటారు. పిల్లలకు చెబితే జాగ్రత్త చెబుతున్నాడు అంటారు.

**పోసానిగారి మీద రెబల్ ఇమేజ్ ఉంది. భార్యను కొడతారేమో, హింస పెడతారేమో అనే ఫీలింగ్ ఉంటుంది...**

**కుసుమ:** లేదు. కోపం వచ్చినప్పుడు గొంతు పెంచి మాట్లాడేవారే తప్ప చెయ్యి చేసుకున్నది, హింస పెట్టినదీ లేదు (నవ్వు).

**పోసాని:** మా ఆయన ఎప్పుడూ ప్రేమగా ఉండడు, రూడ్‌గా ఉంటాడనుకునేది. అప్పుడు చెప్పాను. జీవితమంటే ఏంటి? సంసారం అంటే ఏంటి? అని. రియలైజ్ అవ్వటం మొదలైంది.

**● మీరు గట్టిగా మాట్లాడిన సందర్భం ఉందా?**

**పోసాని:** ఓ రోజు నేను గట్టిగా తిడితే, నేను ఏ మాట అయితే అంటూ తిట్టానో అదే మాట నన్ను తిట్టింది. నేను నోరు మూసేసుకున్నా.

**● మీ పిల్లలు ఏమంటారు?**

**పోసాని:** మా అబ్బాయిలు ఉజ్వల్, ప్రజ్వల్.. పిల్లలు పుట్టక ముందే ఈ పేర్లే పెట్టాలని ఫిక్స్ అయ్యాం. మా చిన్నోడు నైట్ వెళితే ఏం? అంటాడు, ఏమోరా నాకు అట్లా అనిపించింది. నీ ఇష్టం.. నేనైతే వెళ్లను అంటాను. నేను తాగి వాళ్లను తాగొద్దు అంటే క్వశ్చన్ చేస్తారు. నేను అలా చేయను కాబట్టి నన్ను ఫాలో అవ్వమంటాను.

**కుసుమ:** మాకు ఆయన బెస్ట్ లైఫ్ ఇచ్చారు. చదువుకోవడానికి పిల్లలు విదేశాలు వెళతానంటే సరే అన్నారు. ఒకడు అమెరికా వెళ్లి చదువుకుంటానంటే, క్రెడిట్ కార్డు ఇచ్చి పంపారు. ఇంకొకడు హాంకాంగ్ వెళ్లి ఫిలిమ్ కోర్స్ చేస్తాను అన్నాడు. వెళ్లమన్నారు.

**● ఓ ఐదేళ్ల క్రితం కుసుమగారి ఆరోగ్యం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు మీరు బాగా చూసుకున్నారని విన్నాం..**

**కుసుమ:** ఆ టైమ్‌లో ఆయన అన్నం, స్నానం మానేసి ఓ పది రోజులపాటు హాస్పిటల్‌లోనే ఉన్నారు. ఇక ప్రాణానికి ఏమీ ప్రమాదం లేదని తెలిశాక, హాస్పిటల్లోనే స్నానం చేశారు. అక్కడినుండే రెండు రోజులు షూటింగ్‌కి వెళ్లారు.

**పోసాని:** బ్లడ్ కాట్ అయింది. ఆమెను ఐసీయులో ఉంచారు. ఆ ఎదురు గదిలో నేను ఉన్నాను. రాత్రి మీకు ఫోన్ వచ్చిందంటే.. ఇక కష్టం అనుకోండి అన్నారు. ఆ రోజు తెల్లారేదాకా ఫోన్ రింగ్ అవ్వకూడదని కోరుకుంటూ నిద్రపోలేదు. లక్కీగా తెల్లారేసరికి బ్లడ్ క్లాట్ కరగటం స్టార్టయ్యింది. త్వరగా రికవర్ అయ్యింది. అయితే బెడ్ మీద ఉన్నప్పుడు నాకు చాలా జాగ్రత్తలు చెప్పింది. ఏ నగలు ఎవరికి ఇవ్వాలో కూడా చెప్పింది (నవ్వుతూ). ఆమె పోతే ఏముంది? అంతా గోవిందా. భార్యాభర్త స్నేహితుల్లా ఉన్నాక ఎవరు పోయినా ఏముంది 'విగ్రహం లేని గుడిలా ఉంటుంది'.

**● హాలిడేస్‌కి వెళతారా?**

**కుసుమ:** మొదట్లో ఓ పదిహేనేళ్లు వెళ్లలేదు. మా ఫ్రెండ్స్ 'మేం అక్కడికెళ్లాం.. ఇక్కడికెళ్లాం' అని నా మీద సానుభూతి చూపేవాళ్లు. నేను ఆయనతో ఆ విషయం చెప్పేదాన్ని. సంపాదించిన డబ్బు ఖర్చు పెట్టుకుంటే తర్వాత ఏం తింటాం అనేవారు. ఇప్పుడు పదేళ్లుగా బాగా తిరుగుతున్నాం.

**పోసాని:** ఎక్కడికీ వెళ్లలేదని ఆ రోజు సానుభూతి చూపించిన వాళ్లందరూ ఇక్కడిక్కడే ఏ మూలో తిరిగి, తిరుగుతున్నాం అని చెప్పుకున్నారు. వాళ్లు అక్కడే ఉన్నారు. ఈవిడ దేశంలో అన్నీ చూసింది. విదేశాలు వెళుతోంది (నవ్వులు). మేం ఎక్కడికెళ్లినా ఫ్లయిట్‌లో బిజినెస్ క్లాస్ టికెట్స్, ఫైవ్‌స్టార్ హోటల్స్ బుక్ చేసుకుంటాం. హడావిడిగా వెళ్లడం.. రావడం అలా ఉండదు మా జర్నీ. రోజు మొత్తంలో ఒకసారి బయటకు వెళతాం. మళ్లీ హోటల్‌కి వచ్చి రెస్ట్ తీసుకుంటాం.

**కుసుమ:** డబ్బుల విషయంలో ఆయన వెనకాడరు. నేను ఏం కావాలంటే అది కొనుక్కుంటాను. ఇక ఇతరులకు సహాయం చేసే విషయంలో ఆయనది పెద్ద చెయ్యే. ఈయన ఫొటోని దేవుడి గదిలో పెట్టుకుని పూజించేవాళ్లు కూడా ఉన్నారు.

**● అవునా.. ఆ విషయాల గురించి చెబుతారా?**

**పోసాని:** జగిత్యాలలో రాములు అనే 28 ఏళ్ల కుర్రాడి గుండెకు ప్రాబ్లెం వచ్చి పొట్టంతా పెరిగింది. లక్షా యాభైవేలు అవసరం అన్నారు. మొత్తం డబ్బు ఇచ్చి, ఆపరేషన్ చేయించాను. ఆ తర్వాత అతను వాడుకోటానికి మందులు, వాళ్ల ఆవిడకి, పిల్లలకి బట్టలు కొనిచ్చి ఊరికి పంపించాను. నా ఫోటోను ఇంట్లో దేవుని దగ్గర పెట్టుకుంటే ఆ ప్రాంతంలో ఉండే జర్నలిస్ట్ చూసి, దాన్ని స్టోరీ చేశాడు.

**కుసుమ:** ఇలా ఓ 15 మంది దాకా సాయం చేశారాయన. బీహార్‌లో ఓ పాపకి హార్ట్‌లో హోల్ ఉంది, ఆపరేషన్ చేస్తే బతుకుద్ది అని చెప్పారు. లక్షన్నర ఖర్చు అవుతుందని తెలిసి, పంపించారు. పాప బతికింది. ఆ పాపను తీసుకొని హైదరాబాద్ వచ్చి, మాకు చూపిస్తానని వాళ్ల నాన్న ఒకటే గోల. ఆపరేషన్ జరిగి 4 రోజులే అయ్యింది. బీహార్ వచ్చినప్పుడు నేనే కలుస్తానని ఆయన అన్నారు. ఫోటో అయినా ఇవ్వమని అడిగారు. పంపిస్తే, దేవుని గదిలో పెట్టుకున్నాడట.

**● ఇవన్నీ వింటుంటే పోసానిగారిది మంచి మనసు అనిపిస్తోంది. కానీ మీ ఆయన్ని మెంటల్‌కృష్ణ అని కొందరు అంటుంటారు. మీకు బాధగా ఉంటుందా?**

**కుసుమ:** బాధ అనిపిస్తుంది. అయినా అది సినిమా. మా ఆయన బయట అలా కాదు కదా (నవ్వుతూ).

**● సో.. మీ ఆయన బంగారం అంటారా?**

**కుసుమ:** అవును బంగారమే..

**● మరి.. మీ ఆవిడ?**

**పోసాని:** అదే అంటాను. మా అమ్మాయి బంగారం.

– డి.జి. భవాని

# అల.. విజయోత్సాహంలో...


ఫొటో: శివ మల్లాల
● అల్లు అర్జున్, త్రివిక్రమ్

**అలవోకగా మాటలు రాయడం త్రివిక్రమ్‌కి వచ్చు
అలవోకగా డైలాగులు చెప్పడం
బన్నీ (అల్లు అర్జున్)కి వచ్చు
అలవోకగా సినిమా తీయడం త్రివిక్రమ్‌కి వచ్చు
అలవోకగా నటించడం బన్నీకి వచ్చు.
అల.. ఈ ఇద్దరి కాంబినేషన్ హిట్.
బన్నీని త్రివిక్రమ్ 'జులాయి'ని చేస్తే ప్రేక్షకులు
'సూపర్ హిట్టోయి' అన్నారు
బన్నీని త్రివిక్రమ్ 'సన్నాఫ్ సత్యమూర్తి' అంటే..
'సూపర్ సక్సెస్' ఇచ్చారు.
ఇప్పుడు 'అల.. వైకుంఠపురములో..' అన్నారు.
ఆడియన్స్ అదిరిపోయే హిట్ ఇచ్చారు.
ఈ విజయోత్సాహంలో త్రివిక్రమ్, బన్నీ
'సాక్షి'కి ఇచ్చిన ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ.**

**● ఇంతకుముందూ మీరు హిట్స్ ఇచ్చారు... వాటికీ 'అల వైకుంఠపురములో' చిత్రానికి దక్కిన ఆనందంలో తేడా ఉందా?**

**బన్నీ:** కచ్చితంగా తేడా ఉంది. హిట్ సినిమాలు చేశాను. అయితే 'ఆల్‌టైమ్ రికార్డ్ హిట్' అనేదాంట్లో వైబ్రేషన్ వేరేలా ఉంటుంది. కేవలం హిట్ సినిమా అయితే ఇంతమంది ఫోన్ చేయరు. ఇన్ని అభినందనలు ఉండవు. ఇండస్ట్రీలో అందరూ పర్సనల్‌గా ఫోన్ చేసి అభినందించారు. అంటే.. అంత గొప్ప హిట్.

**త్రివిక్రమ్:** ఈ ప్రయాణాన్ని బాగా ఎంజాయ్ చేశాను. నేను చేసిన సినిమా ప్రయాణాల్లో టాప్ లిస్ట్‌లో ఇది కచ్చితంగా ఉంటుంది. ఈ సినిమా షూటింగ్‌లో ప్రతిరోజూ చాలా విలువైనదిగా ఉండేది. ఔట్‌పుట్ బాగా వచ్చేది. ఏం చేసినా, ఎలా చేసినా ఔట్‌పుట్ ముఖ్యం కదా. అనుకున్నట్టుగా రావట్లేదు అనిపించినప్పుడు షూటింగ్ ఆపేసేవాళ్లం. ఏ రోజూ సర్ది చెప్పుకొని చేయలేదు. రాకపోతే ఇంటికి వెళ్లిపోయేవాళ్లం.

**● బన్నీకి హిట్ పడాల్సిందే అనే పరిస్థితిలో ఈ సినిమా కమిట్ అయ్యారు. ఒత్తిడి ఏమైనా?**

**త్రివిక్రమ్:** హిట్ ఇవ్వడం, హిట్ చేయడం అనేది ఎవ్వరి చేతుల్లోనూ ఉండదు. నిజాయితీగా చెబుతున్న మాట ఇది. ఒక కథ అనుకుని చేయగలం. ప్రతిరోజూ చెక్ చేసుకుంటూ వెళ్లగలం. అయినా తప్పు జరగొచ్చు. ఫ్లాప్ అవ్వొచ్చు. అలాగని ఒత్తిడి లేదు అని చెప్పినా అబద్ధమే. ఒత్తిడి ఉంటుంది. దాన్ని దాటి, పనిలో ఫన్ వెతుక్కుంటూ వెళ్లడమే.

**● 'రేసుగుర్రం'లా దూసుకెళ్లే ఓ హీరో గ్యాప్ ఇవ్వడం ఆ హీరోకు, ఆయన ఫ్యాన్స్‌కు బాధగానే ఉంటుంది. హిట్ విషయంలో మీకు ఒత్తిడి?**

**బన్నీ:** హిట్ సినిమా చేయాలి అనే ఆలోచనతో గ్యాప్ తీసుకోలేదు. గ్యాప్ కేవలం అనుకోకుండా వచ్చింది. ఒక సినిమా అయిన వెంటనే 2–3 నెలల్లో ప్రారంభిస్తాం. కానీ 2–3 నెలల్లో మంచి ఆప్షన్స్ తగల్లేదు. 6–7 నెలలు ఎదురు చూశాను. ఆ తర్వాత త్రివిక్రమ్‌గారు నేను, కలిసి సినిమా చేయాలనుకున్నాం. కథ రెడీ చేసి సినిమా చేయడానికి ఇంత టైమ్ పట్టింది.

**● 'అల.. వైకుంఠపురములో..' రిలీజ్ అయిన రోజే 'సంక్రాంతి విన్నర్' అని పోస్టర్ వేశారు. మరో సినిమా రిలీజ్ కాకముందే వేయడానికి కారణం?**

**త్రివిక్రమ్:** అర్థమయిన తర్వాతే పెట్టాం.

**బన్నీ:** ఇండస్ట్రీ హిట్ పోస్టర్ కూడా అర్థం అయిన తర్వాతే వేశాం.

**త్రివిక్రమ్:** అల్లు అరవింద్‌గారు వసూళ్ల గురించి ఒక రూపాయి తక్కువ చెప్పినా ఒప్పుకుంటారు కానీ రూపాయి ఎక్కువ చెబితే తాట తీస్తారు.

**బన్నీ:** మూడో వారంలో తెలిసింది మాకు ఈ సినిమా ఇండస్ట్రీ హిట్ అని.

**త్రివిక్రమ్:** క్లారిటీ వచ్చిన 10–12 రోజుల తర్వాతే ఇండస్ట్రీ హిట్ అని అనౌన్స్ చేశాం.

**● దర్శకుడు వక్కంతం వంశీతో మాట్లాడుతున్నప్పుడే త్రివిక్రమ్‌గారితో సినిమా చేస్తే బాగుంటుందనుకున్నాం అన్నారు. ఆయనతో మీరు చేసిన 'నా పేరు సూర్య నా ఇల్లు ఇండియా' ఆశించిన ఫలితం ఇవ్వలేదు కదా..**

**బన్నీ:** ఫ్లాప్ అనేది అందరిదీ. దర్శకుడు ఒక్కడే చేసేది కాదు. ఆ కథ ఒప్పుకున్న నాదీ.. అందరిదీ తప్పే. ఆ తర్వాత ఏం చేయాలి? ముందుకు వెళ్లిపోవాలి. నేను, 'బన్నీ' వాస్, వక్కంతం వంశీ కలసి మాట్లాడుకున్నప్పుడు త్రివిక్రమ్‌గారితో సినిమా చేస్తే బావుంటుందనుకున్నాం. అప్పుడు త్రివిక్రమ్‌గారు 'అరవింద సమేత' సినిమాతో బిజీగా ఉన్నారు. ఆ సినిమా తర్వాత మాది మొదలుపెట్టాలనుకున్నాం.

(మిగతా సినిమా పేజీలో)




సాక్షి స్పోర్ట్స్
ఆదివారం
2-2-2020

**నేడు ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ ఫైనల్**



జొకోవిచ్ (సెర్బియా)
X
డొమినిక్ థీమ్ (ఆస్ట్రియా)

మధ్యాహ్నం 2 గంటల నుంచి
సోనీ సిక్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



# క్వీన్ కెనిన్...

- ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ విజేత సోఫియా కెనిన్
- ఫైనల్లో మాజీ నంబర్‌వన్ ముగురుజాపై విజయం
- కెరీర్‌లో తొలి గ్రాండ్‌స్లామ్ టైటిల్ వశం
- రూ. 19 కోట్ల 71 లక్షల ప్రైజ్‌మనీ సొంతం



టైటిల్ ఫేవరెట్స్ ఒక్కొక్కరూ నిష్క్రమించిన చోట... ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన అమెరికా యువతార సోఫియా కెనిన్ ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ చాంపియన్‌గా అవతరించింది. ఫైనల్ చేరే క్రమంలో తాను సాధించిన విజయాలు గాలివాటమేమీ కాదని నిరూపిస్తూ తుది సమరంలోనూ ఈ అమెరికా భామ సత్తా చాటుకుంది. తన ప్రత్యర్థి గార్బిన్ ముగురుజా ప్రపంచ మాజీ నంబర్‌వన్ అయినప్పటికీ... ఆమెకు రెండు గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ గెలిచిన అనుభవం ఉన్నప్పటికీ... ఎంతో ఒత్తిడి ఉండే 'గ్రాండ్' టైటిల్ పోరులో తొలి సెట్ కోల్పోయి వెనుకబడినప్పటికీ... 21 ఏళ్ల సోఫియా కెనిన్ ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. 'నేను గెలవగలను' అని గట్టిగా విశ్వసిస్తూ అద్భుత ఆటతీరుతో అనూహ్యంగా పుంజుకొని... తదుపరి రెండు సెట్‌లలో ముగురుజాకు ముచ్చెమటలు పట్టిస్తూ... 'గ్రాండ్'గా ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ టైటిల్‌ను సొంతం చేసుకొని విజయ దరహాసం చేసింది.

విన్నర్స్ ట్రోఫీతో సోఫియా కెనిన్

**మెల్‌బోర్న్:** చివరిదాకా గెలవాలనే కసి ఉంటే... ప్రత్యర్థి ఏ స్థాయి వారైనా... పరిస్థితులు ఎలా ఉన్నా... చాంపియన్‌గా అవతరించవచ్చొని అమెరికా యువతార సోఫియా కెనిన్ నిరూపించింది. కెరీర్‌లో తొలిసారి గ్రాండ్‌స్లామ్ ఫైనల్ ఆడుతున్నప్పటికీ... తొలి సెట్ చేజార్చుకున్నప్పటికీ... ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా తుదకు సోఫియా కెనిన్ 'గ్రాండ్' విజేతగా నిలిచింది. శనివారం జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ ఫైనల్లో 14వ సీడ్, ప్రపంచ 15వ ర్యాంకర్ సోఫియా కెనిన్ 4–6, 6–2, 6–2తో ప్రపంచ మాజీ నంబర్‌వన్ గార్బిన్ ముగురుజా (స్పెయిన్)పై విజయం సాధించింది. విజేత సోఫియా కెనిన్‌కు 41 లక్షల 20 వేల ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 19 కోట్ల 71 లక్షలు)... రన్నరప్ ముగురుజాకు 20 లక్షల 65 వేల ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 9 కోట్ల 88 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

- తాజా 'గ్రాండ్' విజయంతో సోఫియా సోమవారం విడుదల చేసే మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో ఏడో స్థానానికి ఎగబాకుతుంది. ఇప్పటివరకు అమెరికా నంబర్‌వన్‌గా ఉన్న సెరెనా విలియమ్స్‌ను వెనక్కినెట్టి సోఫియా ఆ స్థానాన్ని ఆక్రమించనుంది.
- ముగురుజాతో జరిగిన ఫైనల్లో కెనిన్ తొలి సెట్‌లో తడబడింది. 2016 ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్, 2017 వింబుల్డన్ టోర్నీ విజేత అయిన ముగురుజా సుదీర్ఘంగా సాగిన మూడో గేమ్‌లో మూడో ప్రయత్నంలో కెనిన్ సర్వీస్‌ను బ్రేక్ చేసింది. అదే జోరులో 52 నిమిషాల్లో తొలి సెట్‌ను సొంతం చేసుకొని కెరీర్‌లో మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్ దిశగా సాగింది.
- అయితే సెమీఫైనల్లో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ యాష్లే బార్టీని ఓడించిన కెనిన్ తొలి సెట్ చేజార్చుకున్నా కంగారు పడలేదు. తొలి సెట్‌లో చేసిన తప్పిదాలను సరిచేసుకున్న కెనిన్ రెండో సెట్‌లో ముగురుజాను తన శక్తివంతమైన గ్రౌండ్‌షాట్‌లతో ఇబ్బంది పెట్టింది. నాలుగో గేమ్‌లో, ఎనిమిదో గేమ్‌లో ముగురుజా సర్వీస్‌లను బ్రేక్ చేసిన కెనిన్ 32 నిమిషాల్లో రెండో సెట్‌ను దక్కించుకొని మ్యాచ్‌లో నిలిచింది.
- నిర్ణాయక మూడో సెట్‌లో కెనిన్ ఆటతీరు మరింత మెరుగు పడగా... ముగురుజా ఆట అనవసర తప్పిదాలతో గాడి తప్పింది. ఆరో గేమ్‌లో ముగురుజా సర్వీస్‌ను బ్రేక్ చేసిన కెనిన్ ఏడో గేమ్‌లో తన సర్వీస్‌ను కాపాడుకొని 5–2తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఎనిమిదో గేమ్‌లో ముగురుజా సర్వీస్‌ను మళ్లీ బ్రేక్ చేసిన కెనిన్ సెట్‌తోపాటు మ్యాచ్‌నూ కైవసం చేసుకుంది.
- ఈ విజయంతో సెరెనా (2002లో) తర్వాత పిన్న వయస్సులో గ్రాండ్‌స్లామ్ టైటిల్ నెగ్గిన అమెరికా క్రీడాకారిణిగా కెనిన్ గుర్తింపు పొందింది. 2008 తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గిన పిన్న వయస్కురాలిగా కూడా కెనిన్ ఘనత వహించింది. 2008లో షరపోవా 20 ఏళ్ల ప్రాయంలో ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ నెగ్గింది.



రన్నరప్ ట్రోఫీతో ముగురుజా

## ఫైనల్ గణాంకాలు

| కెనిన్ | | ముగురుజా |
|---|---|---|
| 2 | ఏస్‌లు | 9 |
| 0 | డబుల్ ఫాల్ట్‌లు | 8 |
| 5/6 | బ్రేక్ పాయింట్లు | 2/12 |
| 5/7 | నెట్ పాయింట్లు | 16/24 |
| 28 | విన్నర్స్ | 32 |
| 23 | అనవసర తప్పిదాలు | 45 |
| 92 | మొత్తం పాయింట్లు | 77 |

*నా కల నిజమైంది. ఈ అనుభూతిని మాటల్లో వర్ణించలేను. మీరూ కలలు కనండి. ఎందుకంటే కలలు నిజమవుతాయి. గత రెండు వారాలు నా జీవితంలోనే అత్యుత్తమ క్షణాలు. నా గుండె లోతుల్లోంచి చెబుతున్నా మీరంటే (ప్రేక్షకులు) నాకెంతో ప్రేమాభిమానాలు. మీ అందరికీ ధన్యవాదాలు. నేను గ్రాండ్‌స్లామ్ చాంపియన్‌గా అవతరించేందుకు నాన్న, కోచ్ అలెగ్జాండర్, ఆయన శిక్షణ బృందం ఎంతగానో కష్టపడింది. ఆఖరికి మా ఇన్నేళ్ల కష్టం ఫలించింది. మా అమ్మకు మూఢనమ్మకాలెక్కువ. అందుకే తను నా మ్యాచ్‌ల్ని చూడదు. చూస్తే ఏదైనా కీడు జరుగుతుందనే బెంగ ఆమెకు... అందుకే మ్యాచ్ అయిపోగానే నేనే ఫోన్ చేసి చెప్పా. నేను గెలిచానని! అప్పుడే ఆమె మనసు కుదుటపడుతుంది. అమ్మా, నేను కప్‌తో ఇంటికొస్తున్నాను. నీ జీవితంలో ఎప్పుడు ఎవరికీ ఇవ్వని హగ్ (ఆలింగనం) ఇవ్వాలి.*

-సోఫియా కెనిన్

# క్రీడలకు రూ. 2,826 కోట్లు

**గతం కంటే రూ. 50 కోట్లే పెంపు**

**బడ్జెట్ 2020-21**



**న్యూఢిల్లీ:** కేంద్ర బడ్జెట్‌లో వచ్చే ఆర్థిక సంవత్సరానికి క్రీడలకు రూ. 2,826.92 కోట్లు కేటాయించారు. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చితే పెరిగింది స్వల్పమే. రూ. 50 కోట్లే ఎక్కువగా కేటాయించారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో 'ఖేలో ఇండియా'కు ప్రాధాన్యత ఇచ్చారు. అయితే మిగతా క్రీడా సమాఖ్యలు, క్రీడా సంబంధిత రంగాలకు కేటాయింపుల్లో కోత విధించారు. గత బడ్జెట్‌లో 'ఖేలో ఇండియా'కు రూ. 578 కోట్ల నిధులు ఇవ్వగా... ఈ సారి దానిని రూ.890.42 కోట్లకు పెంచారు. గతంతో పోల్చుకుంటే రూ. 312.42 కోట్ల పెరుగుదల కనిపించింది. ఒలింపిక్ ఏడాదిలో క్రీడాకారులకు ఇచ్చే ప్రోత్సాహకాల నిధుల్ని తగ్గించడం ఆశ్చర్యకరం. రూ. 111 కోట్ల నుంచి రూ. 70 కోట్లకు కుదించారు. అలాగే జాతీయ క్రీడాభివృద్ధి నిధి (ఎన్‌ఎస్‌డీఎఫ్)కి గతంలో రూ.77.15 కోట్లు ఇవ్వగా... ఇప్పుడు రూ. 50 కోట్లతో సరిపెట్టారు. ఇక జాతీయ క్రీడా సమాఖ్యల కోసం రూ. 245 కోట్లను కేటాయించారు. 2019–20 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన రూ. 300.85 కోట్లతో పోల్చితే రూ. 55.8కోట్లు కోత పెట్టారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్)కీ కోత తప్పలేదు. రూ. 500 కోట్లు (గతంలో రూ. 615 కోట్లు) కేటాయించారు. కామన్వెల్త్ గేమ్స్ (2010) 'సాయ్' స్టేడియాల నవీకరణకు రూ.75 కోట్లు విదిల్చారు. గత మొత్తం రూ. 96 కోట్లతో పోల్చితే రూ. 21 కోట్లు తగ్గింది. క్రీడాకారుల సంక్షేమ నిధి (రూ. 2 కోట్లు)లో ఏ మార్పు లేదు. జమ్మూ కశ్మీర్‌లో క్రీడా సదుపాయాల కోసం గత బడ్జెట్‌లో కేటాయించిన రూ. 50 కోట్ల మొత్తాన్నే ఈ సారీ కొనసాగించారు. లక్ష్మీబాయ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్‌కు మాత్రమే కాస్త హెచ్చింపు చేశారు. రూ. 55 కోట్లకు పెంచారు. గతం కంటే రూ. 5 కోట్లు పెరిగింది.

# భారత బ్యాడ్మింటన్ సీనియర్ జట్టులో గాయత్రి



**న్యూఢిల్లీ:** ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత పురుషుల, మహిళల జట్లను ప్రకటించారు. ఈనెల 11 నుంచి 16 వరకు ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో ఈ టోర్నీ జరుగుతుంది. భారత స్టార్స్ పీవీ సింధు, సైనా నెహ్వాల్ ఈ టోర్నీకి దూరంగా ఉన్నారు. పురుషుల విభాగంలో మాత్రం భారత అగ్రశ్రేణి క్రీడాకారులందరూ పాల్గొంటున్నారు. కొంతకాలంగా జూనియర్‌స్థాయిలో నిలకడగా రాణిస్తోన్న చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రి మహిళల సీనియర్ జట్టులో చోటు దక్కించుకుంది. మరో తెలుగమ్మాయి, డబుల్స్ స్పెషలిస్ట్ కె.మనీషా కూడా భారత జట్టులోకి ఎంపికైంది.

**పురుషుల జట్టు:** సాయిప్రణీత్, కిడాంబి శ్రీకాంత్, హెచ్‌ఎస్ ప్రణయ్, శుభాంకర్ డే, లక్ష్య సేన్, సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి, ధ్రువ్ కపిల, ఎం.ఆర్.అర్జున్. **మహిళల జట్టు:** అస్మిత చాలిహ, ఆకర్షి కశ్యప్, మాళవిక బన్సోద్, గాయత్రి గోపీచంద్, అశ్విని భట్, శిఖా గౌతమ్, రుతుపర్ణ పాండా, కె.మనీషా.

# పోరాడుతున్న భారత్ 'ఎ'

- ప్రస్తుతం రెండో ఇన్నింగ్స్‌లో 127/2
- న్యూజిలాండ్ 'ఎ' 562/7 డిక్లేర్డ్



ప్రియాంక్

**క్రైస్ట్‌చర్చ్:** న్యూజిలాండ్ 'ఎ'తో జరుగుతోన్న తొలి అనధికారిక టెస్టు మ్యాచ్‌లో ఇన్నింగ్స్ ఓటమి నుంచి తప్పించుకోవడానికి భారత్ 'ఎ' పోరాడుతోంది. 346 పరుగులు వెనుకబడి రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన భారత్ శనివారం ఆట ముగిసే సమయానికి 37 ఓవర్లలో 2 వికెట్లు నష్టపోయి 127 పరుగులు చేసింది. ఓపెనర్ మయాంక్ అగర్వాల్ (0) 'గోల్డెన్ డక్'గా అవుటై మరోసారి నిరాశ పరిచాడు. మరో ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ (26; 1 ఫోర్) కూడా విఫలమయ్యాడు. అయితే ప్రియాంక్ పాంచల్ (67 బ్యాటింగ్; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), శుబ్‌మన్ గిల్ (33 బ్యాటింగ్; 2 ఫోర్లు) మరో వికెట్ పడకుండా రోజును ముగించారు. ప్రస్తుతం భారత్ మరో 219 పరుగులు వెనుకబడి ఉంది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 385/5తో మూడో రోజు బ్యాటింగ్ కొనసాగించిన కివీస్ తమ తొలి ఇన్నింగ్స్‌ను 160.3 ఓవర్లలో 7 వికెట్లకు 562 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. డేన్ క్లీవర్ (196; 20 ఫోర్లు, సిక్స్) త్రుటిలో ద్విశతకాన్ని చేజార్చుకున్నాడు. మార్క్ చాప్‌మ్యాన్ (114; 11 ఫోర్లు) శతకం సాధించాడు. భారత బౌలర్లలో ఇషాన్ పోరెల్, సందీప్ వారియర్ చెరో రెండు వికెట్లు తీశారు.

# ఇంకా కోలుకోని హార్దిక్ పాండ్యా

**న్యూజిలాండ్‌తో టెస్టు సిరీస్‌కు దూరం**



**న్యూఢిల్లీ:** మ్యాచ్ ఫిట్‌నెస్ సాధించకపోవడంతో భారత ఆల్‌రౌండర్ హార్దిక్‌పాండ్యా న్యూజిలాండ్‌తో జరిగే రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్‌లో పాల్గొనడం లేదు. ఈ మేరకు బీసీసీఐ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. హార్దిక్ ఇటీవల జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) హెడ్ ఫిజియో అయిన ఆశిష్ కౌశిక్‌తో కలిసి లండన్ వెళ్లాడు. అక్కడ తన వెన్నెముకకు సర్జరీ చేసిన డాక్టర్‌ను కలిసి గాయంపై సమీక్ష కోరగా... అతను పూర్తిగా కోలుకోవడానికి మరి కొంత సమయం అవసరమని చెప్పినట్లు బీసీసీఐ ప్రకటనలో తెలిపింది. దాంతో హార్దిక్ బెంగళూరులోని ఎన్‌సీఏ పునరావాస శిబిరంలో పూర్తి ఫిట్‌నెస్ సాధించేంత వరకు ఉంటున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి సెలెక్టర్లు న్యూజిలాండ్ పర్యటనలో పాల్గొనే భారత్ 'ఎ'జట్టులో హార్దిక్‌కు మొదట స్థానం కల్పించారు. అయితే అనంతరం నిర్వహించిన ఫిట్‌నెస్ పరీక్షలో అతడు ఫెయిల్ అవ్వడంతో అతడిని జట్టు నుంచి తొలగించారు. అంతే కాకుండా అతడి కోసం న్యూజిలాండ్‌తో భారత్ ఆడే టెస్టు సిరీస్ కోసం ఇప్పటి వరకు జట్టును కూడా ప్రకటించలేదు. గత ఏడాది అక్టోబర్‌లో సర్జరీ చేయించుకున్న హార్దిక్ అప్పటి నుంచి మైదానంలో అడుగు పెట్టలేదు.

# 'టాప్' ర్యాంక్‌లోనే విరాట్ కోహ్లి

**దుబాయ్:** అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తాజాగా ప్రకటించిన టెస్టు ర్యాంకుల్లో భారత ఆటగాళ్లు తమ ర్యాంకులను నిలబెట్టుకున్నారు. బ్యాట్స్‌మెన్ విభాగంలో భారత కెప్టెన్ కోహ్లి 928 పాయింట్లతో నంబర్‌వన్ స్థానంలో కొనసాగుతుండగా.... 17 పాయింట్లు తేడాతో ఆస్ట్రేలియా మాజీ సారథి స్టీవ్ స్మిత్ రెండో స్థానంలో ఉన్నాడు. ఇక ఇతర భారత బ్యాట్స్‌మెన్‌లలో చతేశ్వర్ పుజారా (6), అజింక్య రహానే (9) తమ స్థానాలను కాపాడుకున్నారు. మయాంక్ అగర్వాల్, రోహిత్ శర్మలు ఒక్కో స్థానాన్ని మెరుగుపర్చుకుని వరుసగా 12, 13వ స్థానాల్లో నిలిచారు. ఇక బౌలింగ్ విభాగంలో భారత ఏస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా ఆరో స్థానంలో ఉండగా... స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఎనిమిది, పేసర్ షమీ తొమ్మిదో స్థానాల్లో నిలిచారు. ఈ విభాగంలో ఆసీస్ పేసర్ ప్యాట్ కమిన్స్ అగ్రస్థానంలో ఉన్నాడు.

# చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీకి కరోనా దెబ్బ

**బీజింగ్:** ప్రపంచ దేశాలను వణికిస్తోన్న కరోనా వైరస్ దెబ్బకు చైనా మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ వాయిదా పడింది. ఈ వైరస్ ప్రస్తుతం చైనాలో తీవ్ర ప్రభావం చూపిస్తుండటంతో ఆటగాళ్ల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని టోర్నీ షెడ్యూల్‌లో మార్పులు చేస్తున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. ఫిబ్రవరి 25 నుంచి ఆరు రోజుల పాటు లింగ్‌షుయ్‌లో ఈ టోర్నీ జరగాల్సి ఉంది. టోర్నీ ఎప్పుడు జరుగుతుందనే విషయమై ఇంకా ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు.

# భారత్‌కు ఎదురుందా!

- దుర్భేద్యంగా టీమిండియా
- తీవ్ర ఒత్తిడిలో కివీస్
- నేడు ఆఖరి పోరు

**మ.గం. 12.30 నుంచి స్టార్ స్పోర్ట్స్-1లో ప్రత్యక్ష ప్రసారం**

**మౌంట్‌మాంగనీ:** గతంలో రెండు సార్లు న్యూజిలాండ్‌కు వచ్చినా... పొట్టి సిరీస్ నెగ్గని భారత జట్టు ఇప్పుడు ఏకంగా క్లీన్‌స్వీప్ చేసేందుకు రెడీగా ఉంది. మరోవైపు సొంతగడ్డపై వరుస ఓటమిలతో సిరీస్‌ను కోల్పోయిన కివీస్ పరువు కోసం పాకులాడుతోంది. నేడు ఇరు జట్ల మధ్య ఆఖరి టి20 పోరు జరగనుంది. ఈ ఫలితంతో వచ్చే నష్టమేమీ లేకపోవడంతో భారత కెప్టెన్ కోహ్లి, రాహుల్‌లకు జట్టు మేనేజ్‌మెంట్ విశ్రాంతినిచ్చింది. దీంతో పొట్టి ప్రపంచకప్ ఏడాది సత్తాచాటుకునేందుకు రిజర్వ్ బెంచ్‌కు ఇది సదావకాశం. ఆఖరి పోరుకు 'హిట్‌మ్యాన్' రోహిత్ శర్మ సారథ్యం వహిస్తుండగా, పంత్‌కు తొలిసారిగా ఇక్కడ గ్లౌవ్స్ తొడుక్కునే అవకాశం వచ్చింది. గత మ్యాచ్‌లో విఫలమైన సంజూ సామ్సన్ ఇప్పుడు నిరూపించుకోవాల్సిన అవసరం వచ్చింది. అలాగే అయ్యర్, దూబేలు కూడా స్థిరమైన ప్రదర్శనపై దృష్టిపెట్టాలి. పాండేపై ఎవరికీ ఎలాంటి అనుమానం లేదు. ఇక బౌలింగ్‌లో భారత్ చాలా మెరుగ్గా కనిపిస్తుంది. రెండు 'టై' మ్యాచ్‌ల్లో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది బౌలర్ల గురించే. షమీ తర్వాత శార్దుల్ కూడా నాణ్యమైన డెత్ బౌలర్‌గా నిరూపించుకున్నాడు.

**ఎలా గెలవాలబ్బా!**

ఆతిథ్య జట్టు తీవ్ర ఒత్తిడిలో కూరుకుపోయింది. గెలుపు గడపదాకా రెండు సార్లు వచ్చినా... నెగ్గలేకపోవడం జట్టును నిరాశలో ముంచింది. ఇది చాలదన్నట్లు విలియమ్సన్ గాయం జట్టుకు మరింత ప్రతికూలంగా మారింది. సీనియర్ బ్యాట్స్‌మన్ రాస్ టేలర్ గెలిపించాల్సిన స్థితిలో బాధ్యతని నిర్వర్తించలేకపోతున్నాడు. ఇది న్యూజిలాండ్ జట్టును కలవరపెడుతోంది. అందరూ సమష్టిగా రాణించి భారత జోరుకు బ్రేక్‌వేసి కనీసం పరువు అయినా కాపాడుకోవాలని న్యూజిలాండ్ జట్టు ఆశిస్తోంది.



రోహిత్

# సెమీస్‌లో నార్త్ ఈస్టర్న్, చెన్నై సూపర్ స్టార్స్

**ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్**



సాత్విక్, జెస్సికా జంట

**సాక్షి, హైదరాబాద్:** ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్) ఐదో సీజన్‌లో చెన్నై సూపర్ స్టార్స్, నార్త్ ఈస్టర్న్ వారియర్స్ జట్లు సెమీఫైనల్లోకి దూసుకెళ్లాయి. ఇక్కడి జీఎంసీ బాలయోగి ఇండోర్ స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ స్టార్స్ 4–3తో అవధ్ వారియర్స్‌పై విజయం సాధించింది. దాంతో 19 పాయింట్లు సాధించిన చెన్నై పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచి నాకౌట్‌కు అర్హత సాధించింది. ఈ మ్యాచ్‌లో ఇరు జట్ల స్కోర్లు 3–3తో సమంగా ఉన్న సమయంలో... విజేతను నిర్ణయించే మ్యాచ్ అయిన మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్–జెస్సికా (చెన్నై) ద్వయం 15–11, 13–15, 15–14తో క్రిస్టీనా–కొ సుంగ్ హ్యూన్ (అవధ్) జంటపై అద్భుత విజయాన్ని సాధించింది. అంతకుముందు జరిగిన మరో మ్యాచ్‌లో నార్త్ ఈస్టర్న్ వారియర్స్ 5–0తో పుణే సెవెన్ ఏసెస్‌పై ఘనవిజయం సాధించింది. దాంతో 18 పాయింట్లతో రెండో స్థానంలో నిలవడంతో పాటు సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. నేటి మ్యాచ్‌లో ముంబై రాకెట్స్‌తో హైదరాబాద్ హంటర్స్ తలపడుతుంది.



● అల్లు అర్జున్

● త్రివిక్రమ్

● మీ ముందు వరకూ ఏ రైటరూ అంత రెమ్యూనరేషన్ తీసుకోలేదు. దాని గురించి?

**త్రివిక్రమ్:** మన సినిమాకి రైటర్ అవసరం ఉంది, కానీ వాడికి కావాల్సినంత గౌరవం ఇవ్వం. గొప్ప గొప్ప రచయితలను దగ్గర నుంచి చూశాను కాబట్టి అలా అనిపించింది. నాకు నేను చెప్పుకున్నది ఏంటంటే.. నువ్వైతే ఇలాంటి పరిస్థితులను మార్చేలా పనిచెయ్. దర్శకుడిని కూడా అవ్వాలని ముందే అనుకున్నాను. రచయితగా కొనసాగాలనుకోలేదు. బహుశా దాని వల్ల కూడా రచయితగా వచ్చిన అవకాశాలకు నో చెప్పేవాణ్ణి. పరిగెత్తుకెళ్లి ప్రతిదీ రాయాలనుకోలేదు. మీ మీద మీకు గౌరవం ఉంటే ఎదుటివాళ్లు కూడా గౌరవిస్తారు.

● ఈ సినిమాలో హ్యాండ్‌సమ్‌గా ఉన్నారు.. హెయిర్ స్టయిల్ కూడా కొత్తగా ఉంది..

**బన్నీ:** నేను, త్రివిక్రమ్‌గారు మా ఆఫీస్‌లో కలిసినప్పుడు సినిమాలో ఉన్నట్టు జుట్టు పెంచాను. త్రివిక్రమ్‌గారు 'ఈ హెయిర్ స్టయిల్ బావుంది, సినిమాలో వాడదాం' అన్నారు. ఇప్పటి వరకూ చేసిన సినిమాల్లో ఏదో హెయిర్ స్టయిల్‌లో కనిపించాను. ఫస్ట్ టైమ్ న్యాచురల్ స్టయిల్‌లో కనిపించాను. ఇది బాగుందంటున్నారు.

# అల.. విజయోత్సాహంలో...

(ఫ్యామిలీ మొదటి పేజీ తరువాయి)

**● 'అల... వైకుంఠ...' లో మీ పాత్రకు అసౌకర్యాలు మీ చెల్లెలి పాత్రకు సౌకర్యాలు. రియల్ లైఫ్‌లో మీరు ముగ్గురు అన్నదమ్ములు. మీ ఇంట్లో ఒకరిని తక్కువ చూడటం ఒకరిని ఎక్కువగా చూడటం ఉంటుందా?**

**బన్నీ:** (నవ్వుతూ). ముగ్గురు పిల్లలుంటే ఏదో విషయంలో ఒకరిని తక్కువ చేయడం ఉంటుంది. ఒకరిని ఎక్కువ, ఒకరిని తక్కువ ప్రేమిస్తారు. ఒకడికి ఎక్కువ కొనిస్తారు. ఒకడికి తక్కువ కొనిస్తారు.

**త్రివిక్రమ్:** సాధారణంగా పెద్దవాళ్లంటే తండ్రికి ఇష్టం. చిన్నవాళ్లంటే తల్లికి ఇష్టం. మధ్యలో వాళ్లంటే జనానికి ఇష్టం (నవ్వుతూ). మీకు (బన్నీ) సామాజిక న్యాయం జరిగింది అనుకోవచ్చు.

**● ఈ మధ్య మీ కథలను పరిశీలిస్తే ధనికులు, మధ్య తరగతి వాళ్ల చుట్టూ తిరుగుతున్నాయేమో?**

**బన్నీ:** ఉన్నవే మూడు క్లాసులు. పేద, మధ్య తరగతి, ధనిక. ఇవి కాకుండా ఇంకేం ఉంటుంది.

**త్రివిక్రమ్:** నిజానికి పేద అనేదానికి అర్థం మారిపోయింది. 1960 నుంచి 1980 వరకూ కథలన్నీ పేద–ధనిక మధ్య ఉండేవి. తర్వాత పేద, మధ్యతరగతి ఒకటైపోయాయి. వాటి మధ్య గీత చెరిగిపోయి ఏది ఏదో తెలియనటువంటి పరిస్థితి. రిచ్ పోయి సూపర్ రిచ్ అనేది ఒకటి వచ్చింది. ధనిక వర్గంలోనే మరో క్లాస్ వచ్చింది. పేద అనేది పోయి మధ్యతరగతి అయిపోయింది. ప్రస్తుత పరిస్థితుల్లో సినిమాలు చేస్తున్నాను కాబట్టి నా కథలన్నీ మిడిల్ క్లాస్‌కి, ధనిక వర్గానికి మధ్య జరుగుతుంటాయి. నాకు కనిపిస్తున్న రెండు క్లాసులు అవే కాబట్టి. ఒకవేళ సూపర్ రిచ్ మీద తీయాలంటే మన బడ్జెట్‌లు సరిపోవు.

**● 'అల.. వైకుంఠపురములో..' సుశాంత్ పాత్ర చూపించిన తీరు మధ్య తరగతి కుటుంబాల్లో పుట్టిన వాళ్లకు తెలివి తేటలు తక్కువుంటాయనే ఫీల్‌ని కలగజేస్తోందనే అభిప్రాయం వినిపిస్తోంది..**

**త్రివిక్రమ్:** సినిమాను మనం సూక్ష్మంగా విశ్లేషిస్తే అలా అనిపిస్తుంది. అది కేవలం ఒక కేస్.. అంతే. మధ్యతరగతి వాళ్లు తెలివితక్కువ వాళ్లు అని చెప్పాలనుకోలేదు. నాకు తెలిసిన మేధావులందరూ పేద, మధ్యతరగతి నుంచి వచ్చినవాళ్లే. వాళ్లే గొప్ప గొప్ప విషయాలు కనుగొన్నారు. ఇది కేవలం కథ. దీన్ని జనరలైజ్ చేయడం తప్పు. సుశాంత్ పాత్ర కూడా సక్సెస్ అయితే సంతృప్తి పడతారా? పడరు. అందుకే ఆ పాత్రను అలా డీల్ చేశాం.

**బన్నీ:** తెలివిగలవాళ్లు, తెలివి తక్కువవాళ్లు అన్ని తరగతుల్లోనే ఉన్నారు. ఈ క్లాస్‌వారికి ఇన్ని తెలివితేటలుంటాయి, వీళ్లకు ఉండవు అనలేం.

**త్రివిక్రమ్:** వాళ్లు వాదించే కేస్‌కి సమాధానం చెప్పాలంటే ఈ సినిమాలో రామచంద్ర (జయరామ్), మురళీ శర్మ (వాల్మీకి) మధ్యతరగతివాళ్లే. కానీ రామచంద్రకు ఐక్యూ ఉంటుంది. ధనవంతుడిగా ఎదిగిన మధ్యతరగతి వ్యక్తే కదా అతను. కాబట్టి మధ్యతరగతి వాళ్లను తెలివితక్కువవాళ్లుగా చూపిస్తాననే వాదనకి ఈ పాత్రను ఉదహరించి కౌంటర్ ఇవ్వొచ్చు.

**● మీ సినిమాల్లో హీరోయిన్లని కొంచెం తెలివితక్కువగా చూపిస్తారనే వాదన కూడా ఉంది?**

**త్రివిక్రమ్:** 'అరవింద సమేత, అల వైకుంఠపురములో' అలా చూపించలేదు కదా. ఆ రెండు సినిమాల్లోనూ హీరోయిన్ చాలా తెలివితేటలు ఉన్న అమ్మాయే. మనం 'ఇకపై అంతా సుఖాంతం' అనే వాక్యంతో కథలను ముగిస్తాం. కానీ వాళ్లు ఉంటారో ఉండరో మనకు తెలియదు నిజంగా. నేను నిజాయితీగా నమ్మేది ఏంటంటే.. మన తెలివితేటలన్నీ మన పనుల్లో పెట్టి మనుషులతో మాట్లాడేటప్పుడు ఎంత అమాయకంగా, ఎంత సింపుల్‌గా ఉంటే అంత సుఖం. నేను అది పాటించడానికి నిరంతరం ప్రయతిస్తుంటా. మగవాళ్ల కంటే ఆడవాళ్లు చాలా సింపుల్‌గా ఉంటారని నా ఫీలింగ్. చాలామంది అంటారు ఆడవాళ్లు చాలా లోతు అయినవాళ్లు, క్లిష్టంగా ఉంటారని. అయితే వాళ్ల సింప్లిసిటీని కొంతమంది తప్పుగా చూశారేమో? అని నా ఫీలింగ్. ఆ నిరాడంబరత్వాన్ని చూపిస్తున్నాను. అంతే.

**● మీ సినిమా టైటిల్స్‌కి 'అ' అక్షరం మీద ఎక్కువ ఆధారపడుతుంటారు కాబట్టి మీ జీవితంలో అ (అమ్మ) ఆ (ఆలి) గురించి కొన్ని విషయాలు..**

**త్రివిక్రమ్:** మా అమ్మ నా సినిమాలు ఏవీ చూడలేదు. ఎప్పుడైనా టీవీలో వస్తే చూస్తారు. చూశాక ఏరా నువ్వే తీశావా? అని ఫోన్ చేస్తారు. ఆమె థియేటర్‌కి వెళ్లి సినిమాలు చూడటం మానేసిన తర్వాత నా సినిమా ప్రయాణం మొదలయింది. అందుకే ఆవిడ సినిమాలు పెద్దగా పట్టించుకోరు. వాటి గురించి మాట్లాడి నేనూ పెద్ద ఇబ్బంది పెట్టను. నా భార్య అన్ని సినిమాలూ చూస్తుంది. తెలుగు ప్రేక్షకులందరూ తనలా ఉండాలని కోరుకుంటాను. ఎందుకంటే తనకి ఏ సినిమా అయినా నచ్చుతుంది. ప్రేక్షకులు కూడా తనలా ఉంటే మా (సినిమా పరిశ్రమవారి) జీవితాలన్నీ ఆనందంగా ఉంటాయి. సినిమాల పరంగా చెప్పాలంటే అది. గౌరవంగా చెప్పాలంటే వాళ్లను గౌరవించకపోతే జీవితం ముందుకు నడవదు. వాళ్ల మీద ఉన్న గౌరవం, ప్రేమని బాహాటంగా పంచుకోవడం అవసరం అని వాళ్ల గురించి మాట్లాడను. వాళ్లు ఇబ్బంది పడతారని వాళ్ల గురించి మాట్లాడను.

**● ఈ సినిమా సక్సెస్ కేవలం త్రివిక్రమ్‌గారిదే అని ఇటీవల సక్సెస్ మీట్‌లో బన్నీ అన్నారు?**

**త్రివిక్రమ్:** హిట్ కూడా అందరిదే.

**బన్నీ:** అందరి కృషి ఉంది.. అందులో డౌట్ లేదు. అయితే సినిమా సక్సెస్‌కి ఒక్క కారణం చెప్పాలంటే మాత్రం కచ్చితంగా దర్శకుడే అని చెబుతాను.

**● మీ ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి' ఎమోషనల్‌గా ఉంటాయి. అందుకే మూడోసినిమా వినోద ప్రధానంగా చేయాలనుకున్నారా?**

**బన్నీ:** సన్నాఫ్ సత్యమూర్తి కథలోనే కొంచెం బరువుంది. కథ ఎక్కువుంటే వినోదానికి స్కోప్ తగ్గిపోతుంది. ఎక్కువ వినోదం ఉండే సినిమా చేయాలని ముందే అనుకున్నాం. అలాంటి సినిమా చేయాలంటే మనం కూడా ఎక్కువ ఆలోచించకూడదు. ఎక్కువ ఆలోచిస్తే కచ్చితంగా పాడు చేస్తాం (నవ్వుతూ). అందుకే ఎక్కువ ఆలోచించకుండా లైట్ మైండ్‌తో ఈ సినిమా చేశాం.

**● ఈ మధ్య మీ నాన్నగారి (అల్లు అరవింద్) గురించి 'అల....' ఫంక్షన్‌లో మాట్లాడుతూ భావోద్వేగానికి లోనయ్యారు. మీరు తండ్రి అయిన తర్వాత తండ్రి విలువ ఇంకా బాగా అర్థం అయిందా?**

**బన్నీ:** అది ఒక కారణం. ఆయన నా తండ్రి అని మాత్రమే ఆ వేదిక మీద మాట్లాడలేదు. ఒక వ్యక్తిగా ఆయనేంటో చెప్పాలని కూడా మాట్లాడాను. నాన్నగారి గురించి ఎంత చెప్పినా కూడా తక్కువే. నేను చూసిన వ్యక్తుల్లో అద్భుతమైన మనిషి అయ్యారు. మా అదృష్టం కొద్దీ ఆ వ్యక్తి మా తండ్రి అయ్యారు. ఆ మంచి వ్యక్తి గురించి చెబుతున్నప్పుడు నేను అందుకే ఎమోషనల్ అయ్యాను.

**● మీతో సినిమాలు చేసిన హీరోలు ఆధ్యాత్మిక బాటలో వెళతారేమోననే ఫీలింగ్ కలుగుతోంది...**

**బన్నీ:** ప్రశ్న మిమ్మల్ని (త్రివిక్రమ్) అడిగినా నన్ను చూస్తూ అడుగుతున్నారు (నవ్వుతూ).

**త్రివిక్రమ్:** నాకైతే అలాంటిదేమీ అనిపించదు. అయితే నాతో నేను ఏం ప్రయత్నిస్తానంటే... నిజాయితీగా ఉండటం. చిన్న చిన్న విషయాలకు అబద్ధాలు చెప్పకు, ఎవ్వరినీ ఇబ్బంది పెట్టకు, పడకు. ఇంతకుమించి పెద్ద రూల్స్ ఏం ఉండవు. ఇది పాటించడం వల్ల మనం, మన చుట్టూ ఉండేవాళ్లు అందరూ సుఖంగా జీవించొచ్చు. నాకు ఫోన్ చేయడానికి ఎవ్వరూ ఇబ్బందిపడరు. నేను ఫోన్ చేస్తే తీయడానికి ఇబ్బంది పడరు. మనుషులు అంతిమంగా కోరుకునేది సుఖమే కదా. డబ్బు, పేరు, ప్రతిష్ఠ కంటే కూడా సుఖమే ఎక్కువ కోరుకుంటారు.

**● త్రివిక్రమ్‌తో సినిమా చేసే హీరోలందరూ ఆయన్ను పొగడ్తలతో ముంచెత్తుతారు. ఆయనతో మూడు సినిమాలు చేశారు.. ఏం మాయ చేస్తారో చెప్పండి?**

**త్రివిక్రమ్:** మాయలేవీ లేవండీ..

**బన్నీ:** త్రివిక్రమ్‌గారితో పని చేసే యాక్టర్స్ అందరూ సుఖంగా ఉంటారు. షూటింగ్ ప్రయాణాన్ని ఎప్పటికీ గుర్తుండిపోయేలా చేస్తారాయన. కొన్నిసార్లు షూటింగ్ ప్రాసెస్‌ను ఆనందించకపోవచ్చు, కానీ సినిమా పెద్ద హిట్ అవ్వొచ్చు. త్రివిక్రమ్‌గారితో రిజల్ట్‌తో సంబంధం లేకుండా ప్రాసెస్‌ను బాగా ఎంజాయ్ చేయొచ్చు. సినిమా కథలన్నీ నిజం కాదు. కానీ చిత్రీకరణ సమయంలో జరిగిన ప్రయాణం మాత్రం నిజం. ఆ వంద రోజుల ప్రయాణం నాకు నిజం.

**● బయట వాళ్లకు ఎలా అనిపిస్తుందంటే మీ నుంచి బోధనలు ఎక్కువ ఉంటాయేమో అని..**

**త్రివిక్రమ్:** అస్సలు ఉండవు.

**బన్నీ:** మిమ్మల్ని గురూజీ అని పిలిస్తే... అందరూ మీరు గురుకులం నడుపుతున్నారనుకుంటున్నారేమో (నవ్వు).

త్రివిక్రమ్: గురువు అనేది చాలా పెద్ద మాట. దానికి నేను అర్హుడిని కాదు. నిజానికి ఈ తరంలోనే గురువులు లేరని నా అభిప్రాయం. నేను మహానుభావులు అనుకునేవాళ్లే.. వాళ్లు గురువులో కాదో అనే సందేహం వ్యక్తం చేసినప్పుడు ఇక అసలు మనమెంత? గురూజీ అనే పదం అసంబద్ధం. మాటల మాంత్రికుడు అనేది కూడా అంతే అసంబద్ధం. అలా అనొద్దని అందరికీ చెప్పి ఆపించలేను. మాటల మాంత్రికుడు అనేదాన్ని భరించడమే తప్ప ఆనందించడమైతే ఏమీ ఉండదు.

**● న్యూ ఏజ్ సినిమాలు వస్తున్నాయి. కొత్త ఆలోచనలతో కొత్త దర్శకులు వస్తున్నారు. దానివల్ల స్టార్ డైరెక్టర్లందరూ జాగ్రత్తగా సినిమాలు తీయాలంటారా?**

**త్రివిక్రమ్:** కరప్ట్ అవ్వనంత వరకూ మనం ఎవ్వర్ని మెచ్చుకున్నా ఏ సమస్యా లేదు. అవతలి వాడి విజయం వల్ల మనం కరెప్ట్ అవ్వకూడదు. ఆలోచనా విధానంలో కరెప్ట్ అవ్వకూడదు. అది ఆలోచనా విధానంలో అయినా, ఫాలో అవ్వడం అయినా, ప్రభావితం అయినా సరే. ఇవన్నీ కరెప్షన్ కిందకే వస్తాయి. ప్రేక్షకులు మనం చేసేది నచ్చే ఇక్కడి వరకూ తీసుకొచ్చారు. ఇప్పుడు ఇంకొకళ్లు నచ్చారంటే మనం నచ్చలేదు అని అర్థం కాదు. వాళ్లు కూడా నచ్చారని. దాన్ని అర్థం చేసుకునే పరిపక్వత మనకు ఉండాలి. వాళ్లే నచ్చారు నేను నచ్చడం లేదేమో? అని వాళ్లు తీసినట్లు సినిమాలు తీయకూడదు. వాళ్లు తీసే ఒక్క సినిమాయే నచ్చి రెండో సినిమా నచ్చకపోతే నాది ఆ ఒక్క సినిమాయే నచ్చిందేమో అని వాళ్లూ బాధపడకూడదు. ఇది ప్రతివాళ్లకూ ఉండే సమస్య.

**● మీరు చేసిన హీరోలందరితో క్లోజ్‌గా ఉంటారు. కానీ వాళ్ల మధ్య మార్కెట్ పరంగా పోటీ ఉంటుంది. దాన్ని ఎలా బ్యాలెన్స్ చేస్తారు?**

**త్రివిక్రమ్:** వ్యక్తిగత ఈక్వేషన్లు వేరు. వ్యక్తిగతంగా మాట్లాడుకునేప్పుడు వ్యక్తిగతంగానే ఉండాలి. సినిమాకి పని చేస్తున్నప్పుడు మన సమయాన్ని, శక్తిని మొత్తం దానికే కేటాయించాలి.

**● జనరల్‌గా ఒక సినిమా రిలీజయ్యాక ఓ వారం దాని గురించి మాట్లాడతారేమో. మీరేమో రెండు వారాలైనా ఇంకా మాట్లాడుతున్నారు. రీజన్ ఏంటి?**

**త్రివిక్రమ్:** ఈ సినిమా మా నుంచి ఎక్కువ పనిని కోరుకుంది. ఎప్పుడూ చేయనన్ని గంటల ఎడిటింగ్ ఈ సినిమా కోసం చేశాం. కథ రాసినంత వరకే మనం రాజులం. పూర్తయ్యాక దానికి బానిసలం. ఈ సినిమా ఇంకా డబ్బులు తెస్తున్నాను.. మీరు మాట్లాడండి అంటోంది. మాట్లాడుతున్నాం. మా అమ్మగారు ఫోన్ చేసి, ఎప్పుడొస్తావ్ రా అన్నారు. ఊరెళ్లాలని ఉంది కానీ అవ్వడం లేదు.

**బన్నీ:** మామూలుగా విడుదలైన రెండు వారాల తర్వాత సినిమాతోపాటు మా పని కూడా అయిపోతుంది. కానీ ఈ సినిమా బాగా నడుస్తోంది. అందుకే మాట్లాడుతున్నాం.

**త్రివిక్రమ్:** అంతమంది జనం థియేటర్స్‌కి వచ్చి చూస్తున్నారంటే దాన్ని మనం గౌరవించాలి కదా. మాట్లాడాలి కదా.

**● మీ కాంబినేషన్‌లో మళ్లీ సినిమా ఎప్పుడు?**

**బన్నీ:** పెద్ద ఎక్కువ ఉండకపోవచ్చు.

**– డి.జి. భవాని, గౌతమ్ మల్లాది**

## దిశ ఘటనపై సినిమా తీస్తున్నా



● రామ్‌గోపాల్ వర్మ

నిర్భయ సంఘటన తర్వాత ఇటీవల జరిగిన దిశా అత్యాచారం ఘటన దేశాన్ని మరోసారి ఉలిక్కిపడేలా చేసింది. ఇప్పుడు దిశా ఘటనపై సినిమా చేస్తున్నట్టు ప్రకటించారు సంచలన దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ. ఈ విషయం గురించి ఆయన మాట్లాడుతూ – ''దిశా ఘటనలో దిశా శరీరాన్ని పెట్రోల్‌తో కాల్చేసి దారుణానికి పాల్పడ్డారు రేపిస్టులు. ఆ రేప్ చేసినవాళ్ల మానసిక స్థితి ఏంటి? దిశను ఎందుకు చంపారు? అని ఈ సినిమాలో చూపించబోతున్నాను. రేపిస్టులందరూ గతంలో జరిగిన రేప్ కేసుల్లో జరిగిన తప్పులు చేయకూడదనుకుంటున్నారు కానీ మానభంగం చేయకూడదు అని మాత్రం అనుకోవడం లేదు'' అన్నారు.

## వస్తున్నాం.. హైస్సా



● శర్వానంద్

హీరో శర్వానంద్ రైతుగా నటిస్తున్న తాజా చిత్రం 'శ్రీకారం'. ఈ చిత్రంలో ప్రియాంకా అరుల్ మోహన్ కథానాయికగా నటిస్తున్నారు. 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. ఈ ఏప్రిల్ 24న ఈ చిత్రం విడుదల కానుంది. 'పట్టరా పట్టు హైస్సా.. ఎత్తరా ఎత్తు హైలెస్సా!!, వసున్నాం రా హైస్సా.. ఏప్రిల్ 24న హైలెస్సా'' అని చిత్రబృందం విడుదల తేదీని అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమాకు మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నారు. రచయిత సాయి మాధవ్ బుర్రా మాటలు అందించారు. హరీష్ కట్టా ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్.

## ఒకటే నినాదం.. సోలో బ్రతుకే సో బెటర్



● సాయితేజ్

సాయితేజ్ హీరోగా సుబ్బు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సోలో బ్రతుకే సో బెటర్'. ఈ చిత్రంలో నభా నటేష్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. బి. బాపినీడు సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రాన్ని మే 1న విడుదల చేయనున్నట్లు శనివారం అధికారికంగా ప్రకటించారు. అలాగే ఈ నెల రెండో వారంలో ఈ చిత్రం థీమ్ వీడియోను విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ వైజాగ్‌లో జరుగుతోంది. ''సోలో సోదర సోదరీమణులారా.. ఈ వేలెంటైన్స్ వీకెండ్‌ని మనం అంతా కలిపి జరుపుకుందాం.. మన నినాదం ఒకటే.. సోలో బ్రతుకే సో బెటర్'' అన్నారు సాయితేజ్.



● ఉషా మూల్పూరి

''@నర్తనశాల' (2018) సినిమా తీసి తల్లిదండ్రులను బాధ పెట్టానని శౌర్య ఫీలయ్యాడు. మా బ్యానర్ నుంచి అలాంటి సినిమా వచ్చినందుకు నిర్మాతగా నేను బాధపడ్డాను. శౌర్య కెరీర్‌లో అది బిగ్గెస్ట్ డిజాస్టర్. ఆ బాధను తీసేసేలా 'అశ్వథ్థామ' మంచి సంతోషాన్ని ఇచ్చింది'' అన్నారు నిర్మాత ఉషా మూల్పూరి

## మా శౌర్య చిన్నప్పట్నుంచి మాస్

(నాగశౌర్య తల్లి). రమణతేజ దర్శకత్వంలో నాగశౌర్య హీరోగా శంకర్‌ప్రసాద్ సమర్పణలో ఉషా మూల్పూరి నిర్మించిన చిత్రం 'అశ్వథ్థామ'. నాగశౌర్య ఈ సినిమాకు కథ అందించారు. జనవరి 31న ఈ చిత్రం విడుదలైంది. ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని చిత్రబృందం చెబుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో నిర్మాత ఉషా మూల్పూరి మాట్లాడుతూ – ''మా చిత్రానికి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. కె. రాఘవేంద్రరావుగారు, నందినిరెడ్డిగారు ఫోన్ చేసి అభినందించారు. శౌర్య కెరీర్‌లోనే బిగ్గెస్ట్ ఓపెనింగ్స్ వస్తున్నాయి. చిత్రం చాలా బాగుందని, ఇంకా మూడు నుంచి నాలుగు వారాలు థియేటర్స్‌లో బాగా ఆడుతుందని డిస్ట్రిబ్యూటర్స్ చెబుతుండటం సంతోషాన్నిచ్చింది. యూత్ బాగా కనెక్ట్ అయ్యారు. ఫ్యామిలీ ఆడియన్స్ సినిమాను ఆదరిస్తున్నారు. మనకు ఒక నిర్భయ, దిశ కేసులు తెలుసు. కానీ 'అశ్వథ్థామ'లో చూపించిన విధంగా కూడా జరుగుతుందని మనలో చాలా మందికి తెలియదు. కథ పరంగా శౌర్యకు మంచి స్పందన వస్తోంది. శౌర్య ఇలాంటి కథ రాసినందుకు ఒక నిర్మాతగా కంటే కూడా ఒక తల్లిగా బాగా సంతోషపడుతున్నాను. కథ చెప్పినప్పుడు శౌర్య సామాజిక బాధ్యతతో ఆలోచిస్తున్నాడని మేం ఎమోషనల్‌గా కనెక్ట్ అయ్యాం. 'అశ్వథ్థామ' చిత్రంతో శౌర్యలోని మాస్ యాంగిల్‌ని ప్రేక్షకులు బాగా రిసీవ్ చేసుకున్నారు. కమర్షియల్ హీరోతో సినిమా చేయాలనుకునేవారికి శౌర్య కూడా ఒక మంచి ఆలోచన. నిజానికి చిన్నప్పటి నుంచి కూడా శౌర్య ఫుల్ మాస్. సాఫ్ట్ క్యారెక్టర్ కాదు. కానీ ఇండస్ట్రీలో క్యూట్ అండ్ లవర్‌బాయ్ అనే పేరు వచ్చింది. శౌర్య అనుకోకుండా ఇండస్ట్రీలోకి వచ్చాడు. హీరో అయ్యాడు. ఇప్పుడు రైటర్ అయ్యాడు. భవిష్యత్‌లో దర్శకుడు అవుతాడేమో ఇప్పుడే తెలియదు. ఇండస్ట్రీకి మేం చాలా ప్యాషనేట్‌గా వచ్చాం. మా బ్యానర్‌లో తర్వాతి చిత్రం వేరే హీరోతో ఉండొచ్చు. మా బ్యానర్‌లో అందరి హీరోలతో సినిమాలు చేయాలనుకుంటున్నాం. మా అబ్బాయి ఒక్కరే హీరో కాదు కదా! రాఘవేంద్రరావుగారితో శౌర్య సినిమా కోసం చర్చలు జరుగుతున్నాయి'' అన్నారు.

## త్రీ మంకీస్ పైసా వసూల్ చిత్రం



● రాంప్రసాద్, సుధీర్, శ్రీను

'జబర్దస్త్' షో ద్వారా పాపులర్ అయిన సుధీర్, గెటప్ శ్రీను, రాంప్రసాద్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'త్రీ మంకీస్'. జి. అనిల్ కుమార్ దర్శకత్వంలో ఈ సినిమాను జి. నగేష్ నిర్మించారు. కారుణ్య చౌదరి కథానాయిక. ఫిబ్రవరి 7న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ – ''కామెడీతో పాటు అన్ని అంశాలుంటాయి. పక్కా పైసా వసూల్ చిత్రమిది'' అన్నారు. ''త్రీ మంకీస్' చిత్రం మా బ్యానర్‌కి మంచి పేరు తీసుకొస్తుందనుకుంటున్నాను'' అన్నారు నగేష్. ''మేం ముగ్గురం కలసి సరదాగా నటించాం. ప్రేక్షకులు మమ్మల్ని ఆశీర్వదిస్తారనుకుంటున్నాను'' అన్నారు సుధీర్. ''రిలీజ్ కోసం ఎంతో ఉత్కంఠగా ఎదురు చూస్తున్నాం'' అన్నారు గెటప్ శ్రీను. ''సినిమా తప్పకుండా సక్సెస్ అవుతుంది అనుకుంటున్నాను'' అన్నారు రాంప్రసాద్. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: సాయి బాబు వాసిరెడ్డి, లైన్ ప్రొడ్యూసర్: కృష్ణ సాయి.









epaper.sakshi.com